# చదువు సంధ్యలు

కథా సంకలనం



ప్రజాశక్తి బుక్‌హౌస్

# చదువు సంధ్యలు

## కథా సంకలనం


సంకలనం

**వి. బాలసుబ్రమణ్యం**



**ప్రజాశక్తి బుక్‌హౌస్**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*
*హైదరాబాద్-20. ఫోన్ : 27660013*

92774

అనువాదం : ఎ.జి.యతిరాజులు

ప్రచురణ సంఖ్య : 902
ప్రథమ ముద్రణ : జనవరి, 2000
ద్వితీయ ముద్రణ : అక్టోబరు, 2004
తృతీయ ముద్రణ : నవంబర్, 2013

వెల : ₹ 40

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు
హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

# విషయసూచిక


| | | |
|---|---|---|
| మామాట | | ..................... 5 |
| చిలక చదువు | **రవీంద్రనాథ్‌టాగూర్** | ..................... 7 |
| గోరింక గూడు | **భీష్మ సహానీ** | ................... 13 |
| చింగ్ చదువు | **లావ్ సియాంగ్** | ................... 21 |
| అడవి పువ్వు | **బి.మురళీధర్** | ................... 31 |
| జటిన్ | **శ్రీ జయ చార్** | ................... 41 |
| లేగదూడ– చదువు | **సత్యం శంకరమంచి** | ................... 49 |
| అవార్డు | **టి.యమ్.సుబ్బరాయ** | ................... 53 |
| జీవితం | **జేక్ కోప్** | ................... 59 |
| ద్వంద్వ సమాసం | **మధురాంతకం రాజారాం** | ................... 67 |
| విఘాతం | **కె.ఆదర్శ సామ్రాట్** | ................... 77 |

# మా మాట

**ఈ** కథలన్నీ మన చదువుల చుట్టూ తిరిగేవి. మన పిల్లల చుట్టూ అల్లుకొన్నవి. మనం ప్రాణానికి ప్రాణంగా పెంచుతున్న పిల్లల్ని గురించీ, మనం అనునిత్యం తహతహలాడుతున్న వాళ్ళ చదువుల్ని గురించి పలు కోణాలు స్పృశిస్తూ చెయి తిరిగిన రచయితలు చెప్పుకొచ్చినవి.

సామాజిక జీవనరంగాల్లోకెల్లా ఎంతో విలువైంది విద్యారంగం. చిన్నపిల్లల విద్య మరీ విలువైంది. పిల్లల మనోభావాల్ని, ఆసక్తుల్ని, శక్తి సామర్థ్యాల్ని, అవసరాల్ని ఈ విద్య ఏ మాత్రం పట్టించుకొంటోంది? వీటిని గురించి మనమూ పట్టించుకోవల్సి వుందని పెద్దలమైన మనమెప్పుడైనా అనుకొంటున్నామా? పిల్లలకూ వ్యక్తిత్వం ఒకటి వుంటుందని, హక్కులు కొన్ని వుంటాయని, ప్రజాస్వామ్యం కొంత అవసరమని మనమెప్పుడైనా ఒప్పుకొంటున్నామా? ఈ ప్రశ్నల్ని ఇందులోని ఒక్కో కథా ఒక్కొక్క రూపంలో ముందుకు తెస్తాయి. పెట్టుబడిదారీ సమాజపు వైపరీత్యాలు, వ్యాపార వ్యామోహాలు విద్యా విలువల్ని, పిల్లలపట్ల ఆప్యాయతానురాగాల్ని ఎంత విధ్వంసం చేశాయో కళ్ళకు కట్టిస్తాయి. ఎంతో శ్రద్ధ పెడుతున్నామని, ఎంతో ఖర్చు చేస్తున్నామని, ఎన్నో ఆధునిక పద్ధతులు పాటిస్తున్నామని, ఎన్నో కష్టనష్టాల కోర్చి నేర్పిస్తున్నామని మనుమనుకొంటున్న చదువులు ఎంత డొల్ల చదువులో, ఎంత వికృత విన్యాసాలో అరిటిపండు వొలిచిపెట్టినట్టు చెప్పడమే గాదు, ఈ కథలు మన పిల్లలెంత ప్రేమమూర్తులో,

వాళ్ళరంగు రంగుల మనోభావాల్ని విశ్లేషించడం ఎంత కష్టమో వాళ్ళ హృదయాల్లోకి తొంగి తొంగి చూపిస్తాయి. విద్యారంగంలో రావలసిన మార్పులను గుర్తు చేస్తాయి. వారసత్వంగా ఈ కథలు, మనకు అప్పగించిన మహా రచయితలకు జేజేలు. మన కాలంలో అలాటి మంచి కథలు సృష్టించి అందించిన వారికి కృతజ్ఞతలు.

**- ప్రచురణ కర్తలు**

# చిలక చదువు

**- రవీంద్రనాథ్‌ఠాగూర్**

**అ**నగనగా ఒక చిలక ఉండేది. అది వొట్టి మూర్ఖురాలు దానికి పాడటం వచ్చుగాని శాస్త్రం ఒక్క ముక్కా రాదు. ఎప్పుడూ ఎగరడం, గెంతడం తప్ప క్రమశిక్షణంటే దానికేం తెలీదు.

'అడవి పళ్ళుతినే పక్షి మా పళ్ళ బజారుకు చేటు తేవడానికి వచ్చినట్టుంది' అనుకొన్నారు రాజుగారు.

మంత్రిగార్ని పిలిచి 'ఈ పక్షికి చదువు నేర్పండి' అని ఆదేశాలు జారీ చేశారు. రాజుగారి మేనల్లుళ్ళకు ఆ పక్షికి చదువు చెప్పే బాధ్యత అప్పగించబడింది.

రాజు పండితులందరితో కొలువుదీరాడు. వాదోపవాదాలు జరిగాయి. ' ఈ పక్షి ఇలా నిరక్షరకుక్షి గావడానికి కారణాలేమిటి? అని పండితులందరూ తీవ్రాతితీవ్రంగా చర్చించారు.

చివరకు మహా పండితులంతా ముక్త కంఠంతో ఒక నిర్ణయానికి వచ్చారు. "ఈ పక్షి గూడు చాలా చిన్నది. దీని గూడు ఎంత చిన్నదంటే ఇందులో విద్యలాంటి బరువైన వస్తువు పెట్టుకొనడానికి చోటేలేదు. అందుకని అత్యవసరంగా ముందు దీనికో పెద్ద ఇల్లు (అందమైన పంజరం) నిర్మించాలి' ఇదీ పండితుల తీర్మానం.

రాజుగార్కి ఈ సలహా అద్భుతంగా నచ్చింది. మరి ఎక్కడెక్కడి మహాపండితులు తమ తార్కిక పాటవంతో చర్చించి చేసిన సలహా ఇది! రాజుగారు పండితులందరికీ అంతులేని దక్షిణలిచ్చారు. వారు అపారమైన సంతోషంతో, సంపాదనతో ఇళ్ళకు వెళ్ళిపోయ్యారు.

కంసాలిని పిలిపించారు. పంజరం పని అప్పగించారు. పంజరం అద్భుతంగా తయారైంది. దాన్ని చూడడానికి తండోపతండాలుగా ప్రజలు రాసాగారు. వచ్చిన వారు "సౌందర్య మర్మం తెలిసిన రసజ్ఞ శిఖామణులు' గదా అందువల్ల ఒక్కొక్క ఒక్కోరకంగా వ్యాఖ్యానించారు. 'ఇంతమంచి పంజరంలో ఇక చదువు రాకపోవడమేమిటి' అన్నారొకరు. 'చదువు లేకుంటేనేం పంజరం తయారైంది" అన్నారింకొకరు. 'ఆ పక్షి భాగ్యం కాకపోతే ఏమిటండీ ఇదంతా' అని చమత్కరించారు మరొకరు.

కంసాలి పంట పండింది. సంచుల సంచుల బహుమానాలు దక్కాయి.

మళ్ళీ పండితులంతా బారులు తీరి కూర్చున్నారు. నశ్యాలు ముక్కులనిండా దట్టించారు. 'పక్షికి చదువు చెప్పడమంటే మాటలా? ఇప్పుడున్న గ్రంధాలు సరిపోవు. క్రొత్త గ్రంథాలు కావాలి మరి' అని తీర్మానించారు.

ఇంకేముందీ? ఎప్పుడెప్పుడా అని కాచుక్కూచున్న రాజుగారి మేనల్లుళ్ళు తక్షణం వ్రాతగాళ్ళని పిలిపించారు. వాళ్ళు మాత్రం ఆవురావురుమంటూ లేరేమిటి? గ్రంథాలు రాసేపని మొదలైంది. వాటికి నకళ్ళు తీస్తున్నారు. ఆనకలుకు నకళ్ళు తయారవుతున్నాయి. చూస్తుండగానే కొండంత ఎత్తు గ్రంథాలు తయారైపోయాయి. చూచిన వాళ్ళంతా ఈ అమోఘ కృషికి విస్తుపోయారు. 'శభాష్ శభాష్ అంటూ చప్పట్లు చరిచారు. ' ఈ చదువంతా ఎక్కడ పెట్టాలి?, అని కొందరు గుసగుసలాడారు.

వ్రాతగాళ్ళందరికీ మంచి పారితోషికాలు లభించాయి. ఎడ్ల బళ్ళన్నీ ఆ పారితోషికాలతో నిండి పోయాయంటే నమ్మండి ఎద్దులు ఇళ్ళవైపు పరుగులు తీశాయి. ఇప్పుడు రాజ్యంలో వ్రాతగాళ్ళ ఇళ్ళన్నీ సిరిసంపదలతో కళకళలాడుతున్నాయి. ఒక్క లోటుంటే ఒట్టు!

ఇప్పుడు రాజుగారి మేనల్లుళ్ళకు మరో సమస్య వచ్చి పడింది. ఆ బంగారపు పంజరాన్ని కాపాడాలి. అది లేకుంటే చిలక చదువు కుదరనే కుదరదు. ఇంకొవైపు మరో సమస్య కూడా వాళ్ళనెత్తిన ఉంది. వాళ్ళు ఎన్నో పనులు చెయ్యాలి. మందిరాన్ని, పరిసరాల్ని శుభ్రంగా ఉంచాలి. అవసరమైన మార్పులు చేయించాలి. మరమ్మతులు చేయించాలి.

అయినా వాళ్ళు అద్భుతంగా, అత్యంత సమర్థవంతంగా ఈ పనులు నిర్వహిస్తున్నారు. పంజరం ఎప్పుడూ తళతళలాడుతోంది. అందరూ ఈ ఆర్భాటమంతా చూసి 'పని మహావేగంగా జరిగిపోతుంది' అని చెప్పుకోసాగారు.

ఇంత భారీ పనికోసం ఎందరో పనివాళ్ళు కావాలి గదా, ఎక్కడెక్కడి మనుషుల్ని, నిపుణుల్ని పిలిపించారు. ఈ ఘనకార్యంలో వేలాదిమంది నిమగ్నమైపోయారు. రోజు రోజుకీ వీళ్ళ సంఖ్య పెరిగిపోతుంది. ఆ పని వారి మీద నిఘా కోసం మరి కొందరు పనివాళ్ళు. వీళ్ళందరి జీతాలు చెల్లించడానికి, లెక్కలు రాయడానికి ఇంకా కొందరు పనివాళ్ళు వచ్చారు. జమాఖర్చుల కోసం రిజిష్టర్లు పెట్టారు. వీటిని అక్షరం తప్పుపోకుండా నింపుతున్నారు.

ఈ మహాత్కార్య పరిశీలన కోసం, చూడడానికి రాజుగారి బంధువులు విచ్చేశారు. మామయ్యల కొడుకులు, అత్తయ్యలు, బాబాయిల పిల్లలు ఒక్కరేమిటి ఎక్కడెక్కడి వారూ వచ్చి అంతఃపురాల్ని సైతం ఆక్రమించుకొని పరువులు పరుచుకొని. హాయిగా విశ్రాంతి తీసుకోసాగారు. వాళ్ళ మర్యాదల కోసం మళ్ళీ కొత్త కొత్త నౌకర్లు కావల్సివచ్చారు. అందరికీ జీతాలు సక్రమంగా అందుతున్నాయి.

అయితే ఏం లాభం? ఈ లోకంలో విమర్శకులకీ, వ్యాఖ్యానించే వాళ్ళకి కూడా లోటు లేదుగా, నిందించే వారు కోకొల్లలుగా, వీళ్ళ నోళ్ళకు తాళాలు లేవు గాబట్టి 'పంజరం మాత్రం తళతళ లాడుతోంది. పక్షిని పట్టించుకొనే వాడు లేదు. అంతా హంగామా తప్ప అసలు పని పిసరంతైనా లేదు" అని కొందరు గుసగుసలాడసాగారు.

రాజుగారి చెవికి ఈ పుకారు సోకింది. ఆయన తన మేనల్లుళ్ళల్లోకెల్లా ఉత్తముడైన మేనల్లుడిని పిలిచి 'నా ముద్దుల తండ్రీ' నేనేం వింటున్నాను నాయనా!' అన్నారు.

ఆ మేనల్లుడు తన సహజధోరణిలో "మహారాజా తమరు సర్వేశ్వరుని వలె సర్వజ్ఞులు, మీకు తెలియని సత్యం లేదు. అయినా మీరు మళ్ళీ వాస్తవం తెలుసుకోదలిస్తే కంసాలుల్ని పిలవండి. పండితుల్ని పిలవండి. నకళ్ళు వ్రాసిన వాళ్ళని, మరమ్మత్తులు చేసిన వారిని, కాపలా ఉన్న వారిని ఎవరినైనా పిలిపించండి. ఈ నిందారోపకులు వట్టి పనిలేని దొంగలని మీకే తెలుస్తుంది. వాళ్ళకి ఈ మహాత్కార్యంలో ఏమీ గిట్టుబాటు కావడలేదు. అందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారు" అని విన్నవించాడు.

రాజుగారీ సమాధానం విన్నాక పరిస్థితిని మరింత సమీక్షించి లోతుపాతులు స్వయంగా అంచనావేశారు. తన మెడలోని అమూల్యహారం మేనల్లుడి మెడలో వేసి సత్కరించారు.

ఇలా... ఇలా... పక్షి చదువు దినదినాభివృద్ధి చెందుతోంది.

పక్షి చదువుని స్వయంగా పరిశీలించాలని ఒక రోజు రాజుగార్కి ముచ్చటేసింది.

అత్యంత విశ్వాసపాత్రుడైన మంత్రినీ, దివానునీ, కొద్ది మంది మిత్రుల్ని వెంటబెట్టుకొని చిలుక విద్యాలయం వైపు బయలుదేరారు. రాజుగారి ఆగమనమంటే మాటలా? విద్యాలయం గుమ్మం దగ్గరే వాద్యాలు మ్రోగాయి. శంఖారావాలు, ఘంటా నినాదాలు మిన్ను ముట్టాయి. డోళ్ళు, తప్పెట్లు , మద్దెళ్ళు, నగారాలు, బాణాలు, వేణువులు, చప్పట్లు– ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. పండితులు కంఠాలు చించుకొంటూ, పిలకలు ఊపుకొంటూ మంత్రాలు వల్లించసాగారు. మేస్త్రీలూ, కూలీలూ, పనివారూ, వ్రాతగాళ్ళు కాపలాదార్లు, బంధుగణాలూ ఉచ్ఛైస్వరంతో జయధ్వానాలు పలికారు.

"మహారాజా! మా శ్రమ మీ రాకతో ఫలించింది. మేము చేసిందంతా తమ కళ్ళ ఎదుటే ఉంది. తమ నేత్రాలు సర్వతాంతర్భాగాల్ని కూడా శోధించగలవి. రహస్యాల్ని ఛేదించగలవి. తమ వద్ద ఎవ్వరూ ఏమి దాచలేరు గదా!" అంటూ పెద్ద మేనల్లుడు ముకుళిత హస్తాలతో రాజుగార్కి విన్నవించాడు.

రాజుగారు మహా సంబరపడిపోయారు. సంతృప్తిగా వెనుదిరిగారు.

తీరా రాజు గారి పట్టపుటేనుగు గడపదాటి నాలుగడుగులు వేసిందో లేదో ఒక నిందారోపకుడు పొదలమాటున చేరి "మహారాజా! ఇంతకూ తాము పక్షిని దర్శించారా? అని ఓ అసందర్భ ప్రేలాపన చెయ్యనేచేశాడు.

రాజుగార్కి ఈ మాట ఆశనిపాతంగా అన్పించింది. "అరెరే! తాను పక్షిని చూడనే లేదే. ఆ ధ్యాసే లేకపోయిందే" అనుకొన్నారు. రాజుగారి పట్టపుటేనుగు వెనుదిరిగింది. రాజుగారు విద్యాలయంలోకి అడుగుపెట్టారు.

"మీరు పక్షికి చదువెలా నేర్పిస్తున్నారు? అసలు ఏం నేర్పుతున్నారు? ఎంతదూరం వచ్చిందీ చదువు? కొంచెం ఆ సంగతి కూడా చూచి వెళ్ళాలని మాకు కుతూహలంగా ఉంది" అన్నారు ప్రధాన పండితునితో రాజుగారు.

రాజాజ్ఞ మేరకు చిలక విద్యాభ్యాస విన్యాస ప్రదర్శన జరిగింది. రాజుగారి ఆనందానికి అవధుల్లేవు.

అసలా విద్యా బోధనా ప్రక్రియ ఎంత పరమాద్భుతమనుకొన్నారు! బోధనా సామగ్రి దొంతరల మధ్య చిలక కన్పించడమే లేదు. పంజరంలో ఒక్క చుక్క నీళ్ళైనా లేవు. ఒక్క గింజయినా కనిపించదు. అందులో ఉన్నదంతా విద్యే. సకల శాస్త్రగ్రంథాలు చింపి పేజీలు గుట్టల కొలదీ

పోశారు. కలం మొనతో ఒక్కో పుటనీ ఎత్తి చిలుక నోట్లోకి పండితులు తోస్తున్నారు. ఇప్పుడు చిలుక తన అనాగరిక పాటల్ని పాడడం లేదు. అసలది అరిచి గోల చెయ్యడమంటే ఏమిటో కూడా మరిచిపోయింది. పండితుల బోధనా కౌశల్యం చూసిన వారికెవరికైనా రోమాలు నిక్కబొడుచుకోకమానవు. శరీరం కంపించకమానదు. మూర్ఖులు దీన్ని "హింస" అంటే అనొచ్చు అది వేరే సంగతి!

ఎంతో సంతృప్తిగా రాజుగారు వెనుదిరిగారు. ఏనుగును అధిరోహిస్తూ ఆ పొదలమాటున ఉన్న నిందారోపకుణ్ణి పట్టి చెవిమెలిపెట్టి బుద్ధి చెప్పమని ఆజ్ఞ జారీ చేశాడు. అందులోని నిపుణుడు, వెనువెంటనే దాని కుద్యుక్తుడయ్యాడు.

చదువు జోరుగా సాగుతుంది. పక్షి రోజు రోజుకీ ఈ పండితసాంగత్యంతో చావు బతుకుల సంధిలోకి చేరుకొంటున్నది. 'ప్రగతి చాలా ఆశాజనకంగా ఉందని పరిశీలకులు, అభిజ్ఞ వర్గాలు పక్కాణిస్తున్నారు.

అయినా అదేం రోగమో తెలీదు కానీ పక్షికింకా తన అనాగరిక పూర్వబుద్ధి పోలేదు. అది దాని సహజ స్వభావంలా ఉంది. అది తూర్పు దిశగా సూర్యకాంతికేసి ఉండుండి చూస్తోంది. నిర్భయంగా అటవిక పద్ధతిలో రెక్కలు టపటపలాడిస్తోంది. అప్పుడప్పుడూ అమూల్యమైన పంజరపు చువ్వల్ని తన దిక్కుమాలిన ముక్కుతో కొరకడానికి ప్రయత్నిస్తోంది.

కాపలా కాస్తున్న కొత్వాలు ఇది చూచి కనుబొమ్మలు ముడేసాడు. "ఆహా ఎంతకు తెగించిందీ పక్షి' అని హుంకరించాడు.

మళ్ళీ కంసాలిని పిలిపించారు. సుత్తీ శానం పట్టుకొని విద్యాలయం (పంజరం) మీద కంసాలి దాడి మొదలెట్టాడు. టక టక, ఢమ్ ఢమ్ ఆర్భాటాల మహోత్కృష్ట సంగీతం మొదలైంది. చూస్తూ చూస్తుండగానే ఇనప సంకెళ్ళు కూడా తయారయ్యాయి.

ఇంకా... చూస్తుండగానే పక్షి రెక్కలు సైతం ఖండించేశారు. రాజుగారి చిర్రుబుర్రులాడే తెలివితేటలకు రాజుగారి నుంచి ధన కనక రత్న చీనాంబరాలు ముట్టాయి.

ఒకనాడు పక్షి మరణించింది. ఎప్పుడు మరణించిందో ఆ తారీఖు ఏమిటో ఏ చరిత్రకారుడికీ తెలీదు. చుట్టుపక్కల నిందారోపకుల నోళ్ళు మూతలుపడవుగా! 'పక్షి చనిపోయింది చనిపోయింది' అని ప్రచారం లంకించుకొన్నారు. ఈ వార్త రాజుగారి చెవికి సోకింది.

రాత్రి తక్షణం తన పెద్ద మేనల్లుణ్ణి పిలిపించి “బాబూ నేనేం వింటున్నానయ్యా” అని అడిగాడు.

మేనల్లుడు రెండు చేతులూ జోడించి ‘మహారాజా చిలక విద్యాభ్యాసం పూర్తయింది” అని విన్నవించుకొన్నాడు.

రాజుగారు మళ్ళీ ప్రశ్నించాడు.

‘చిలక ఎగురుతోందా?”

“రామనామం జపించండి మహారాజా”

“అది పాడుతోందా?”

‘లేదు మహారాజా విద్యాభ్యాసం పూర్తయింది గదా!’

రాజుగార్కి ఏదో అనుమానం వచ్చి ‘ఒకసారి ఆ పక్షిని తీసుకొని వచ్చి నాకు చూపించండి’ అని ఆజ్ఞాపించాడు.

కొత్వాలూ, సైనికులూ, ఆశ్వికదళం పక్షిని తెచ్చి రాజు చేతికిచ్చారు. రాజుగారు పక్షిని చేత్తో నొక్కి చూచారు. దాని నోటి నుంచి ‘ఊహుః’ అని వస్తే వొట్టు. శరీరం అటూ ఇటూ కదిలిస్తే వొట్టు. రెక్కలైనా కదుల్తాయంటే అవి లేకనేపోయె!

అయితే మాత్రమేం దాని ఉదరంలో శాస్త్రగ్రంథాల శుష్కపుటలు గలగల మంటున్నాయి!

బయట నవవసంతపు దక్షిణ మారుతంలో నవ కుసుమాలు మాత్రం గాఢ నిట్టూర్పు విడుస్తున్నాయి.

* * *

# గోరింక గూడు

**- భీష్మ సహానీ**

ఇది నా చిన్నప్పుడు జరిగిన సంగతి.

అప్పుడు నేను ఆరో తరగతి చదువుకుంటున్నాను. మా తరగతిలో రకరకాల పిల్లలు ఉండేవారు.

హరి అనే కుర్రాడు ఉండేవాడు. వాడు చేసే పనులు చిత్రంగా ఉండేవి. వాడికి ఏదన్నా జవాబు గుర్తు రాకపోతే సిరా తాగేవాడు. నల్లని సిరా తాగితే తెలివి పెరుగుతుందని వాడికి ఎవరో చెప్పారట. సీసాడు సిరా గటగటా తాగేసేవాడు.

వాడుచేసే పనులకు టీచర్లకు కోపం వచ్చేది. ఎవరైనా టీచరు కొట్టబోతే వాడు గట్టిగా అరిచేవాడు.

" ఓరి నాయనోయ్! ఓరి దేవుడోయ్! నన్ను చంపేస్తున్నాడురో!" అని పెద్దగా అరిచేవాడు. చుట్టుపక్కల వాళ్ళందరూ పరిగెత్తుకు వచ్చేవారు. ఏం జరిగిందో అని భయపడేవారు. దాంతో అయ్యవారికి కళ్ళు తిరిగేవి. ఎత్తిన చెయ్యి దించేసేవారు.

టీచర్లు కొట్టినప్పుడు వాడు ఏం చేసేవాడో తెలుసా? టీచర్ని గట్టిగా చుట్టుకొనే వాడు. పెద్దగొంతుతో ఇలా బతిమిలాడేవాడు.

"ఈ ఒక్కసారికి నన్ను వదిలి వేయండి సార్. మీరు నా అమ్మ సార్. మీరు నా నాన్న సార్. మీరు నా తాతయ్య సార్. మీరు నా నాయనమ్మ సార్." అనేవాడు.

పిల్లలంతా పకపకా నవ్వేవారు. సార్‌కి సిగ్గేసేది. కొట్టడం ఆపేవారు.

అప్పుడప్పుడు వాడు కప్పలు పట్టుకొచ్చేవాడు. "కప్పల కొవ్వు చేతికి రాసుకుంటే దెబ్బ పడినట్లే ఉండదు". అని మాతో చెప్పేవాడు... హరి పనులు చాలా విచిత్రంగా ఉండేవి.

మా తరగతిలో ఇంకో కుర్రవాడు ఉండే వాడు. వాడి పేరు నాగరాజు. వాడిని చూస్తే మాకందరికీ భయం! వాడు గిల్లితే పాము కరిచినట్లు ఉండేది. వాడు మహా ఆకతాయి.

మురికి కాలువ పక్కన తూనీగలు వాలేవి. నాగరాజు వాటిని వట్టి చేతులతో పట్టుకొనే వాడు. వాటి రెక్కల్ని చప్పున తుంపేసేవాడు. తర్వాత వాటి కాళ్ళకు దారం కట్టేవాడు. వాటిని గాలిపటాల్లా ఎగరేయాలని చూసేవాడు.

తోటలోని పూలమీద ఎన్నో సీతాకోక చిలుకలు వాలేవి. నాగరాజు క్షణంలో వాటిని ఒడిసి పట్టేవాడు. పట్టిన వెంటనే వేళ్ళ మధ్య నలిపేవాడు. వాటి వంట్లో పిన్నులు గుచ్చి పుస్తకాలకు బిగించేవాడు. పాపం! అవి టపటపా కొట్టుకుంటూ చచ్చిపోయేవి.

నాగరాజు చేసే పనులు మాకు అసహ్యం పుట్టించేవి. వాడి గురించి అందరూ తలా ఒక మాట అనుకునేవారు. తేలు గనక వాడిని కుడితే తేలు చచ్చిపోతుంది. వాడికి మాత్రం ఏమీ కాదు. వాడికి రక్తం అంత విషంగా ఉంటుంది – అనుకొనేవారు. వాడు చేసే పనులు కూడా అలాగే ఉండేవి.

నాగరాజు చేతిలో ఎప్పుడూ ఒక ఉండేలు(క్యాట్‌బాల్) ఉండేది. వాడి గురి ఎప్పుడూ తప్పేది కాదు. గురిచూసి కొడితే తగలవలసిందే! పక్షి గూళ్ళు చూస్తే వాడికి ఎందుకో పగ. వాటిని చూస్తూ ఊరుకొనే వాడుకాదు. చెట్టుకింద నిలబడే వాడు. గురి చూసి ఉండేలుతో రాళ్ళు కొట్టేవాడు. పిట్టలు రివ్వున గాలిలోకి ఎగిరేవి. కీకీ అని అరుస్తూ గోల చేసేవి. గాలిలో చక్కెర్లు కొట్టేవి.

నాగరాజు గబగబా చెట్టెక్కేవాడు. గూళ్ళలో ఉండే గుడ్లను జేబులో వేసుకొనేవాడు. తర్వాత గూళ్ళను ముక్కలు ముక్కలు చేసి పారేశేవాడు. వాటిని నాశనం చేసే దాకా వాడికి నిద్రపట్టేది కాదు. వాడికి ఇదంతా ఒక ఆటలా ఉండేది.

ఒకరిని కష్ట పెట్టకుండా మనం ఎన్నో ఆటలు ఆడుకోవచ్చు. ఈ సంగతి వాడికి తట్టేదే కాదు. అందుకే వాడి అమ్మ కూడా వాడిని తిట్టేది. "ఓరి రాక్షసుడా! ఇదేం పాడు బుద్ధిరా?" అని తిట్టేది.

నాగరాజు తన జేబులో రంగురంగుల గుడ్లు పెట్టుకొని తిరిగేవాడు. జేబులోంచి కాకి పిల్లలు తీసి చూపించేవాడు. ఒక్కోసారి కాకి పిల్లలు! మరోసారి పిచ్చుక పిల్లలు! ఇంకోసారి చచ్చిన పాములు! ఒక్కోసారి జేబులోంచి చచ్చిన ఎలకల్ని కూడా తీసేవాడు.

వాడు దగ్గరికి వస్తే అందరం భయపడే వాళ్ళం. ఎవరేనా వాడితో పోట్లాడితే ఏమైనా ఉందా? వారి పని అంతే సంగతులు! గుండె మీద పిడిగుద్దులు గుద్దేవాడు. చెయ్యి గట్టిగా కొరికే వాడు. వాడు కొడితే కళ్ళు తిరిగిపోయేవి. కొరికితే మాంసం ముక్క ఊడి వచ్చేది.

బడి వదలగానే ఎవరింటికి వాళ్ళం వెళ్ళి పోయేవాళ్ళం. నాగరాజు మాత్రం ఇంటికి పోయేవాడు కాదు. ఎక్కడెక్కడో తిరిగేవాడు. ఎక్కడ తిరిగే వాడో ఎవ్వరికీ తెలీదు.

అప్పుడప్పుడు నాగరాజు మాతో మంచిగా మాట్లాడేవాడు. మాకు తెలియని సంగతులు కొన్ని చెప్పేవాడు.

"మా ఇంట్లో ఒక ఉడుం ఉంది. ఉడుం అంటే ఏమిటో తెలుసా?" అన్నాడు ఒక రోజు.

"తెలీదు. ఏమిటది? ఎలా ఉంటుంది?" ఉత్సాహంగా అడిగాం.

అది పాములా ఉంటుంది. జానెడు పొడుగుంటుంది. అయితే పాముకి కళ్ళుండవు. ఉడుంకి ఉంటాయి." అన్నాడు.

మాకు ఒంట్లో వణుకు పుట్టింది.

"మా ఇంట్లో మెట్ల కింద ఒక ఉడుముంది. అన్నట్లు మీకో సంగతి తెలుసా? అది దేన్నయినా పట్టుకుంటే విడిచి పెట్టదు." అన్నాడు.

మేము మరింత వణికిపోయాం. కొంపదీసి జేబులో వేసుకొచ్చాడా? మా మీదకు వదులుతాడా అని మా భయం.

"కొందరు దొంగలు ఉడుమును పెంచుకుంటారు. దాని సహాయంతో పెద్దపెద్ద గోడలు ఎక్కుతారు. ముందుగా ఉడుం కాలుకి తాడు కడతారు. ఉడుముని గోడ మీదకు విసురుతారు. గోడ తగలగానే ఉడుం దానిని గట్టిగా పట్టుకుంటుంది. దానిగోళ్ళు చాలా బలంగా ఉంటాయి. అది గోడను ఎంత బలంగా పట్టుకుంటుందో తెలుసా? పది మంది ఒకేసారి లాగినా ఒదిలి పెట్టదు. దొంగలు ఆ తాడు పట్టుకొని ఎక్కుతారు?" చెప్పాడు నాగరాజు.

"పని పూర్తయ్యాక దానిని ఎలా తీసుకుపోతారు?" అనుమానంగా అడిగాను.

"దొంగలు దానికి కొంచెం పాలు తాగిస్తారు. పాలు తాగితే దాని పట్టు తప్పుతుంది."

నాగరాజు మాకు ఇలాంటి సంగతులు చెప్పేవాడు.

ఆరోజుల్లో మానాన్న ఉద్యోగం పెద్దదయింది. మేము ఓ కొత్త ఇంట్లోకి మారాం. అది చాలా పెద్ద ఇల్లు. పాతకాలపు బంగ్లా, ఊరికి చాలా దూరంగా ఉంది. ఇటుకలతో కట్టిన గోడలు. పెద్ద పెద్ద గదులు. గచ్చునేల, పై కప్పు వాలుగా, ఎత్తుగా ఉండేది. ఇంటి బయట బోలెడంత ఖాళీ స్థలం, చెట్లూ చేమలు. దగ్గరలో మరో ఇల్లు లేదు. దాంతో నాకు ఆడుకోవడానికి జతగాళ్ళు దొరికేవాళ్ళుగాదు.

నాగరాజు అక్కడికి రావటం మొదలుపెట్టాడు. అక్కడ వేట బాగా దొరుకుతుందని వాడికి తెలిసి ఉంటుంది. మా ఇంటి చుట్టూ బోలెడన్ని పక్షి గూళ్ళు ఉండేవి. ఇంట్లోనూ ఉండేవి. ఇంటికి దగ్గరలోనే కొన్ని కోతులు తిరుగుతుండేవి. ఒకచోట పొదల్లో ముంగీస బొరియలు ఉండేవి.

ఇంటి వెనుక ఓ పెద్ద గది ఉండేది. అమ్మ దానిని గోదాముగా మార్చింది. పనికి రాని వస్తువులన్నీ అందులో పడేసింది.

గోదాములో ఎప్పటినుంచో పావురాళ్ళు ఉంటున్నాయి. అవి రోజంతా గుటురూ గుటురూ అంటుండేవి. పై కప్పు క్రింద గోడలో ఓ కిటికీ ఉంది. దానికి ఊచలు లేవు. దానికి దగ్గరలోనే ఓ గోరింక గూడు ఉంది. గది నేల మీద ఈకలు, రెట్టలు, గడ్డి పోచలూ చిందరవందరగా పడి ఉండేవి.

నాగరాజు రోజూ వచ్చేవాడు. నేను వాడితో కలసి తిరగడం మొదలెట్టాను. అమ్మకు ఇది బొత్తిగా ఇష్టంలేదు. అయినాసరే నన్ను వాడితో పోనిచ్చేది. ఆడుకోవటానికి నాకు జతగాళ్ళు లేరు. ఇంట్లో ఒక్కడినీ ఉండి ఏంచేస్తాను? అందుకే అమ్మ వాడితో పోనిచ్చేది. వాడంటే అమ్మకూ కోపమే. అమ్మకూడా వాడిని రాక్షసుడనే అనేది. మూగజీవాలను ఏడిపించొద్దని నచ్చ చెప్పేది.

ఒక రోజు అమ్మ నాతో అంది:

“మన గోదాము గదిని పిట్టలు కంపు చేశాయి. అందులోని గూళ్ళను తీసివేయమని మీ స్నేహితునికి చెప్పు. వాడికి ఈపనంటే గొప్ప సరదాగా?” అంది.

‘అదేంటమ్మా అలా అంటావు? గూళ్ళు పీకెయ్యటం పాపం అని నువ్వే చెప్పావుగా?’ అన్నాను ఆశ్చర్యంగా.

“పిట్టల్ని చంపితే పాపం వస్తుంది. గూడు తీసి వేయడం వేరే సంగతి.” అంది అమ్మ చిరాకుగా.

నాగరాజుకి సంగతి చెప్పాను. వాడు సరే అన్నాడు. ఇద్దరం కలసి గోదాము వెనుకకు వెళ్ళాం . మెల్లగా తలుపులు తెరిచాం. అప్పుడు సాయంత్రం కావస్తుంది. లోపల మసక మసకగా ఉంది. కంపు కొడుతోంది. జంతువుల గుహలలోకి అడుగు పెట్టినట్లుగా ఉంది. కొంచెం సేపు తలుపు దగ్గరే నిలబడి పోయాం. తరువాత లోపలికి వెళ్ళాం.

అది రేకులు పరిచిన గోదాము. రేకులకు దన్నుగా రెండు అడ్డ దూలాలున్నాయి. ఒక దూలం మీద చాలా పావురాలు కనిపించాయి. అవి గుటురూ గుటురూ అని అదే పనిగా అరుస్తున్నాయి. అటూ ఇటూ తిరుగుతున్నాయి.

రెండవ దూలం మీద గోరింక గూడు ఉంది. గడ్డిపోచలు, దూది పోగులు, గుడ్డ పేలికలు – వీటితో చేసిన గూడు! అది ఎంతో అందంగా ఉంది.

అమ్మ దానిని ఎందుకు తీసివేయమంది? అది తీసివేయడానికి నా మనసొప్పలేదు. మనసులోనే అమ్మను తిట్టుకొన్నాను.

నాగరాజు తన ఉండేలు సరి చేసుకున్నాడు. దూలం మీదున్న గూటిని రెప్పవాల్చకుండా చూస్తున్నాడు. వాడి ముఖంలో ఎంతో సంతోషం!

''గూటిలో గోరింక పిల్లలున్నాయి'' అన్నాడు. ఉండేలు రబ్బరు లాగి పట్టుకున్నాడు. అప్పుడు గూటిలోంచి రెండు బుజ్జి గోరింక పిల్లలు తొంగి చూశాయి. అవి పసుపు రంగులో ఎంతో ముద్దుగా ఉన్నాయి.

"ఇవి మన దేశపు గోరింకలు కాదు. వేరే దేశానివి. వీటి అమ్మ, నాన్న గుంపు నుంచి తప్పిపోయి ఉంటాయి. అందుకే ఇక్కడ గూడు కట్టుకున్నాయి." అన్నాడు నాగరాజు.

"అవి ఇప్పుడు ఎక్కడ ఉన్నట్టు?"

"మేతకోసం పోయి ఉంటాయి. కొంచెం సేపట్లో తిరిగి రావచ్చు." అంటూ ఉండేలు ఎత్తాడు.

"రాళ్ళతో గూటిని కొట్టొద్దు పిల్లలు చచ్చిపోతాయి. అమ్మ గూటిని పీకేయమంది. పిల్లల్ని చంపమనలేదు." అని వాడికి చెప్పాలని అనుకున్నాను. అంతలోనే వాడి ఉండేలును ఫ్రుమనిలాగాడు కంకరరాయి సర్రున దూసుకుపోయింది. అయితే అది గూటికి తగలలేదు. పైకప్పుకి తగిలి టంగుమని శబ్దం చేసింది.

గోరింక పిల్లలు గూటిలోకి ఒదిగిపోయాయి. అవి బాగా భయపడి పోయాయి.

నాగరాజు రెండో రాయి గురిపెట్టి వదిలాడు. ఈసారి రాయి దూలానికి తగిలింది. వాడు తన గురించి పెద్ద పెద్ద గొప్పలు చెప్పుకుంటాడు. అయితే ఇప్పుడు రెండుసార్లు గురి తప్పింది. దాంతో వాడికి పిచ్చెక్కినట్లయింది. కొంచెం సేపటి దాకా ఊరికే నిలబడిపోయాడు.

గోరింక పిల్లలు మళ్ళీ తొంగి చూశాయి. అంతే! నాగరాజు మూడోరాయి వదిలిపెట్టాడు. అది సర్రున పోయి గూడు కొసకు తగిలింది. కొన్ని గడ్డి పోచలు, దూదిపోగులు చెదిరిపోయ్యాయి. అవి మెల్లగా నేల మీద పడసాగాయి.

వాడు నాలుగోసారి ఉండేలు ఎక్కుపెట్టాడు. అప్పుడే గదిలో ఓ పెద్ద నీడ పడింది. మేము తలలు పైకెత్తి చూశాం. కిటికీకి అడ్డంగా ఓ గద్ద కూర్చొని ఉంది! చాలా పెద్ద గద్ద! నేను భయపడిపోయాను.

" ఇది గద్దగూడు కావొచ్చు." అన్నాను.

"కాదు. గద్దలు తమ గూటిని చెట్ల మీద కట్టుకుంటాయి. ఇలాంటి చోట కట్టుకోవు. ఇది ముమ్మాటికీ గోరింక గూడే!" అన్నాడు నాగరాజు.

గూటిలోని గోరింక పిల్లలు అరవడం మొదలు పెట్టాయి. అవి గద్దను చూశాయో ఏమో! గొంతు చించుకొని అరుస్తున్నాయి. ఎగిరి పోవాలని గింజుకుంటున్నాయి.

నేను, నాగరాజు కదలకుండా నిలబడిపోయాం. ఇప్పుడు గద్ద ఏం చేస్తుంది? రెప్ప వాల్చకుండా దానినే చూస్తున్నాం.

గద్ద రెక్కలు సరి చేసుకుంది. తలను అటూ ఇటూ తిప్పి చూసింది. నెమ్మదిగా ఎగిరి దూలం మీదకు దిగింది.

గోరింక పిల్లలు ఇంకా పెద్దగా ఏడుస్తున్నాయి.

" ఇది ఇక్కడికి రోజూ వస్తున్నట్లుంది." అన్నాడు నాగరాజు.

గోదాము నేల మీద మాంసం ముక్కలు, రక్తపు మరకలు కూడా ఉండేవి. పిట్టల ఈకలైతే సరేసరి. అవన్నీ ఎందుకు ఉన్నాయో నాకు అర్థమయింది. ఈ గద్ద తరచూ వస్తుందన్న మాట! వచ్చిన ప్రతిసారీ – ఏదో ఒక పిట్టను చంపి తింటుదన్న మాట!

గద్ద మెల్లగా నడుస్తూ గూటి వైపు కదులుతోంది. గోరింక పిల్లలుగుండె పగిలేలా ఏడుస్తున్నాయి.

నేను నాగరాజు వంక చూశాను. వాడు రెప్ప వాల్చకుండా గద్దనే చూస్తున్నాడు. అది వచ్చినప్పటి నుంచి దాని వంక అలాగే చూస్తున్నాడు.

నాకు అనిపించింది. గోరింక పిల్లల్ని గద్ద పొడిచి చంపుతుంది. నాగరాజు ఉండేలుతో కొట్టి చంపుతాడు. దానికి, దీనికి ఏం తేడా ఉంది? రెండూ ఒకటే! గద్ద, నాగరాజు – ఇద్దరూ ఒక్కటే!

గద్ద తాపీగా ముందుకు కదులుతోంది. గోరింక పిల్లలు నరాలు తెగేలా అరుస్తున్నాయి.

ఉన్నట్లుండి నాగరాజు ఉండేలు ఎత్తాడు. సూటిగా దానిని గద్దకు గురిపెట్టాడు!

"దానిని ఏమీ అనకు. మన మీదకు వస్తుంది." భయపడుతూ అన్నాను.

వాడు వినలేదు. ఉండేలు నుంచి కంకరరాయి సర్రున పోయింది. అయితే అది గద్దకు తగల లేదు. పైకప్పుకి తగిలి కింద పడిపోయింది. గద్ద తన పెద్ద పెద్ద రెక్కల్నిసాచింది. తల తిప్పి గుర్రుగా మా వంక చూసింది.

" ఇక్కడి నుంచి పారిపోదాం పద!" నేను కంగారుగా అన్నాను.

"వద్దు. మనం వెళ్ళిపోతే గద్ద ఆ పిల్లల్ని తినేస్తుంది!" అన్నాడు నాగరాజు.

నా చెవులను నేను నమ్మలేక పోయాను! వాడి నోటి నుంచి ఆ మాట రావడం చిత్రంగా ఉంది. ఆశ్చర్యంగా వాడి వంక చూశాను!

వాడు గద్దనే చూస్తున్నాడు. రెండోసారి దానికి గురిపెట్టాడు. గద్ద గాలిలోకి ఎగిరి గదిలో ఓ చుట్టు చుట్టింది. తిరిగి దూలం మీద వాలింది.

నాగరాజు ఉండేలుని చప్పున నా చేతిలో పెట్టాడు. జేబులోంచి ఆరేడు కంకరరాళ్ళు తీశాడు. వాటిని కూడా నా చేతిలో ఉంచాడు.

"నువ్వు గద్దను రాళ్ళతో కొట్టు, కొడుతూనే ఉండు. దానిని కూచోనివ్వద్దు" అంటూ గోడ దగ్గరికి పరిగెత్తాడు. గోడ దగ్గర ఓ పాత టేబులు ఉంది. దానిని ఈడ్చుకుంటూ దూలం కిందకి తెచ్చాడు. ఆ దూలం కిందే గోరింక పిల్లల గూడుంది. బల్ల మీద ఓ విరిగిన కుర్చీని వేశాడు. జాగ్రత్తగా దాని మీదకు ఎక్కాడు. పడిపోకుండా నిలబడి గోరింకల గూడును తన చేతుల్లోకి తీసుకున్నాడు.

ఉండేలుతో ఎలా కొట్టాలో నాకు తెలీదు. అయినప్పటికి గద్దను గురి చూసి రెండు మూడు రాళ్ళు కొట్టాను. ఈలోగా అది వేరే దూలంపైకి ఎగిరింది.

నాగరాజు గూటితో సహా కిందికి దిగాడు. "బయటికి పోదాం పద!" అంటూ గబగబా తలుపు వైపు నడిచాడు...

ఇద్దరం బయటకు వచ్చాం.

గోదాముకి దగ్గరలోనే గ్యారేజీ ఉంది. గ్యారేజీ అంటే కారు పెట్టుకొనే గది. మాకు కారు లేదుగా! అందుకని దాని తలుపు ఎప్పుడూ మూసే ఉండేది. దాంట్లో కూడా పైన దూలాలు ఉన్నాయి. గోడకు చిన్న కిటికీ కూడా ఉంది. ఇద్దరం అక్కడకు వెళ్ళాం.

చిన్న అట్ట పెట్టెలో గూడును పెట్టాడు నాగరాజు. పాత పెట్టెల మీదకు ఎక్కి – అట్ట పెట్టెను జాగ్రత్తగా దూలాల మీద ఉంచాడు.

"గద్ద ఇక్కడికి రాలేదు" అన్నాడు తృప్తిగా.

నాకు ఆశ్చర్యం వేసింది. వాడు ఆ పిల్లల్ని జేబులో వేసుకొని, పోతాడు అనుకున్నాను. ఎప్పుడూ అలాగే చేస్తాడుగా!

గోరింక పిల్లలు అరవడం ఆపేశాయి. నాగరాజు పెట్టె మీదకు ఎక్కి నిలబడ్డాడు. చాలా సేపు వాటి వంక చూశాడు.

"కొంచెం నీళ్ళు తీసుకురా. వాటికి బాగా దాహంగా ఉంది." అన్నాడు నాతో.

ఇంట్లోకి వెళ్ళి ఒక గిన్నెలో నీళ్ళు తీసుకువచ్చాను. బుజ్జి గోరింకలు గొంతులు పైకెత్తాయి. వాడు ఆకుతో వాటి గొంతులోకి బొట్టు బొట్టు నీళ్ళు పోసాడు. అవి బాగా తాగాయి. పాపం అరిచి వాటి గొంతులు ఎంత ఎండిపోయాయో ఏమో!

బుజ్జి గోరింకలను నేను ముట్టుకోబోయాను. అయితే నాగరాజు వద్దన్నాడు. తాను కూడా వాటిని ముట్టుకోలేదు. మనం ముట్టుకుంటే వాటి అమ్మా నాన్నా వదిలేస్తాయి అన్నాడు.

"వీటి అమ్మా నాన్నలు ఇక్కడికి ఎలా వస్తాయి?" అని అడిగాను.

"పిల్లల్ని వెతుక్కుంటూ అవే వస్తాయి. ఈ కిటికీలోంచి దూరి వచ్చేస్తాయి." అన్నాడు.

మేము బాగా చీకటి పడే వరకు గ్యారేజీలో ఉండిపోయాం. "గ్యారేజీ కిటికీలోంచి గద్ద దూరలేదు.

గోరింక పిల్లలకు ఇక భయం లేదు" అన్నాడు నాగరాజు. ఆ సాయంత్రం అంతా వాడు గద్ద గురించే మాట్లాడాడు.

మరురోజు నాగరాజు మళ్ళీ మా ఇంటికి వచ్చాడు. ఆశ్చర్యం! వాడి చేతిలో ఉండేలు లేదు! జేబులో కంకరరాళ్ళు లేవు!... అవి లేకుండా వాడు రావడం అదే మొదటిసారి!!

నాగరాజు జేబులో పక్షుల దాణా వేసుకొచ్చాడు.

నేనూ, నాగరాజు చాలా సేపు బుజ్జి గోరింకలకి దాణా తినిపించాము. అవి ఎర్రటి నోరు తెరుస్తూ మూస్తూ ఉండేవి. చూడ్డానికి ఎంత ముచ్చట వేసిందో! నాగరాజైతే వాటిని చూచి లోకాన్నే మరిచి పోయాడు. మళ్ళీ నాగరాజు ఎప్పుడూ ఉండేలు ముట్టుకోలేదు.

❊ ❊ ❊

# చింగ్ చదువు

**- లావ్ సియాంగ్**

ఏడెనిమిదేళ్ళు నిండగానే తల్లిదండ్రులతో కలిసి పొలం పనులకి వెళ్ళడం ప్రారంభిస్తాడు పల్లెటూరి పిల్లవాడు. నారుపోయడం, కలుపు తీయడం, పొలానికి నీరువదలడం, పంటలు కోతకొచ్చినప్పుడు కాపలా కాయడం వగైరా పనుల్లో తర్ఫీదు పొందుతాడు. అంతేకాదు ఇల్లు కట్టుకోవాల్సి వచ్చినప్పుడు ఇటుకలు మోసే పనుల్లో కూడా పెద్దవాళ్ళకి సాయం చేస్తాడు.

ఇన్ని పనుల్లో చేదోడు వాదోడుగా ఉండే పిల్లవాడిని చూస్తూ బడికి పంపుకుంటారా ఎవరైనా?

కానీ తప్పలేదు. గవర్నమెంటువాళ్ళు కొత్త చట్టం ఒకటి తీసుకొచ్చారు. దాని ప్రకారం ఆరేళ్ళు నిండిన పిల్లవాడిని బళ్ళో వెయ్యకపోతే ఆ కుటుంబంలోని పెద్దవాళ్ళలో ఒకరు జైలుకి వెళ్ళాల్సివుంటుంది. ఈ పరిస్థితుల్లోనే మన చింగ్‌ని పక్క టౌనులోని ఒక కాన్వెంటు స్కూల్లో చేర్పించాల్సి వచ్చింది.

బళ్ళో చేరిన రోజే ఎనిమిది కొత్త పుస్తకాలని మోసుకుని ఇంటికొచ్చాడు చింగ్. అమ్మ, నాన్న, నానమ్మ, తాత అంతా వాడి చుట్టూచేరి ఆ పుస్తకాల్లోని రంగురంగుల బొమ్మల్ని తిరగేస్తూ తెగ మురిసిపోయారు.

“ఆ రోజుల్లో మేం చదువుకున్న నీతికథలు, వ్యాకరణం పుస్తకాల్లో ఇంత మంచి బొమ్మలుండేవికాదురా” అన్నాడు తాత నోరువెళ్ళబెట్టి.

"స్వెట్టరు అల్లుతున్నట్టున్న ఈ ఆడమనిషి మనదేశం మనిషిలా లేదే? ఏదో సీమ దొరసానిలాగుంది. మనం కుడిచేత్తో అల్లుతాం కదా! ఇది ఎడమ చేత్తో సూదిని పట్టుకుందేమిటి!" అని ఆశ్యర్యపోయింది నానమ్మ.

"ఈ మిఠాయి దుకాణంవాడు కూడా మన మనిషి మాదిరిగా లేడు చూశారా? మన ఊళ్ళలో ఏ అంగడివాడైనా అంగట్లో కూర్చోకుండా ఇట్లా దుకాణం బైట నిలుచుని" వ్యాపారం చెయ్యడం చూశామా?" అని వ్యాఖ్యానించాడు తాత.

"ఈ పుస్తకాలన్నీ కలిపి యాభై రూపాయలని చెప్పాడు మా మేష్టారు" అన్నాడు. చింగ్. తన పుస్తకంలోని బొమ్మల్ని తప్పుబట్టడం వాడికి నచ్చలేదు.

" ఏమిటీ?" పిడుగు పడినట్టుగా అంతా నిశ్చేష్టులైనారు.

"బళ్ళోవేసి ఇంకా ఒక్క దినమైనా కాలేదు. ఇంత ఖర్చు నెత్తిమీదికి తెచ్చారా ఈ బడి పెద్దలు.

ఇట్లా అయితే ఇంక తెల్లారినట్టే. ఆర్నెల్లు దీపం పెట్టకుండా కిరసనాయిలు ఆదా చేసినా కూడా ఇంత డబ్బు మిగల్చలేం. ఐదు బస్తాల జొన్న గింజలమ్మితేగాని యాభై రూపాయలు సంపాదించలేం కద నాయినా" నానమ్మ పాటెత్తుకుంది.

"ముందు ఒక పుస్తకం చదివి ముగిస్తే తరువాత మరొకటి కొనుక్కోవచ్చుకదా" అన్నాడు తాతయ్య.

"అది పోనీలే! ఈ బుక్కులో ఒక్కోకాయితం మీద తాటికాయలంతేసి అక్షరాలు అయిదారుకన్నాలేవు కదా! అయినప్పుడు ఇంతింత ధరలు పెట్టేదెందుకంట ఈ బుక్కులకి?" సందేహం వెళ్ళబుచ్చింది నానమ్మ.

"ఓరే చింగ్! మీ నాయన నీ అంత ఉన్నప్పుడు ఎక్కాల పుస్తకం అణానో, అర్ధణానో ఉండేదిరా. మరి ఈ ఇంగ్లీషు పుస్తకం పది రూపాయలంటావేంటి?"

అంతకు కొద్ది నిమిషాల ముందు వాళ్ళని మురిపించిన ఆ కొత్త పుస్తకాలు ఇప్పుడు వాళ్ళ కోపానికి కారణమైనాయి. ఆ రోజంతా ఈ విషయం మీదే వాదించుకుంటూ చివరికి మొదటిసారి గనుక ఆ డబ్బులేవో వాళ్ళ మొఖాన కొట్టి తగలెడదాం' అని తీర్మానించుకున్నారు. అందుకుగాను చింగ్ తల్లి కొత్తగా కొనుక్కున్న ముక్కుపుడకని అమ్మాల్సి వచ్చింది.

"నీకిప్పుడు తొమ్మిదోయేడు వచ్చింది. పెద్దవాడివవుతున్నావు. మా శక్తికి మించి డబ్బు ధారపోసి నిన్ను చదివిస్తున్నాం. నీ వయసులో మేమంతా పొలానికి పొయ్యేవాళ్ళం. నిన్ను స్కూలుకి పంపిస్తున్నాం. పోకిరీ తిరుగుళ్ళు తిరక్కుండా బుద్ధిగా చదువుకో అంటూ ఒక చిన్న ఉపన్యాసమే ఇచ్చాడు చింగ్ తండ్రి. ఆ రాత్రంతా తండ్రి మాటల్ని మననం చేసుకుంటూ నిద్రపోయాడు చింగ్.

కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్న సామెతగా తెల్లవారుతూనే లేచి బడికి బైలుదేరాడు. స్కూలు గేటింకా తెరవనేలేదు. వాచ్‌మెన్ వాడిని చూసి నవ్వి "బడి తొమ్మిదింటికి. ఇప్పుడు గంట ఆరు. మాస్టారింకా పడకమీద నుంచి లేచే ఉండడు. క్లాసు రూములింకా తెరవలేదు. ఇంటికిపోయి తొమ్మిదింటికి రా బాబూ" అన్నాడు.

చింగ్ దిక్కులు చూశాడు. బడి ముందు తాను తప్ప పిల్లలెవరూ కనిపించలేదు. మేష్టారుండే ఇల్లు బడి వెనుకనే ఉంది. కిటికీలోంచి తొంగి చూశాడు. మేష్టారు గురక పెట్టడం వినిపించింది. క్లాసు రూములన్నీ తాళం వేసి ఉన్నాయి. చేసేదిలేక ఇంటి ముఖం పట్టాడు. ఇంటిముందు కసువు వూడుస్తున్న తాత కనిపించాడు. చీపురు అవతల పడేసి.

"బాగానే ఉంది సంబడం. బళ్ళో వేసిన రెండో రోజే నాగా పెట్టేసి వచ్చేశావన్న మాట" అన్నాడు కోపంగా మనవణ్ణి చూసి. అప్పుడే లోపల్నించి బయటికొచ్చిన అమ్మ, కొడుకు వీపు మీద రెండు తగలనిచ్చి, "ఫో, పోయి పుల్లలు పోగుచేసి పొయ్యి రాజెయ్యి" అని తరిమింది వాడిని. వాళ్ళకోపానికంతా అసలు కారణం ఆ పుస్తకాలే.

చింగ్ చద్ది అన్నం తిని బడికి తిరిగి వెళ్ళేసరికి బడికి ఠంచన్‌గా రావడం ఎంత ముఖ్యమో అన్న విషయం మీద లెక్చరిస్తున్నాడు క్లాసులో మేష్టారు. అందుకు ఉదాహరణగా అందరికన్నా ముందుగా బడికి హాజరైన ఒక కుర్రాడికి దేవత ప్రత్యక్షమై కోరిన వరాలివ్వడం గురించిన ఒక చిన్న కథ కూడా వినిపించాడు పిల్లలకి. చింగ్‌కి అంతా అయోమయంగా అనిపించింది. మరి తను తెల్లవారుతూనే బడిముందు ఉన్నాడు కదా! అప్పుడే ఎందుకొచ్చావని తిరిగి పంపించేశారేమిటి? అసలు ముందుగా హాజరు కావడం అంటే ఏమిటో, ఎన్ని గంటలకి రావాలో ఏమీ అర్థం కాలేదు పాపం వాడికి. బడి ముగిశాక నాలుగు గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పుడే ఒక నిద్రపోయి లేచిన తండ్రి వీధిలోకొచ్చి కొడుకుని చూశాడు. వీడు మళ్ళీ బడి ఎగ్గొటి వచ్చాడేమోనని

అనుమానం వేసింది అతనికి. కొడుకుతోబాటు మరికొందరు పిల్లలు కూడా స్కూలు నుండి తిరిగి రావడం చూశాక అనుమానం తీరింది. బెత్తం ఊపుకుంటూ అటు వేపుగా వచ్చిన మేష్టారు కూడా 'నీకేం సందేహం అఖ్ఖర్లేదయ్యా. మీ వాడు రోజంతా నా క్లాసులోనే ఉన్నాడులే అని భరోసా ఇచ్చాడు.

"ఏమిటో ఈ బళ్ళూ, ఈ మాష్టర్లూనూ' అనుకున్నాడు చింగ్ తండ్రి మనసులో.

మొదటి వారం రోజులూ మొదటి పాఠంలోని ' ఈమె అమ్మ' అనే వాక్యాన్ని నేర్చుకోవటానికే సరిపోయింది. చింగ్‌కి చదువుమీద అమితమైన శ్రద్ధ కలిగింది. ఎడంచేత్తో పుస్తకం పట్టుకుని, కుడి చూపుడు వేలితో ఒక్కొక్క అక్షరాన్ని స్పృశిస్తూ 'ఈ...మె...అ...మ్మ' అని మంత్రం వల్లె వేసినట్టు ఆ రాత్రంతా బట్టీపెడుతూ కూర్చున్నాడు. ఆ అక్షరాలమీంచి చూపులు తప్పిస్తే అవి ఎక్కడ ఎగిరిపోతాయో అన్నంత దీక్షగా చదివేడు. ఒక్కో తడవ 'ఈమె అమ్మ' అని కొడుకు పలికినప్పుడల్లా చింగ్ తల్లి మనసు ఉరకలు వేసేది. ఊరికే అనకూడదుగాని అబ్బాయి చదువు మంచిగానే ఉన్నట్టుందే అనుకుని ముసిముసిగా నవ్వుకుంది ఆమె. అది గమనించాడు చింగ్. అమ్మ దగ్గరికి వచ్చి పుస్తకం తెరిచి అమ్మ పాఠంలో ఉండే బొమ్మని తల్లికి చూపుతూ 'ఈమె అమ్మ' అని చదివాడు. బొట్టులేని పొడవైన పీచుమొహం, కత్తిరించిన జుత్తు, మెడ దగ్గర్నించి పాదాలదాకా తొడుక్కున్న గౌను గల ఆడమనిషిని చూసి చింగ్ తల్లి కుత కుత ఉడికిపోయింది.

"ఎవరో దొరసాని దాన్ని పట్టుకుని అమ్మ అంటున్నాడు బాబోయ్!" అంటూ శోకాలు ప్రారంభించింది.

నానమ్మ, తాత, నాన్న అంతా బిత్తర పోయి ఏం కొంప మునిగిందోనని హడావుడిగా పరిగెత్తుకొచ్చి ఆవిడ చుట్టూ మూగేరు. "ఏమైంది... ఏం జరిగింది!" అని విచారించసాగారు. ముక్కు చీదేసి కాసేపటికి చెప్పింది ఆవిడ.

"ఇదుగో, వీడికి ఈ కొత్త అమ్మ ఎక్కడ్నించి వచ్చింది? దీన్ని పట్టుకుని అమ్మ అంటాడేమిటి?"

"నోర్మూసుకో! ఎందకట్లా గొంతు చించుకుంటావు? రేపు బళ్ళో మాష్టరునే అడుగుతాడులే పిల్లవాడు, ఈ అమ్మ ఎవరి అమ్మ అని, ఒకవేళ ఈ మనిషి ఆ మాష్టరి అమ్మే అయ్యుండొచ్చునేమో ఎవరికి తెలుసు?" అంటూ నచ్చజెప్పాడు తండ్రి.

మర్నాడు పొద్దున్నే కొడుకుని లేపింది. వెంటనే బడికి తగలడమని తొందర చేసింది. రాత్రంతా తనకి నిద్ర లేకుండా చేసిన ఆ అమ్మ ఎవరో మాష్టారినడిగి కనుక్కురమ్మని చెప్పింది.

"ఈ రోజు ఆదివారం కదమ్మా! బడికి శలవు" అన్నాడు బిక్కమొహంతో.

"ఛీ! నీ బడి పాడుగాను" శపించినట్టుగా అంది.

సోమవారం క్లాసులో పిల్లవాళ్ళని ఉద్దేశించి అన్నాడు మాష్టారు, "చూడండి అబ్బాయిలూ విద్య బాగా నేర్చుకోవాలనుకుంటే సందేహాలను మీలోనే దాచుకోకూడదు. మీకే సందేహం వచ్చినా ధైర్యంగా ఉపాధ్యాయుణ్ణి అడిగి నివృత్తి చేసుకోవాలి. నా ఉద్దేశ్యంలో ప్రశ్నలడిగే విద్యార్థులే అసలైన తెలివిగలవారు'

వెంటనే చింగ్ పైకి లేచి "సార్! ఈ పుస్తకంలో మొదటి పాఠంలో 'ఈమె అమ్మ' అని ఉంది. ఎవరి అమ్మ సార్ ఈవిడ?" అని ప్రశ్న వేశాడు.

మాష్టారు చిన్నగా నవ్వి "ఈ పాఠం ఎవరు చదివితే వాళ్ళ అమ్మేనోయ్ ఈమె" అన్నాడు.

"కాదు సార్" చెప్పాడు చింగ్ మొండిగా. మాష్టారు గతుక్కుమని వాడికేసి పరీక్షగా చూశాడు.

"నేను చెవుతుంటే ఎందుకు అర్థం చేసుకోవు నువ్వు?" అన్నాడు శాంతంగా "సార్! ఈ లావ్ కూడా ఈ పుస్తకమే చదువుతున్నాడు. మరి వీడి తల్లి ఈమె మాదిరిగా లేదు కదా!" అన్నాడు చింగ్.

"సార్! ఈ లావ్ అమ్మకి ఒక కన్ను ఒక చెయ్యిలేదు" వంతపాడేడు పక్కనే కూర్చున్న చింగ్ సావాసగాడు.

"వీళ్ళిద్దరూ దొంగ మాటలు చెబుతున్నార్సార్! నాకసలు అమ్మేలేదు. ఎప్పుడో చచ్చిపోయింది" అసలు సంగతి బయటపట్టేడు లావ్. మాష్టారికి చిరాకువేసింది.

"సైలెన్స్... ఏమిటీ గోల?" అంటూ టేబుల్ మీద బెత్తంతో చప్పుడు చేశాడు. "ఇప్పుడు మనం రెండో పాఠం చదవాలి. పుస్తకం తెరవండి... 'ఇతనే నాన్న' ఊ!... చెప్పండి అంతా! ఇతనే నాన్న బొమ్మని బాగా చూడండి. కళ్ళజోడు ధరించి పేపరు చదువుతున్నాడే అతనే నాన్న" అంటూ పాఠం ప్రారంభించాడు మాష్టారు.

బడి నుంచి చింగ్ ఇంటికి తిరిగొచ్చాడు ఆ కొత్త అమ్మ ఎవరో కొడుకు కనుక్కుని వచ్చి ఉంటాడని ఎంతో ఆతృతతో ఎదురు చూసింది వాడి తల్లి, కాని వాడేమో వచ్చిందే తడవుగా పుస్తకం తెరిచి కూర్చున్నాడు.

'ఇతను నాన్న... ఇతను నాన్న...' అంటూ పాఠం వల్లె వేయడం మొదలెట్టాడు. అదిరిపోయింది. ఆమె. "ఏమే పిల్లాడికి ఈ కొత్త నాన్నని ఎప్పుడు పట్టావే?' అంటూ పెడర్థాలు తీసి మొగుడు గొడవ చేస్తాడేమోనని భయపడి నోరుమూసుకుంది. పిల్లకాయలకి అమ్మానాన్న గుండ్రాయిల్లా బతికుండగానే ఈ కొత్త అమ్మానాన్నల పాఠాలు ఎందుకు తెచ్చి పెట్టారో ఈ బళ్ళో అన్నది ఎంత బుర్రలు బద్దలుకొట్టుకున్నా ఆ పల్లెటూరి తల్లికి బోధపడలేదు.

కొన్ని రోజులు గడిచాక మరో కొత్తపాఠం చదవసాగేడు చింగ్. అందులో రెండు వాక్యాలు మాత్రం ఎన్నిసార్లు చదివినా వాడి బుర్రకి ఎక్కనేలేదు.

"ఎద్దులు మంటలను కాపాడును... గుఱ్ఱము సేమియా తినును" అయోమయంగా ఉంది పిల్లవాడికి, వాడింట్లోనే రెండు బలిసిన ఎద్దులూ, ఒక బక్కచిక్కిన గుఱ్ఱమూ ఉన్నాయి. మేత కోసం వాటిని ఊరి బయటకు తీసుకుని పోయాడు చాలాసార్లు. కాని ఏ రోజూ ఎద్దులు బండిలాగడం, అరకదున్నడం చూసివున్నాడు. గుఱ్ఱం గడ్డి తినడం చూశాడు. మరి ఇదెక్కడి చోద్యం! 'పాఠంలో ఏవైనా సందేహాలుంటే క్లాసులో నన్నుగానీ, ఇంట్లో మీ పెద్దవాళ్ళనుగాని అడిగి తెలుసుకోవాలి' అని మాష్టారు చేసిన హితబోధ గుర్తొచ్చింది. తండ్రి ఇంటికి రాగానే అడిగాడు. అతను కాసేపు దీర్ఘంగా ఆలోచించి అన్నాడు.

"నేనొకసారి టౌనుకి వెళ్ళినప్పుడు ఒక సర్కస్ చూశాను. దాంట్లో ఒక గుర్రప్పిల్ల గంటలు కొడుతుంది. తుపాకీ పేలుస్తుంది. ఒకవేళ ఈ పుస్తకంలో చెప్పిన ఎద్దూ, గుఱ్ఱమూ అట్లాంటివేనేమో?

"ఒరేయ్ నీ తెలివి బంగారంగానూ! అసలు సంగతి అది కాదురా, ఇది శాపం వల్ల ఎద్దుగా జన్మించిన రాక్షసుడై ఉంటుంది. మన పాత గ్రంథాల్లో చెప్పలేదూ!" అంటూ కథలు ప్రారంభించింది నాయనమ్మ.

"అది కాదత్తయ్యా" అని అడ్డొచ్చింది చింగ్ తల్లి.

"నువ్వు చెప్పేది వేరే గ్రంథాల్లో అయి ఉంటుంది" అని సమర్ధించుకుంది. అత్తఅంతటితో ఊరుకోకుండా మనవడికి బ్రహ్మరాక్షసి కథలూ, కొరివిదెయ్యాల కథలూ వినిపించింది. చింగ్ ఆ రాత్రంతా భయంతో మునగదీసుకుని పడుకున్నాడు. తనని బ్రహ్మరాక్షసి ఎత్తుకునిపోయినట్టూ, కొరివిదయ్యం తరుముకుని వస్తున్నట్టూ కలలుకన్నాడు. మర్నటిరోజు క్లాసులో మాష్టార్ని "సార్! ఈ ఎద్దు మనదేశం ఎద్దు కాదా సార్!" అని ప్రశ్నించాడు.

"వెధవా! నీకీ మధ్య అన్నీ ఇటువంటి సందేహాలే వస్తున్నాయేమిటి" అని కసిరాడు మాష్టారు.

"అది కాద్సార్, ఎద్దు మంటల్ని కాపాడును అని ఉంది. కదా"

మేష్టారు పుస్తకం తెరిచి చూసి కాసేపు ఆలోచించాడు.

"ఆc.... దొరికింది. "మంటల్ని అని కాదురా 'పంటల్ని' అని ఉండాలి పాఠంలో అచ్చు తప్పు దొర్లింది. ఇప్పుడు తీరిందా నీ సందేహం" అన్నాడు. మేష్టారు మీసం మెలేస్తూ.

"ఎద్దు పొలం దున్నుదుందిగాని పంటల్ని కాపాడదండీ" అని అడ్డుతగిలాడు లివ్

"వెధవా, నోరు మూసుక్కూచో, నిన్నెవ్వరడిగాడోయ్?" అని పాపం వాణ్ణి కసురుకున్నాడు. మాష్టారు.

"ఏమోయ్! ఇంకా సందేహాలేమైనా ఉన్నాయా?" అడిగాడు మేష్టారు ఇంకా నిలుచుని ఉన్న చింగ్‌ని.

"గుర్రము సేమియా తినును' అంటే ఏమిటి సార్?"

మేష్టారు ఈ సారి పకపక నవ్వి చెప్పాడు.

" ఒరేయ్! ఈ పుస్తకం రాసినాయనకి ఆ మాత్రం తెలీదంటావా? మీకెంత మాత్రం తెలివుందో పరీక్షించడానికే ఇట్లాంటి తికమక వాక్యాలు పెట్టారు.

గుర్రం గడ్డే తింటుంది. సేమియాకీ, గడ్డికీ తేడా తెలీని తెలితక్కువదేమీ కాదు గుర్రమంటే. మీరు పరీక్ష రాసేటప్పుడు సేమియా అన్న పదాన్ని పెన్సిలుతో కొట్టేసి

దానిపైన 'గడ్డి' అని రాయాలి. అర్థమైందా? వెర్రి మొర్రి ప్రశ్నలు వెయ్యకుండా ఎక్కాలు చదవండిక" అని బెత్తంతో విసురుగా బెంచీ మీద కొట్టాడు మేష్టారు. ఇప్పుడు చాలా వరకు పాఠం బోధపడినట్టే అనిపించింది. చింగ్‌కి.

ఒకరోజు 'తేనీటి విందు'ని గురించిన పాఠం చెప్పాడు మాష్టారు. పిల్లలంతా కలిసి తలా పది రూపాయలు చందా వేసుకుని పాఠంలో వచ్చిన మాదిరిగా పార్టీ చేసుకోవాలని తీర్మానించుకున్నారు. అందుగ్గాను తండ్రిని డబ్బులడగాలి. కాని ఇంట్లో అడిగితే డబ్బులకి బదులు వీపుమీద దెబ్బలు పడతాయన్న సంగతి చింగ్‌కి తెలుసు. క్లాసుపరీక్షలకి తెల్లకాయితాలు కొనాలన్నా, ఈ పాడు చదువు మనకొంపని గుల్లచేస్తూవుందని గోల పెట్టేస్తూ వుంటుంది నామనమ్మ. కాని టీ పార్టీ హొదులుకోవాలంటే కష్టంగా వుంది. అమ్మ దాచివుంచిన విత్తనాలని అమ్మి అయినా సరే పార్టీకి డబ్బులు సంపాదించాలని నిశ్చయించుకున్నాడు. పార్టీకి ఆరంజి పళ్లు, యాపిల్‌పళ్లు, చాక్‌లెట్లు మొదలైనవన్నీ కొనాల్సివుంటుందని ఇంటోవాళ్లకి చెప్పి వున్నాడు. తాత చాన్నాళ్లనుంచి దగ్గుతో బాధపడుతున్నాడు. ఆరంజిపండు తోలు దగ్గుని హరాయిస్తుందని ఎవరో నాటువైద్యుడు తాతకి ఒకసారి చెప్పివున్నాడు. అందుచేత దానికోసం ఆయన కూడా ఆతృతగా ఎదురుచూస్తున్నాడు. ఎక్కడ దొరుకుతుందా అని. ఈ సాకుతో ఇంట్లో డబ్బులడగవచ్చులే అని ఆలోచించాడు చింగ్.

"ఇంతకీ ఆరంజి పండ్లెందుకురా నీకిప్పుడు?" ఏమీ తెలినట్టు అడిగాడు.

"మేం టీ పార్టీ చేసుకోబోతున్నాం తాతా" టీ పార్టీయా?" అదేమిటి?"

"మా పాఠంలో వచ్చింది" అని వివరించాడు.

"ఒర్నీ! ఏం చదువుర్రా ఇవి? మంటల్ని కాపలా కాసే ఎద్దులూ, సేమియా తినే గుర్రాలూ పిల్లకాయలకి విందులు మప్పి మందబుద్ధుల్ని చేసే పార్టీలూ.. ఏడ్చినట్టే వుంది నీ బడి" అన్నాడు. తాత కోపంగా.

"మనదేశపు తిండి గురించి ఒక్కమాటైనా రాయలేదేమిరా మీ పుస్తకంలో? జొన్న సంకటిని చేపల పులుసుతో కలుపుకోవడం, చిక్కుడుకాయల ముక్కలతో తయారుచేసే పెరుగుపులుసు చింతకాయపచ్చడీ. ఇవన్నీ తిళ్లుకాదా! వాటి గురించిన పాఠాలుండవా మీకు?" అడిగింది నానమ్మ.

“పోనీండి, బిడ్డ సరదా పడుతున్నాడు. ఈసారికీ పార్టీ చేసుకోరా?” అని వత్తాసుపలికి డబ్బులిచ్చింది కొడుక్కి.

“ఒరేయ్! తాతయ్య దగ్గకి ఆరంజితొొక్కలు తేవడం మరిచిపోవద్దు” అని గుర్తుచేసింది.

“మరే...మరే... మాక్లాసులో పిల్లందరం కలిసి...“నీళ్లు నమిలాడు చింగ్. సరిగ్గా ఆ క్షణంలో పక్కింట్లో నివసించే లావ్ లబోదిబోమని కేకలు పెట్టడం వినిపించింది.

“ఏదో నాలుగక్షరాలు నేర్చుకుని బాగుపడతావని నా రక్తమంతా ధారపోసి చదివిస్తున్నాను. పుస్తకాలు కొనిచ్చాను. ఇప్పుడు టీ పార్టీ కావాల్సివచ్చిందా నీ మొహానికి? వెళ్ళి మీ మాష్టారినే అడుక్కో ఫో” అని అరుస్తున్నాడు లావ్ తండ్రి.

విషయం అర్థమైంది చింగ్ నాన్నకి. ఎగిసి ఒక్క తన్ను తన్నేడు. చింగ్ తెలివిగా పక్కకి జరిగేడు ఆ తన్ను కుర్చీకి తగిలి వెళ్లి బియ్యం బానలమీద పడింది. బానలు పగిలి నేలమీదంతా బియ్యం చిమ్మాయి.

“పిల్లవాణ్ణి బడిమానిపించండి. ఎందుకు లేనిపోని గొడవ” చెప్పాడు తాత.

కాని నాయనమ్మ ఒప్పుకోలేదు. తన కొడుకు జైలుకి పోవడం ఆమెకిష్టంలేదు కాసేపు చర్చించుకుని మరికొన్నాళ్లు బడికి పంపించడానికే నిర్ణయించుకున్నారు అంతా.

తను బాగా చదివి వృద్ధిలోకి రావాలని శపథం పూనాడు చింగ్. దీక్షగా పాఠాలు చదువుతున్నాడు. కాని వాడి దురదృష్టానికంతా కారణం తాను చదివే పాఠాలే అన్న సంగతి ఆ పసివాడు తెలుసుకోలేకపోయాడు. నానమ్మకి ఆ ఇంట్లో ఎవరూ తనని లెక్కచేయటం లేదన్న అభిప్రాయం ఏర్పడసాగింది. తన ప్రాముఖ్యత రోజురోజుకీ ఆ ఇంట్లో తగ్గిపోతున్నట్టుగా అనిపించసాగింది. అందుకు తగినట్టు ఆరోజు మనవడు చదువుతున్న పాఠం విని ఆమెకు వొళ్లు మండింది.

ఆ “ఇది మా కుటుంబం. ఇందులో ఒక నాన్న ఒక అమ్మ ఒక తమ్ముడు ఒక చెల్లి వున్నారు...” అంటూ బట్టీ పెడుతున్నాడు చింగ్. ఆ పాఠంలో నానమ్మ. తాతయ్య ప్రసక్తి లేనేలేదు.

"అంటే, ఈ ఇంట్లో మీరే మనుషులన్న మాట ఈ ఇల్లంతా మీదేనన్నమాట. దీంటో నాకూ, ఆ ముసలాడికీ స్థానం లేదన్నమాట" అని కేకలు పెడుతూ పక్కనే చేతికందిన ఇటుకరాయిని బలంగా నీటిబిందెమీద విసిరేసింది ముసలావిడ. బిందె సొట్టపడి దొర్లి నేలంతా నీటితో తడిసిపోయింది. "అమ్మా శాంతించు, ఈ పాఠాలూ వొద్దు, ఈ బడులూ వద్దు మనికి, రేపట్నించీ వాణ్ణి బడి మానిపించి నేను జైలుకి పోతాను" అన్నాడు తండ్రి విరక్తిగా. మర్నాడు పొలంలోని పనిమనుషుల్లో ఒకడిని తగ్గించాడు తండ్రి. క్లాసులో చింగ్‌కి ఆబ్సెంటు వేశాడు మేష్టారు.

⁂ ⁂ ⁂

# అడవి పువ్వు

- బి.మురళీధర్

**అ**ప్పాయింట్‌మెంట్ ఆర్డర్స్ చేతికందగానే నా ఆనందం వర్ణనాతీతం!

కాని అది అట్టేసేపు నిలవలేదు.

ఆదిలాబాద్ జిల్లా, ఉట్నూరు తాలూకాలోని ఓ మారుమూల గ్రామంలో వెలసిన ఏకోపాధ్యాయ పాఠశాలకి నన్ను నియమించారు. గతంలో నాకా ప్రాంతం పరిచయమైనప్పటికీ అక్కడే వుండి ఉద్యోగం చెయ్యాలనేసరికి కొంచెం దిగులు పట్టుకుంది.

ఆపల్లెలో గోండుజాతి వారివి యాభైవరకు గుడిసెలున్నాయి. గ్రామ పెద్ద సాదరంగా ఆహ్వానించాడు. పాఠశాల గురించి అడిగితే ఆ వూరి చివరన, ఏటిఒడ్డున వున్న ఒక పురాతనమైన మర్రిచెట్టును చూపించాడు. కొన్నేళ్ల క్రితం నాలాగే ఒక 'సాహసజీవి' వచ్చి కొన్నిరోజులు మాత్రమే వుండి మళ్లీ ఆ మర్రిచెట్టు ఛాయలకు రాకుండా పోయాడట. అప్పట్నుండీ అనివార్యకారణాలవలన ప్రభుత్వానికీ ఆ పల్లెకూ విద్య విషయంగా మాత్రం సంబంధమే తెగిపోయిందట.

నాకూ ఆ వూళ్లో బసచేయాలనిపించలేదు. రెండు కిలోమీటర్ల దూరంలోని ఓ మోస్తరు పెద్ద పల్లెటూల్లో వుండి రోజూ ఇక్కడికి రావాలని నిర్ణయించుకున్నాను.

సర్కారువారికి ఓ మాంఛి ప్రారంభోత్సవ సువర్ణావకాశం తప్పిపోయినందుకు చింతిస్తూ మొదటిరోజు ఏ ఆర్భాటాలు లేకుండా ఆ సనాతనమైన మర్రిచెట్టు కింద మా

బడిని కొబ్బరికాయ కొట్టి నేనే పునఃప్రారంభించాను. ఇక నా ఆసనం ఆలంకరిద్దామనుకుంటే అలాంటి వస్తువొకటి ఇంతకు ముందుగానీ ఇప్పుడుగానీ వాళ్ల వూళ్లోలేనేలేదని వూరిపెద్ద తెలిపాడు. తాత్కాలికంగా ఓ నాలుక్కాళ్ల వెడల్పాటి పీటను తెప్పించారు. దాని మీద అందంగా నగిషీలు చెక్కబడివున్నాయి. అది కూడా మర్రిచెట్టంత వయసు కలిగివుంది. అది దొరకడమూ అదృష్టమేనని సరిపెట్టుకున్నాను.

కొద్దిసేపటికి నా శిష్యులొక్కక్కరే నీడలోకి చేరుకుంటున్నారు. వాళ్ల అవతారాల్ని చూసేసరికి నాకు పారిపోయిన ఆ సాహసజీవి గుర్తుకొచ్చాడు. పాపం! దేవుడాయన్ని తొందరగా కాపాడేడు. మరి నన్నెప్పుడు కాపాడతాడో.

పిల్లలు ముప్ఫయ్‌మంది దాకా వచ్చారు. వాళ్లలో సగం నగ్నంగానూ, మిగతాసగంలో సగం అర్థనగ్నంగానూ, మిగిలినవారు బట్టలు కట్టుకొని వున్నారు. వాళ్ల శరీర సహజఛాయ చేలల్లో కనిపించే దిష్టిబొమ్మమీద బోర్లించే మసికుండకు కొంచెం అటూఇటూగా వుండి, కళ్లు మాత్రం ఆ కుండపై పెట్టిన సున్నం బొట్లలాగా తెల్లగా మెరుస్తున్నాయి. ఆ అవతారాలకిప్పుడు నేను 'చదువు నేర్పాలి' అనుకునేసరికి నాకు ప్రసూతివైరాగ్యంలాంటి పాఠశాల వైరాగ్యం వచ్చేసింది.

మూడవరోజు అటెండెన్స్ రిజిస్టర్‌లో పేర్లు రాస్తోన్న నేను అయ్యా! అనే పిలుపువిని తలెత్తి చూశాను.

మర్రిచెట్టు నీడకవతల ఎండలో ఒకామె నిలబడివుంది. ఆమె నల్లగా వుంది. కాయకష్టంతో ఒల్లు ఎక్కడికక్కడ కాయలు కాసివుంది. ఎడారిలోని పచ్చనిమొక్క వర్షాలకోసం నిరీక్షిస్తూ గిడకబారినట్లుగా వుంది. ఎడారిలో వర్షాకాలం వుండదని తెలియని దానిలా వుంది. ఆమెకు బుద్ధి తెలిసినప్పటి నుండి ఆమె తలకు నూనెలాంటిదేదీ తెలిసినట్లు లేదు. ఒంటికి చుట్టుకున్న గుడ్డ కప్పలేని భాగమంతా పచ్చబొట్లు కనిపిస్తున్నాయి. కళ్లల్లో నీటిబొట్లు కనిపించకపోయినా అని వర్షాకాలపు మేఘాల్లానే వున్నాయి.

ఆమె కాళ్లకి చుట్టుకుని ఓ పిల్లాడున్నాడు వాడికి తొమ్మిదేండ్లు వుండవచ్చును. కానీ కాళ్ళూ చేతుల సైజు వాడి వయసును తగ్గించేట్లుగా వున్నాయి. ఒంటిమీద లాగూ వుంది. కాని అది వాడి వంటిరంగులో కలిసిపోయింది. గుండీ లుండేచోట మాత్రం ఒక తెల్లని జనపతాడు ముడేసివుండటం వలన లాగూ వునికి తెలుస్తోంది.

"ఏం కావాలి?" అడిగాను.

ఆమె రెండడుగులు ముందరికివేసి "ఇగో!గీనా పోరణ్ని మీశాల్ల దీస్కోండ్రి" తడబడుతూ అందామె.

"సరే తెచ్చి ఇట్లా కూర్చోబెట్టు వాడిని" వాళ్ల భాషలో ఏదో బుజ్జగిస్తూ వాణ్ని అందరికన్నా ముందరతెచ్చి కూర్చోబెట్టింది.

"మీవాడి పేరేమిటి?"

"చిన్నూ అయ్యా!" ఎంతో కుతూహలంగా చెప్పింది.

"తండ్రి పేరేమిటి?"

"ఆడులేడు బాపూ! సచ్చిపోయిండు!" బాధగా అంది. "చచ్చిపోయినా పేరేమిటో చెప్పు"

"మల్కు" అని చెప్పిందామె!" "సరే! నువ్వెళ్లు."

ఆమె తన ఒంటికి చుట్టుకున్న గుడ్డలో ఓ మూలనుంచి, ఒక చిన్న బెల్లంముక్క తీసి వాడి చేతిలోపెట్టి, కళ్ళల్లో ఒక విధమైన సంతోషం కదలాడ్తుండగా తన దారినిండా రంగుల కలల్నిపరచుకొని వాటి మీద నుంచి నడచివెళ్ళింది.

మరో రెండు రోజులకి తాలూకా సెంటరు నుండి ప్రాథమిక బోధనా సామగ్రి తీసుకొచ్చాను. కుర్చీమాత్రం సంపాదించలేకపోయాను. గవర్నమెంటు వారి దయకలిగే వరకు నాకు ఆ నాలుక్కాళ్ళ 'సింహాసనంపై మఠం వేయక తప్పదు.

ఓరోజు మా బడివాతావరణం చూస్తే నాకు ఉత్సాహంతోబాటు గర్వం కూడా కలిగింది.

పూర్వకాలపు మునికుమారులందరూ, శాపవశాత్తు ఈ పల్లెలో పుట్టి ఇలా నగ్నంగా, అర్ధనగ్నంగా, ఏటిఒడ్డున మర్రిచెట్టు నీడలో నాలుక్కాళ్ళ పీటపై మఠం వేసుకుకూర్చున్న ఓ మహర్షి ముందు సర్వవేదాల సారం చదవడానికో, ఉపనిషత్తులను ఆపోశన పట్టడానికో కూర్చున్నట్లనిపించేది. నిజమేమరి! నేను, నిజంగా ఏ మహర్షి లాంటి ఓపికనో కలిగి ఉంటేనే తప్ప, నా తపస్సంతా వీళ్లకి ధారపోస్తేనేగాని ఆ ఆ లు చివరి దాకా నేర్పడం కష్టమనిపించిందా క్షణంలో.

నాకు లేకలేక దొరికిన ఉద్యోగమవడం వల్లనేమి, తప్పనిసరిగా నేనుద్యోగం చేయవలసిన పరిస్థితుల వల్లనైతనేమి పదిహేను రోజుల్లో ఈ 'అరణ్యవాసానికి' అలవాటు పడక తప్పలేదు. అందుకని నా దృష్టినంతా పిల్లలపైనే కేంద్రీకరించాను.

అందరికంటే చివరగా చేరిన ఆ విధవరాలి కొడుకు 'చిన్నూగాడు మాత్రం చదువును చాలా 'సీరియస్'గా తీసుకుంటున్నాడనిపించింది. మిగతా వారికంటే కొంచెం బలహీనంగా ఉన్నా అందరికంటే ముందుగానే అక్షరాలను చాలా స్పష్టంగా, దాదాపు నేను రాసినట్లుగానే రాస్తున్నాడు. చెప్పేటప్పుడు చాలా శ్రద్ధగా వింటాడు. చెప్పింది అర్థమయినప్పుడల్లా వాడి చిన్న కళ్ళు మిలమిల మెరుస్తుంటాయి. వాడి మీద నాకు గల జాలి, అభిమానంగా బలపడసాగింది. ముఖ్యంగా వాడి అవతారం మర్చిపోలేనిది.

అన్నివైపులా నిక్కబొడుచుకొని ఏ రంగులో ఉన్నాయో తెలియని వెంట్రుకలు, నిజానికవి ఏ సంతలోనో, రోడ్డు పక్కన, ఆ రోజు కోసం వెలిసే మొబైల్ హేర్‌కటింగ్ సెలూన్‌లో, పోయిన వేసవి సెలవుల మొదట్లో కేశఖండన మహోత్సవానికి నోచుకొని వుంటాయ్! వాడి మొహం పిల్లలు చుట్టిన సున్నాలాగా ఉంటుంది. చేతులూ, కాళ్ళూ వదులుగా ఉండి. సరియైన స్థానాల్లో అమర్చనట్లుగా ఉంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే 'పికాసో' వేసిన గొప్ప పెయింటింగ్ లాగా వాడిలో అధివాస్తవిక చిత్రకళ ఉట్టి పడుతూ ఉంటుంది. పాఠం చెప్తున్న టీచర్ నుండి జ్ఞానాన్నంతా తన చూపుల్తో లాగివేయాలన్నంత తపన వాడికళ్ళల్లో కన్పిస్తూ వుంటుంది. ఆ మెరుపే నన్ను వాడివైపు బలంగా ఆకర్షించసాగింది. మాసాంత పరీక్షలో సగం అక్షరాలు, రెండు తప్పులతో కరెక్టుగా వ్రాయగలిగినవాడు చిన్నూ ఒక్కడే! దాంతో వాడిలో మరికొంత ఉత్సాహమివ్వాలని వాడిని క్లాసు లీడర్‌ని చేశాను. క్లాసులీడర్ యొక్క డ్యూటీలు వాడికర్థమయ్యేట్లు చెప్పాక వాడికళ్లల్లో మరింత మెరుపొచ్చింది. ఒంటి మీదకి ఎక్కడిదో, కొంచెం పెద్దదైనా ఒకే చిరుగు ఉన్న చొక్కా వచ్చింది. ఒకరోజు మా వాడికి నిజంగా కొత్త కళ వచ్చింది. ఒకరోజు నేను మఱ్ఱిచెట్టు కింద అదేలెండి, మా పాఠశాలకి చేరుకునే సరికల్లా పిల్లలెవరూ కన్పించలేదు. కాని చెట్టు క్రింద మా పాఠశాల ఆవరణ మాత్రం చిక్కటి పేడతో అప్పుడే అలకబడి, చల్లగా పేడవాసనవేస్తోంది. నేను నిన్ననే వీళ్ళకి పరిశుభ్రత గురించి చెప్పిన పాఠం జ్ఞాపకం వచ్చింది. నన్ను చూసిగాబోలు ఏటిలోంచి పిల్లలందరూ బిల బిలమంటూ వచ్చేస్తున్నారు. చిన్నూగాడు అందర్నీ కేకలేస్తున్నాడు. గురూజీ అచ్చిండు, నడుంబ్రి జెల్దీ' అని, టీచర్‌ను 'సార్' అని కాకుండా 'గురూజీ" అని

పిలవమని వీళ్ళకెవరు చెప్పారోకాని, ఆ పిలుపును కొత్తలో మారుద్దామా అని ఆలోచించి, ఆ వాతావరణానికి సహజసిద్ధమైన ఆ పిలుపే బాగుంటుందని నేను మార్చలేదు.

"ఏరా చిన్నూ! ఎవరలుకుమన్నార్రా నిన్ను!"

"నేనే అలికిన గురూజీ! బాగాదుబ్బ ఉండే గురూజీ! ఉప్పుడు దుబ్బలెవ్వది. ఈళ్ళందరూ నీళ్ళు మోసింర్రు గురూజీ" ఉత్సాహంగా చెప్పాడు.

ఓ మూలనుండి నా నాలుక్కాళ్ళపీటను తెచ్చివేశాడు. శతాబ్దాల తర్వాత అది అభిషేకానికి నోచుకున్నట్లుంది. చిన్నూగాడు వెంటనే మర్రిచెట్టుతొర్రలో దూరాడు. కాస్సేపటికి అందులో నుండి డస్టర్, చాక్‌పీస్‌డబ్బా, మడతబోర్డూ తీసుకొని బయటకు వచ్చాడు. క్లాసులీడర్ అయినప్పట్నుంచీ వాటి ఛార్జీ వాడికిచ్చేశాను. వాడింటికి తీసుకెళ్తున్నాడేమో అనుకున్నానిన్ని రోజులు ఎందుకంటే రోజూ నేను వచ్చేసరికల్లా దేనిస్థానంలో అని వుండేవి.

"చిన్నూ! ఇవన్నీ ఇక్కడే పెడ్తున్నావురా? ఎవర్నా ఎత్తుకెళ్తే ఎలారా?"

ఓళ్ళు ముట్టరు గురూజీ! ఓళ్ళన్నా ముడితే నువ్వు బాగ్గగొడ్తవని సెప్పిన! మాయ్యింట్ల పెడితే అర్షం పడితే నానిపోతాయి గురూజీ! గందుకు ఈన్నే ఉంచిన. మర్రిచెట్టు తొర్రకేసి చూశాను. నిజమే. ఆ తొర్రలో ఎంత పెద్దవర్షం పడినా తడిసే అవకాశంలేదు. మరి, చిన్నూగాడి గుడిశెలో మర్రిచెట్టు తొర్రంత జాగా కూడా వర్షానికి తడవనిది, లేనట్లా? ఏమో వాళ్ళ బతుకులలాంటివే మరి.

ఈ మారుమూల అడవుల్లో 'కొండతేనెటీగలు' రోజంతా రెక్కలు ముక్కలుచేసుకొని, రకరకాల అడవిపూల నుండి మకరందాన్ని సేకరిస్తే "కొండతేనెపట్టులు" సేకరించడంలో సిద్ధహస్తులైన కొందరు రకరకాల వేషాలతో వాటిని తరిమేసో, మాయంచేసో, ఆపట్టుల్ని పట్నాలకిచేరిస్తే, అక్కడ కలిగినవాళ్లు ఒంట్లోని కొవ్వు కరిగించుకోడానికి ఉదయం సాయంత్రం దాన్ని "చెమ్చాలతో" సేవిస్తారు. చివరకు కొండతేనెటీగలకి మాత్రం మళ్ళీ చెట్టూ పుట్టేగతి.

ఓరోజు, చిన్నూగాడు బడికి టిఫిన్ తెచ్చుకున్నాడు.

"ఎందుకురా చిన్నూ ఈరోజు సిద్ధితెచ్చుకున్నవ్.

“అవు గురూజీ మాఅవ్వ దూరంచేండ్లకి కూలికిబోయింది. చీకటిపడినంకనే ఇంటికొస్తది. పగటికి తినుమని ఇచ్చింది.

వాడు మధ్యాహ్నం తింటూంటే కుతూహలంగా చూశాను. ఓ పాతపీలికలో రెండు నల్లటి పిండిముద్దలు, బహుశా అవి మినపరొట్టెలు కావచ్చు. వాటిమధ్య రంగూ, ఆకారం తెలీని కూరలాంటి పదార్థం, అది ఉడకేసిన వంకాయ అని వాడినడిగి తెలుసుకున్నాను. రెండు పచ్చిమిరపకాయలు, కొన్ని ఉప్పుగళ్ళు. ఆపీలికలకు వేసిన ప్రత్యేకముడిలో చిన్నబెల్లంముక్క, ఇది వాడి టిఫిను.

‘ఇరవైఒకటో శతాబ్దంలోకి పురోగమిస్తున్న దేశంలోని ఏ ఒక్క ‘ఫైవ్‌స్టార్’ హోటల్లో ఒకరాత్రికి ఖాళీచేయబడిన ‘ఖాళీ’సీసాలనమ్మితే ఈ పల్లె మొత్తం కొన్ని రోజులైనా కడుపు నిండా తింటుందనిపించింది. ఈ నిజం నిజంగా ఈ పల్లెవాసులకి తెలియదు. తెలిస్తే గనక, ఏంచేస్తారో నాకూ తెలియదు.

మరొకరోజు, గిరిజనులకై ప్రత్యేకంగా వెలసిన సంస్థకు సంబంధించిన ఒక ఉన్నతాధికారి, మా బడి పరిశీలన నిమిత్తం ఆ పల్లెకు వేంచేయనున్నారని వర్తమానం అందింది.

పిల్లలందరికీ విషయం వివరించి, కొన్ని ప్రత్యేక సూచనలిచ్చి మర్నాడు బడికి అందరూ రావాలని, శుభ్రంగా రావాలని ఆదేశించాను.

తెల్లవారి, ప్రతిరోజుకన్నా ముందే పిల్లలు స్కూలుకు చేరుకున్నారు. అప్పుడే స్నానంచేసి వచ్చారేమో, ఇంకా కొందరి తలల్లోంచి నీళ్ళుకారుతూనే ఉన్నాయి. చిన్నూ మాత్రం కన్పించడంలేదు. వాడెప్పుడు అందరికన్నా ముందే రావాల్సినవాడు ఈ రోజు టైమయినా రాలేదు. ఆరాతీస్తే తేలిందేమిటంటే, వాడితల్లికి రావాల్సిన కూలిడబ్బులు ఆలస్యంగా అందాయని, దాంతో వాడికి వాళ్ళమ్మ సబ్బు కొనివ్వడానికి ఆలస్యమయిందనీ, ఇప్పుడిప్పుడే అంగీ ఉతుక్కొని స్నానం చేస్తున్నాడని తేలింది.

కొద్దిసేపటికి రానేవచ్చాడు చిన్నూ! తలలోంచి నీళ్ళుకారుతూనే ఉన్నాయి. ఒంటిమీద సగం పచ్చిగా సగం పొడిగా ఉన్న ఆ పాతచొక్కానే కొంచెం తెలుపుగా కనిపిస్తోంది. సబ్బుతో స్నానం చేయడం వల్లనేమో వాడు మరింత నల్లగా నిగనిగలాడుతున్నాడు. దోషిలాగా దూరం నిలబడ్డాడు. దగ్గరకు రమ్మనట్లు సైగచేశాడు.

“నా అంగీ ఆరలేదు గురూజీ. అందుకు ఆలస్యం అయ్యింది. ఒంటిమీద సగం ఆరిన అంగీతో వచ్చి నిలబడిన చిన్నూగాడ్ని చూస్తే నాకెందుకో వాడిమీద వాత్సల్యం పొంగివచ్చింది. దాని వెంటనే భయం కూడా వేసింది. ఇంత గుడ్డిగా ఈ గురూజీని, బడిని నమ్ముకున్న వీడికి ‘నిజం’ తెలిసేరోజు రాకపోదు. తాను ఇంతకష్టపడి చదివిన చదువులన్నీ బూటకాలనీ, చదివిన చదువుకీ, జీవిత విధానానికీ ఏ మాత్రం సంబంధం జోడించలేని దేశంలో తాను పుట్టాననీ, వీడికెలాగూ తెలుస్తుంది. ఏమయినా వీడిని మాత్రం ఏదో చెయ్యాలి. ఈ యాంత్రిక విధానం నుండి, ఈ రొటీన్ చదువుల నుండి వీడిని తప్పించాలి. ఈ మారుమూలన పడివున్న మట్టిలోని మాణిక్యానికి తప్పక మెరుగుపెట్టాలి. కాని వాడి మీదనే తన ఆశలన్నీ పెట్టుకొని బ్రతుకుతున్న ఆ విధవరాలు చిన్నూని విడిచి ఉండగలదా? చిన్నూని ఆమెకు దూరం చేస్తే తాత్కాలికంగానైనా భరించగలదా?

రవాణా సౌకర్యాలు ‘మెరుగ్గా’ లేనందువల్ల ఆ ఉన్నతాధికారిగారు, మా పల్లెకు రాలేకపోయారని కబురొచ్చింది.

ఆ మర్రి చెట్టు నీడలో నేను సాధించిన ప్రగతి వారికి వివరిద్దామని ఉబలాటపడ్తోన్న నాకు నీరసం వచ్చింది.

చూస్తూండగానే వేసవి సెలవులు వచ్చేశాయి. ఒక రోజు ముందే పిల్లలందరికీ రేపే బడి చివరిరోజని చెప్పేశాను. పిల్లలందరూ ఆనందపడిపోయారు. చిన్నూ మొహంలో మాత్రం ఆనందం కన్పించలేదు. వాడెందుకో మౌనంగా ఉండిపోయాడు.

“ఏరా చిన్నూ! అలావున్నావ్! సెలవులంటే ఇష్టంలేదా? అడిగాను.

“నువ్వు అన్ని రోజులు మీ వూరుకు వెళ్ళిపోతావా గురూజీ? బడిలేకపోతే నేను రోజూ ఏం చెయ్యాల గురూజీ?

నేను మళ్ళీ సెలవులయిపోగానే వచ్చేస్తాగదా! సెలవుల్లో నువ్వు పుస్తకం మొత్తం చూడకుండా వ్రాయడం నేర్చుకో, నేను రాగానే అన్నీ తప్పులు లేకుండా నాకు వ్రాసి చూపించాలి. నేను వచ్చేటప్పుడు నీకు కొత్త పుస్తకం తీసుకొస్తా సరేనా?” బుజ్జగిస్తూ అడిగాను.

వాడు మౌనంగా తలూపాడు.

మర్నాడు గ్రామపెద్ద తనింటికి భోజనానికి ఆహ్వానించాడు. స్కూలు టైమవగానే పిల్లల్ని తర్వాత కలవమని చెప్పి గ్రామపెద్ద ఇంటికి వెళ్ళాను. అక్కడ భోజనం తర్వాత, దాదాపు ప్రతి ఇంటివాళ్ళు ఆప్యాయంగా ఆహ్వానించడం, కూర్చోబెట్టి వట్టి వేళ్ల డికాక్షన్ పోయడమో, పాలు, పెరుగు తాగమనో బలవంతం చేశారు. మరికొందరు సీసాల్లో తేనె, ఇంకొందరు సారపలుకులు, జీడిపలుకులు నావెంట తీసుకెళ్ళమని తయారు చేశారు. నా లగేజీ మోయడానికి ఇద్దరు పిల్లలు కూడా చేరారు.

నేను బయలు దేరే వేళ దగ్గరపడుతోంది. చిన్నూని పిల్చుకరమ్మని పిల్లల్ని పంపాను. ఇంట్లోలేడని తిరిగి వచ్చారు. నాకేమో వాడితో చెప్పనిదే పోవాలనిపించడంలేదు. ఇంకాస్సేటికి ఉండబట్టలేక ఇద్దరు పిల్లల్ని తీసుకొని నేనే వాడింటికి వెళ్ళాను పూరి గుడిసైనా పరిసరాలు చాలా పరిశుభ్రంగా ఉన్నాయి. తలుపుకి గొళ్ళెం వేసి వుంది. 'వీడికక్కడికెళ్ళాడబ్బా!' అనుకుంటూ వెనుదిరిగేటప్పటికి నున్నటి మట్టిగోడపై బొగ్గుతో గీసిన నిలువుగీతలు కన్పించాయి. ఎందుకలా గీశారని ప్రక్కనున్న పిల్లల్ని అడిగితే చెప్పారు వాళ్ళు అవి చిన్నూగాడి సెలవుల లెక్కలు! రోజూ ఒకటి తుడిపేస్తూ పోతోంటే, బడి ఎన్ని రోజుల్లో తెరుస్తారో తొందరగా తెలిసిపోతుంది. వాడి తెలివికి అభినందించకుండా ఉండలేకపోయాను.

మసక చీకటి పడుతోంది. నేను బయలుదేరక తప్పలేదు. చిన్నూగాడికోసం మనసులాగుతోంది. ఊరు దాటికొంచెం దూరం నుంచే నడిచేసరికి దూరంగా మసకచీకట్లో చిన్నూ పోలికలున్న ఆకారం వస్తూవుంది. కుతూహలం పట్టలేక వడివడిగా అడుగులేశాను. చిన్నూగాడే, వాడి నెత్తిమీద బరువేదో ఉన్నట్టుంది వగరుస్తున్నాడు.

"చిన్నూ! నువ్వేనా అప్పట్నుంచి నీకోసం చూస్తున్నాను. ఎక్కడికి వెళ్లావు." "మీరు పోతరని గీకర్బూజాపండు తెచ్చిన! వాడినెత్తిన దాదాపు నాలుగుకిలోల బరువుగల కర్బూజాపండు, ఒక్క ప్రక్కన చిన్న ముక్కకోసివుంది. మసక చీకట్లో కోసిన భాగం ఎర్రగా కన్పిస్తోంది.

"ఎక్కడ్నుంచి తెచ్చావురా చిన్నూ! నీకు చేనులేదుగదా! మరి దొంగతనం చేసి తెస్తున్నావురా!' కొంచెం బాధగా అడిగాను.

"హే! నాతల్లి ఒట్టు గురూజీ! దొంగతనం సెయ్యలెగురూజీ! గీపండు కొండుగాడి తోట్లది, అడిని అడుగుంద్రీ గురూజీ! ఆడుత్తగానే ఇయ్యమంటే ఇయ్యలే!గా

అంగీ నాది ఉండెగదా గురూజీ! అది కొండుగాడికి పసందైంది. అంగీ ఆడికిస్తే గీపండు నాకిచ్చిండు గురూజీ. గిది బాగా మక్కిందో, కాదో అని గా జాగా మీద కొంచెం కోసి తినిసూసిన, బగ్గతియ్యగా ఉన్నది. గురూజీ! తీసుకోండ్రి!" నిజాయితీ నిండిన గొంతుతో అన్నాడు. తనకు ఉన్న ఒకే ఒక అంగీని ఎవడికో ఇచ్చేసి, చదువునేర్పిన గురూజీకోసం ఈ గురుదక్షిణ తెచ్చిన చిన్నూ సభ్యప్రపంచంలోని నాలాంటి మరెందరో కంటే ఎన్నో మెట్లు పైనున్నాడనిపించింది. ఇంకెవడన్నా చిన్నూగాడిని అంగీబదులు తోలే వలిచి ఇయ్యమన్నా ఇచ్చేసి, దీన్ని సాధించుకు వచ్చేవాడేమోననిపించింది.

ఆ ఊరుకు నాలుగు దిక్కులా గోడల్లాగా ఉన్న పర్వతసానువులు జనారణ్యకల్తీ నాగరికతను ఈ ప్రాంతానికి రానివ్వకుండా అడ్డుపడ్డం వల్లనే కావచ్చు. చిన్నూ గాడిలాంటి చిన్నపిల్లల సంస్కారం కూడా అంతనిర్మలంగా ఉంది, వసంత ఋతువులో ఈ అడవి వెదజల్లే సువాసనలు కూడా చిన్నూ మనసంత నిర్మలంగా అంత బరువున్న గురుదక్షిణను మోసుకొచ్చిన వాడి అర్ధనగ్న శరీరం నుండి వీచే చెమట వాసనా అంతకు తక్కువేమీ అనిపించలేదు నాకా క్షణంలో.

"మరి నీకు అంగీ ఎట్లారా చిన్నూ" "గీ ఎండాకాలం ఉడకపోస్తదని ఎట్లైనా నేను అంగీ ఏసుకోనుగురూజీ! మళ్ళ బడి షురువైనప్పుడు మా అవ్వ కొత్తది కొనిస్తన్నది, అంగీ కోసం ఫికరు సెప్పక గురూజీ!" నా మౌనం చూసి మళ్ళీ అన్నాడు "మీరు గిట్లగిది తీసుకోపోతే నేను మళ్ళ బడికేరాను గురూజీ!"

"లేదురా చిన్నూ! తప్పకుండా తీసుకుంటాను. ఇలాతే."

ఆ మసక సంధ్యవేళ, అమూల్యమైన ఆ గురుదక్షిణ స్వీకరిస్తున్నప్పుడు నాలో కలిగిన అనుభూతి, ఒక టీచర్‌గా నేను ఈ భూప్రపంచంలోని ఏ అత్యున్నతమైన అవార్డును స్వీకరిస్తునప్పుడు కూడా కలుగదేమో.

ఇంత విలువైన గురుదక్షణ ప్రపంచంలో ఏ గురువుకీ, ఏ శిష్యుడూ ఎప్పుడూ ఇచ్చి ఉండలేదన్న ఆలోచన, చిన్నూ అమాయకమైన లేతబుగ్గల్ని నాతో ముద్దాడించింది. అప్పుడు వాడి కళ్ళల్లో కన్పించిన మెరుపు ఆ మసకచీకటిని దూరం చేసింది.

వేసవి సెలవుల తర్వాత వెంటనే ఆ కుగ్రామం నుండి ట్రాన్స్‌పర్ చేయించుకోవాలనుకున్న నా ఆలోచనని ఆ క్షణంలో సమాధి చేసి చిన్నూ వద్ద వీడ్కోలు తీసుకొని బయలుదేరా.

కానీ, చిన్నూని అదే ఆఖరుసారి చూస్తాననుకోలేదు. సెలవుల మధ్యన వాడి ఊరి నుంచి వచ్చిన వార్త నన్ను చలింపజేసింది. నేను వచ్చిన మర్నాటి నుంచి టైఫాయిడ్ జర్వంతో బాధపడ్తూ, రోజు 'గురూజీ, గురూజీ' అని కలువరిస్తూనే ఈ లోకం విడిచి వెళ్ళిపోయాడని, నిస్సహాయురాలైన చిన్నూ విధవతల్లి పిచ్చిదైపోయిందని తెలిసింది.

ఆ 'అడవి పూవు' సువాసన మాత్రం నన్ను నా జీవితకాలం అంటిపెట్టుకునే ఉంది.

⁂ ⁂ ⁂

# జటిన్

**- శ్రీ జయ చార్**

**కొం**త మారాం చేసినా తొలిసారిగా జీవితంలో స్కూల్‌కి వెళ్ళడానికి తరుణ్ అంగీకరించడంతో అనిత మనస్సు కుదుటబడింది.

ముందు మారాం చేసినా తీరా కారు ఎక్కాక హుషారుగా కనపడ్డాడు తరుణ్.

కారెక్కి తండ్రి ప్రక్కన కూర్చున్నాడు. స్కూల్లో తినడానికి తల్లి ఇచ్చిన టీ, బిస్కట్ల పాకెట్ ఉన్న బ్యాగు పక్కనే పెట్టుకొంటూ, కారు కదులుతుండగా మిలమిల మెరిసే కళ్ళతో తల్లివైపుకు గాలిలో చెయ్యి ఊపాడు – టాటా చెబుతున్నట్లు. కొడుకు అలా ముద్దులు కురిపించేలా గాలిలో ఊపుతూ, చిన్ని చిన్ని కళ్ళతో చూస్తుంటే, గబుక్కున పరిగెత్తి వాడిని కారులోంచి వెనక్కి తీసుకొచ్చేద్దామనుకొంది అనిత సంతోషం పట్టలేక.

వాస్తవానికి తను కూడా వాడితో ముందు స్కూలుకు వెళ్దామనుకొంది. మరీ మొదటిరోజుగదా! తను అలా వాడిపై ప్రేమతో వెళ్తే వాడు స్కూల్లో ఉండటానికే పేచీ పెట్టాడేమో అని భయపడింది. ఈ విషయమై టీచర్ కూడా అనితతో ఏకీభవించటంతో అనిత ఆ ప్రయత్నం మానుకొంది.

మధ్యాహ్నంలోపుగా అనిత ఎన్నిసార్లు గడియారం చూసుకొందో. మధ్యాహ్నం దాటినప్పటి నుంచి ఆవిడ మనస్సు అవిశ్రాంతంగా మారింది.

పక్కింటి వారమ్మాయితో తరుణ్ తిరిగి రావలసి ఉంది. ప్రక్క రోడ్డుమీద కారు ఆగినప్పుడల్లా అనిత కిటికీ వైపుకు చటుక్కున పరుగెత్తి తొంగి తొంగి చూస్తోంది.

చిట్టచివరకు తాను పదేపదే అనుకొంటున్న తరుణ్ రానేరావటంతో అనిత ఉబ్బితబ్బిబ్బు అయిపోయింది.

తలుపుతీసి తరుణ్‌ను ఎత్తుకొని ముద్దుల వర్షం కురిపించింది అనిత. తరుణ్ చేతులు, కాళ్ళు కడుక్కొని అన్నం తినటానికి టేబుల్ దగ్గరికి వచ్చి కూర్చున్నాడు. తరుణ్ భోజనం బల్లదగ్గర చాలా అసహనంగా ప్రవర్తిస్తున్నాడు. అంతా అటూ, ఇటూ కిందా పైన పోసి నానా హడావుడి చేశాడు.

“స్కూల్ ఎలా ఉంది తరుణ్”? అడిగింది అనిత పిల్లవాడిని.

“ఒకే... ఏం అలా అడుగుతున్నావు?” అడిగాడు తరుణ్ అమాయకంగా.

“నచ్చిందా?” అడిగింది అనిత మళ్ళీ

“నచ్చిందనే అనుకొంటాను” అన్నాడు తరుణ్ బుంగమూతి పెట్టి.

“రేపు మళ్ళీ నీకు వెళ్ళాలని ఉందా? లేదా?” అడిగింది తరుణ్ మనస్సు కనుక్కుందామని.

“ఏం? ఎందుకు వెళ్ళను...” అన్నాడు తరుణ్.

“పోన్లే ఈ రోజు నుంచి స్కూల్ జీవితం ప్రారంభించినా స్కూల్ వాతావరణం వాణ్ణి ఆకర్షిస్తే అదే పది వేలు” పదేపదే మనస్సులో అనుకొంది అనిత.

ఈ సారి సమాధానంతో అనిత మనస్సు తృప్తిపడింది. హమ్మయ్య ఇక ఫర్వాలేదు. మళ్ళీ స్కూల్‌కువెళ్ళే ఉద్దేశ్యంతో ఉన్నాడంటే వాడికి నిజంగానే స్కూల్ నచ్చిందన్నమాట. ఒక్కసారి నిట్టూర్పు విడిచింది హాయిగా.

ఆనాటి సాయంత్రం టీవీ చూస్తూ తరుణ్, తరుణ్ డాడీ భాస్కర్, వాడి మమ్మీ అనితలు కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయసాగారు.

భాస్కర్ కాసేపు ఆకబుర్లు, ఈ కబుర్లు విని “తరుణ్... నువ్వు స్కూల్లో ఈ రోజు ఏం చదువుకొన్నావు?” అని అడిగాడు తరుణ్ వైపు తిరిగి నిదానంగా.

“ ఏంలేదు?” అన్నాడు తరుణ్ తండ్రివైపు తలతిప్పకుండా.

“ ఏంలేదా?” అడిగాడు భాస్కర్ ఆశ్చర్యంగా.

"మేం స్కూల్లో ఎలా నడుచుకోవాలో చెప్పారు... అంతే" అన్నాడు తరుణ్.

"సో... అదైనా చదువుకిందేవస్తుంది కదా?" అడిగాడు భాస్కర్ తరుణ్ని.

"అదేమోగాని ఒకబ్బాయిని ఈరోజు టీచర్ బాగా అరిచి కేకలు వేసింది. అతను చాలా తప్పుపని చేశాడు. పక్కనే ఉన్న ఒక చిన్నమ్మాయిని గిల్లాడు. ఆ అమ్మాయి కుయ్యో అని ఏడుపులంఘించుకొంది. మరో అబ్బాయి బల్లపై నీళ్ళు పోశాడు. అందువల్ల ఆ అబ్బాయికి టీచర్ పనిష్మెంట్ ఇచ్చింది" చెప్పాడు తరుణ్.

"ఎవర్రా అబ్బాయి?" అడిగాడు భాస్కర్ ప్రేమగా.

"పేరా... పేరు..." ఒక్కక్షణం ఆలోచించినట్లు ఆలోచించి "జటిన్... జటిన్... డాడీ. ఆ... అవును జటినే" అని సమాధానం చెప్పాడు.

"ఆ అబ్బాయి మరీ అంత చెడ్డవాడా ఏంటీ?"

"అవును... టీచరైతే చాలా చెడ్డబ్బాయనే అనుకొంది. అతన్ని ఒకవైపున కార్నర్లో నుంచోపెట్టింది కూడా."

అనిత తరుణ్ని త్వరగా పడుకోబెట్టేసింది. మళ్ళీ పొద్దున్నే స్కూల్కు పోవాలంటే తరుణ్ లేవటానికి మారాం చేసే అవకాశం ఉండకుండా.

రెండోరోజు కూడా తరుణ్ విజయవంతంగా స్కూలుకు వెళ్ళివచ్చాడు. వస్తూనే మామూలుగా కాక సంతోషంగా పరుగులు తీస్తూ వచ్చాడు.

"అమ్మా... జటిన్ చాలా అల్లరిపిల్లాడు. ఇవాళ టీచర్ని కూడా కొట్టాడు" అని వస్తూనే జటిన్పై పితూరీలు చెప్పాడు.

"ఓరినాయినో... వాడెవడ్రా... టీచరుకు కోపం రాలేదూ. ఛీ... అవేం చేష్టలు" అంది అనిత.

"అవునమ్మా ఆవిడకు చాలా కోపం వచ్చింది. మళ్ళీ వాణ్ణి శిక్షించింది" చెప్పాడు తరుణ్.

"అసలు టీచర్ని ఎందుకు కొట్టాడు?"

"తను చెప్పిందానిని తిరిగి నోటితో పలకమని చెప్పింది టీచరు. కానీ వాడు ఎంతకీ చెప్పడే. ఆవిడ రెండు, మూడుసార్లు చెప్పినా వాడు తిరిగి చెప్పలేదు. అందువల్ల

ఆమె వాణ్ణి అల్లరివెధవా అని అరిచింది. వాడు ఆమెను కొట్టేశాడు” చెప్పాడు తరుణ అంతా వివరంగా.

“మంచిపని చేసింది. నీకూ అలా అని పించిందా...” అడిగింది తరుణ్‌ని, తన మాటకు ఒత్తాసు పలుకమన్నట్లుగా.

“అంతేలే...” అన్నాడు తరుణ్ నెమ్మదిగా.

“వాడికేం శిక్షవేసింది టీచర్” అడిగింది అనిత.

“పిల్లలెవ్వరినీ వాడితో మాట్లడవద్దని చెప్పింది. కాని టీచర్ చూడకుండా అందరూ వాడితో కలిసి మెలిసే ఆడారు” చెప్పాడు తరుణ్.

“అదంతాసరే ఇకదాని సంగతి మర్చిపోదాం. ఇంతకీ ఈ రోజు నువ్వేంనేర్చుకువచ్చావు?”

“అమ్మా! నిద్దరొస్తోంది. ఈ పూట పడుకోనా?” అడిగాడు తరుణ్ తల్లి అడిగిన ప్రశ్నకు సమాధానంగా.

మూడో రోజుకూడా జటిన్ కబుర్లే చెప్పాడు తరుణ్

ఒకమ్మాయిని జటిన్ బాగా కొట్టాడు. ఊయ్యాల ఊగుతున్న మరో అమ్మాయిని పై నుంచి కిందికితోశాడు. ఫలితంగా టీచర్ వాణ్ణి ఇంటర్వెల్లో కూడా విడవకుండా క్లాస్ రూంలోనే కూర్చోపెట్టింది.

మరుసటి రోజు కూడా జటిన్‌ను క్లాసు బయట నిల్చోబెట్టింది. తన బల్లని తోసెయ్యడమేగాక, వాడి ఆటవస్తువులను క్లాసంతా విసిరేయటంతో టీచర్ జటిన్‌కు ఆ శిక్ష విధించింది.

ఆ మర్నాడు మరీ దరిద్రంగా ప్రవర్తించాడు జటిన్. జటిన్ ఒక బంతిని టీచర్ రాసే బ్లాక్ బోర్డుపైకి విసిరేశాడు. టీచర్ వాడి వీపు మీద ఓ దెబ్బవేసింది.

ఈ విధంగా రోజూ జటిన్ గురించి తరుణ్ చెప్పడంవిని అనిత బాగా కంగారు పడిపోయింది.

శనివారంనాడు భర్తతో “పిల్లవాడికి ఈ స్కూల్లో చదువు బాగాసాగుతుందని నమ్మకం నాకులేదు. ఆ జటిన్‌లాంటి పిల్లలుచేసే గొడవ. ఎంతైనా న్యూసెన్స్? ఏమంటారు” అని అంది అనిత ఆదుర్దాతో.

"మరేం ఫర్వాలేదు. ఈ సమస్యల వల్ల తరుణ్‌కేం నష్టం కలగదు. సంఘం, స్కూలు అన్న తర్వాత ఇవన్నీ ఉంటాయి. ఇలాంటి వారితో వాడికి చిన్నప్పుడే అనుభవం కలగటం వాడి మంచికేలే' అన్నాడు భాస్కర్.

సోమవారం తరుణ్ ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. వస్తూనే జటిన్ కబుర్లను ఓ బస్తాడు మోసుకొచ్చాడు.

"జటిన్ ఇవ్వాళ మళ్ళీ గొడవ. రోజల్లా టీచర్ పక్కనే కూర్చోవలసి వచ్చింది. ఆటకు కూడా పోనీయలేదు టీచర్"

"పోన్లే! ఆ జటిన్ తలనెప్పి మనకెందుకు? నువ్వేం చదువు కొన్నావు స్కూల్లో"

"1, 2, 3, 4,...5...6..." చెప్పాడు తరుణ్.

"సరే... రా... భోంచేంద్దువుగాని" అంది అనిత.

సాయంత్రం తరుణ్ జటిన్ గురించి తండ్రికి బోలెడన్ని చెప్దామనుకున్నాడు. నీళ్ళు తాగుతున్న అమ్మాయి నోటికేసి గ్లాసు ఎలా గుద్దాడు?... ఎలా పిల్లల పెన్సిల్స్ లాగేసుకున్నాడు? ఎలా టీచర్ కుర్చీ కింది చాక్‌పీసుల్ని చోరీ చేశాడు...? ఇవన్నీ తండ్రికి చెప్పాలని తరుణ్ తహతహ...

" అసలీ జటిన్ ఎలా ఉంటాడు తరుణ్?" అడిగాడు తండ్రి భాస్కర్.

"నాకంటే పొడుగ్గా, లావుగా ఉంటాడు. డాడీ... నాకంటే ఎక్కువ బలం కూడా అతనో పెద్ద రౌడీలాగుంటాడు..."

తరుణ్ స్కూలుకు వెళ్ళటం ప్రారంభించి రెండవవారం మొదలైంది. ప్రతి మంగళవారం పిల్లల తల్లిదండ్రులతో టీచర్ల చర్చలు జరుగుతాయి ఆ స్కూల్లో

ఆ రోజు జరిగే మీటింగ్‌కు స్కూల్‌కు వెళ్దామనుకొంది అనిత. తరుణ్ టీచర్ని కలిసి, జటిన్ గురించి అడగాలనుకొంది వీలైతే జటిన్ తల్లిని కూడా కలవాలనుకుంది. అసలీ పిల్లవాడు ఇంటి దగ్గర కీచకుడై ఉంటాడనుకుంది. కాని జ్వరం రావటంతో స్కూలుకు వెళ్ళే ఉద్దేశ్యం విరమించుకుంది. పోన్లే... వచ్చేవారం వెళ్దాం అని భావించి ఊరుకుంది.

తరుణ్ స్కూల్‌కు వెళ్ళి రావటం మొదలై మూడోవారం ప్రవేశించింది. ఇప్పుడు తరుణ్ ఇంట్లో జటిన్ పేరు రామనామంలా మారింది. జటిన్ చేసే గొడవ గురించి తల్లి

స్నేహితులకు, తన అమ్మమ్మ, బామ్మలకు అందరికీ ప్రచారం చేసేశాడు తరుణ్. జటిన్ గురించి తరుణ్ చెప్పటం ఏ స్థాయికి వెళ్ళిందంటే జటిన్‌ను తరుణ్ విపరీతంగా అభిమానిస్తున్నా డేమోనని పదిమంది భావించే స్థాయికి ఎదిగిపోయింది. చివరికి ఇంట్లో భాస్కర్, అనిత, తరుణ్‌లు ఎవరైనా సరే పొరపాటుచేస్తే ఏమే... జటిన్ లాగా చేయకండి" అని తమాషాగా హెచ్చరించుకునే స్థాయికి వెళ్ళిపోయింది.

నాల్గవ వారంలో జటిన్ హఠాత్తుగా మారిపోయిన వార్తని తెచ్చాడు తరుణ్.

"ఇవాళ, నిన్న జటిన్‌లో మార్పు వచ్చింది. చాలా మృదువుగా మంచిగా ఉంటున్నాడు" చెప్పాడు తరుణ్.

అయిదవవారం మరీ మంచిగా ఉన్నాడు "ఇప్పుడు జటిన్ క్లాసు లీడర్ కూడా" చెప్పాడు తరుణ్.

"క్రమంగా అయిదవవారం అంతా మంచిగా ఉండటంతో జటిన్ టీచరుకు అబిమాన స్టూడెంటూ అయ్యాడు. పిల్లలంతా అతనంటే చాలా ఇష్టపడుతున్నారు. టీచరైతే జటిన్‌కు ఏపిల్ పండు కూడా బహుమతిగా ఇచ్చింది. జటిన్ బ్లాక్‌బోర్డు తుడుస్తున్నాడు. కిందపడ్డ చెత్తకాగితాలు ఏరి బయటపడేస్తున్నాడు. పిల్లలను వరుసలో నిలబెట్టటంలో జటిన్ ఎంతో సహాయం చేస్తున్నాడు. అతనికి ఎంతో మంచి పేరు రావటంతో స్కూలు వారు అతనికి ఒక బంగారు రంగునక్షత్రాన్ని కానుకగా ఇచ్చి అతని పేరును స్కూలు నోటీస్ బోర్డులో వేశారు" ఇలా వారం వారం జటిన్ గురించి తరుణ్ తల్లికి రిపోర్టు ఇస్తున్నాడు.

"రేపు వచ్చేవారం టీచర్ల తల్లిదండ్రుల మీటింగ్. నేను వెళ్ళి జటిన్ తల్లిని కలుస్తాను" అంది తరుణ్ తల్లి అనిత భాస్కర్‌తో.

"అసలు జటిన్ అంత త్వరగా ఎలా మారాడో కనుక్కో! నాకు నిజంగా తెలుసుకోవాలని ఉంది" అన్నాడు భాస్కర్.

"ఆ వారంలో జటిన్ హఠాత్తుగా మళ్ళీ చాలా చెడ్డవాడిలా ప్రవర్తించాడని తరుణ్ చెప్పాడు.

"ఏమైంది?" అడిగింది అనిత.

"ఒకమ్మాయిని అనకూడని బూతుతిట్టాడు" చెప్పాడు తరుణ్.

"అయితే టీచర్ ఏం చెయలేదా?"

"క్లాసు అయిపోయే వరకూ వాడినోటికి ప్లాస్టర్ అంటించింది" చెప్పాడు అరుణ్.

"ప్లాస్టర్ క్లాసు అయిపోయేముందు తీసేసింది టీచర్... కాని వాడు గేటుదాటిపోతే మళ్ళీ ఆ అమ్మాయిని అదే తిట్టుతిట్టాడు. ఎవ్వరూ వినలేదు" తరుణ్ అదోలా నవ్వుతూ చెప్పాడు అనితతో.

"అయితే ఆ తిట్టేదో నువ్వు విన్నావన్న మాట" అడిగింది అనిత.

"అవును నేనొక్కణ్ణే విన్నాను" అని పరిగెత్తుకుంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

భాస్కర్ వచ్చే సమయానికి అనిత స్కూల్లో మీటింగ్‌కు బయల్దేరుతోంది.

"వీలైతే జటిన్ తల్లిని మనింటికి ఒక కప్పు టీ కి ఎందుకు పిలవకూడదు?" అన్నాడు భాస్కర్.

"ఆవిడుంటే తప్పకపిలుస్తాను" అంది అనిత.

"ఆవిడ రాకుండా అసలు మీటింగ్ జరిగే అవకాశమేలేదు" అన్నాడు. భాస్కర్. చిరునవ్వు నవ్వుతూ.

మీటింగ్ జరుగుతున్నంతసేపు అనిత ఆదుర్దాగానే ఉంది ఆవిడ కళ్ళు జటిన్ తల్లి కోసం తీవ్రంగా గాలిస్తున్నాయి. ఒక తల్లిలేచి తన బిడ్డ ప్రవర్తనకు క్షమాపణ చెప్పుకొంది. కాని ఆవిడ జటిన్ తల్లి మాత్రం కాదని అనితకు స్పష్టంగా తెలుసు. చివరికి మీటింగ్ అయిపోయింది. జటిన్ తల్లి మాత్రం ఎవరో అనిత కనుక్కోలేకపోయింది.

తరుణ్ క్లాస్ టీచర్ వద్దకు వెళ్ళి "నేను తరుణ్ తల్లిని" అని పరిచయం చేసుకుంది అనిత.

"మీరా? మీ కోసమే మేం ఎదురు చూస్తున్నాం. మీ అబ్బాయి తరుణ్‌తో చచ్చిపోయాం మొదటి రెండు వారాలు. ఇప్పుడు కాస్త మెరుగులెండి. ఇప్పుడు తరుణ్ క్లాస్ మానిటర్‌తెల్సా!" చెప్పింది క్లాస్ టీచర్.

"అవును... జటిన్ తల్లి రాలేదా మీటింగ్‌కు?" అడిగింది అనిత ఆదుర్దాగా. జటిన్! జటినెవరు? అసలు జటిన్ పేరుగల అబ్బాయే ఈ క్లాసులో లేదు" అంది టీచర్ తెల్లమొహంవేస్తూ.

ఈసారి తెల్లమొహం వేయటం అనిత వంతయింది. పొరలువీడి అసలు నిజం తెల్సినట్లనిపించింది అనితకు.

⁂ ⁂ ⁂

# లేగదూడ- చదువు

**- సత్యం శంకరమంచి**

**తె**లతెలవారుతుండగా ఇళ్ళల్లో చల్లచిలికేవేళ, తల్లులు పిల్లల్ని 'లేవండ్రా' అంటుంటే వాళ్ళు దుప్పట్లు ఇంకా బిగదీసుకు పడుకుంటున్నారు. 'మా బాబు కదూ! మా తల్లి కదూ! అంటూ తల్లుల చేత మేలుకొలుపు పాడించుకుని చెంగున మంచాల మీంచి గెంతి దొడ్లలోకి పరుగెత్తుతున్నారు. ఇంత కచ్చికతో పళ్ళు తోముకుని తాటాకుతో నాలిగ్గీసుకొని మొహం మీద చెంబెడు నీళ్ళు కొట్టుకుని తుడుచుకోకుండానే చద్దన్నాలకి వంటింట్లోకి చేరుతున్నారు.

నాలుగేళ్ళు నిండని చిట్టి దొడ్లో పాలుతాగి చెంగనాలు పెడ్తున్న లేగదూడతో ఆడుకుంటోంది. దాంతోపాటే పరుగులు తీస్తూ దాని చేత వొళ్ళు నాకించుకుంటూ కిలకిలా నవ్వుతోంది. " ఒసే చిట్టీ: అన్నంతినవా! బడికెళ్ళవా?" అని తల్లి కేకేస్తే "అన్నం వొద్దు... బడికెళ్తా అంటూ పరుగెత్తుకొచ్చింది చిట్టి. చిట్టినింకా బళ్ళో వెయ్యలేదు. అయినా అన్నయ్య సోముతోను, అక్క బాలతోను రోజూ బడికెళ్తుంది. 'చద్దన్నం తింటే కడుపు చల్లబడుద్ది. కూర్చో' అంటూ చిట్టిని కూర్చోబెట్టింది తల్లి, బాల అప్పటికే అన్నం ముగించి పుస్తకాలు సర్దుకుంటోంది. సోముకు చదువుకంటే తిండి ధ్యాసే ఎక్కువ. అన్నం ముందు నుంచి ఎంతసేపటికీ లేవటంలేదు. బాల విసుక్కుంటూ 'తింటూ కూర్చో, ఒక్కోక్లాసు రెండేళ్ళు చదువుదుగాని' అంది సోము కిందటేడు తప్పాడు.

గడ్డ పెరుగు రెండోసారి కలుపుతూ సోము అన్నాడు. "అక్కా! కడుపు నిండా తింటే గాని చదువు వొంటబట్టదన్నారే పంతులుగారు, అయినా ఆడదానికి నీకెందుకే చదువు" ఆడపిల్లకి చదువక్కర్లేదు సరే, తనకి చదువెందుకొద్దో చెప్పలేదు సోము.

'బండ వెధవ' తిట్టింది బాల,

పక్కింట్లో గోపి, వెన్నముద్ద వేస్తేనేగాని తిననని మారాం చేస్తున్నాడు. అవతలింటి రాము ఆవకాయ ముక్కకోసం అల్లరి చేస్తున్నాడు. ఆపై ఇంట్లో వెంకు వాళ్ళమ్మ చూడకుండా నేతిగిన్నె సాంతం కంచంలో బోర్లించుకుంటున్నాడు. ఆ చివరింట్లో పిల్ల పెరుగొద్దు నాకు పులిమజ్జిగే కావాలని పట్టుబడ్తోంది. ఇలా అందరిళ్ళలో చద్దన్నాల రంగం ముగిశాక చక్రకడ్డీలు, జీళ్ళు కొనుక్కోటానికి తల్లుల దగ్గర డబ్బులు తీసుకొని వీధిలో కొచ్చారు. " ఒరే వెంకూ, సీతా, రమా, పొట్టీ!" అంటూ ఇంటింటికీ వెళ్ళి నేస్తాల్ని పిలుచుకొని పాతికమందికి పైగా పిల్లలు బడికి బయలుదేరారు. జారిపోతున్న బొందు లాగూలు పైకి లాక్కుంటూ పుస్తకాల సంచులు ఒక భుజం మీంచి ఒక భుజం మీదికి మార్చుకొంటూ ముందుకు నడుస్తున్నారు.

సోము 'అక్కరకు రాని చుట్టము... అక్కరకు...' పద్యం మననం చేసుకొంటున్నాడు. పద్యం అప్పచెప్పకపోతే పంతులు గోడకుర్చీ వేయిస్తాడు. "అక్కరకు రాని... ...." గింజుకుంటున్నాడు. "ఒరేయ్ కిట్టి అక్కరకురాని చుట్టము... తర్వాత చెప్పురా" అని బతిమిలాడాడు. కిట్టిగాడు "అమ్మ ఆశ! నిన్న జీళ్ళు కొనుక్కొని నాకు పెట్టావేం! నేనేం చెప్పను" అన్నాడు.

" ఇవ్వాళ పెడ్తాగా" అన్నాడు సోము.

" ఒట్టు."

" ఒట్టు" చేతిలో చెయ్యివేసి గిచ్చాడు సోము.

వీధి చివర సాలె రంగమ్మ నూలు ఆరేస్తున్నది. ఈ పిల్ల మూక రావటం చూసి కర్ర

ఝళిపిస్తూ ' ఒహోయ్' అంటూ వచ్చింది. పిల్లలకి ఆ నూలు తాకుతూ పోవటం ఓ సరదా. రంగమ్మ ' ఒహోయ్' అనగానే పిల్లలంతా 'ఒహోయ్' అని అరుస్తూ ముందుకు పరుగెత్తారు. ఆ పరుగెత్తుతున్న పిల్లల వెనక చిట్టి. చిట్టిని బళ్ళో వెయ్యకపోయినా ఆ సంచి మాత్రం మహా బరువు. అందులో వాళ్ళన్నయ్య చదివేసిన పుస్తకాలు, విరిగిన పలకలు, బెచ్చాలు, లక్కపిడతలు, సుద్దముక్కలు, అచ్చనగాయలు, చిన్న బొట్టుపెట్టె, అందులో కొయ్య బొమ్మలు, వాటి చీరలు అన్నీ ఉన్నాయి. ఆ సంచీ బరువు మోయలేక ఒక పక్కకు వాలిపోయి మాటి మాటికీ భుజం మార్చుకొంటూ ఆయాసంగా పరుగిడుతోంది అందరి తోటి.

గుడి మొదటి ప్రాకారం గేటు దగ్గర పిల్లలంతా ఆగారు. ఆ గేటు తలుపు ద్వారంలో గుర్రపుస్వారి ఆట, కొందరు కూర్చోటం, మిగతా వాళ్ళు గేటుని అటూ ఇటూ తిప్పటం, ఆ ఆట కొంతసేపు ఆడి గాలి గోపురం దగ్గరకొచ్చారు. మంటపంలో గంగన్నతాతతో "బడికెళ్తున్నాం తాతా" అని చెప్తుంటే 'మా నాయనే' మా తండ్రే' అంటూ అందరికీ విభూతి పెడ్తున్నాడు. అందరి కంటే ఆఖర్న చిట్టి 'నేనూ బడికెల్తన్నా' అంటూ గంగన్న తాత దగ్గర కొచ్చింది. 'మా తల్లే' అంటూ తాత చిట్టిని దగ్గరికి తీసుకొని ముద్దు పెట్టుకొన్నాడు. వెండి తీగల్లాంటి గంగన్న మీసం పాల బుగ్గల చిట్టికి గిలిగింతలు పెట్టగా విడిపించుకొని పరుగు పరుగున వెళ్ళి మిగతావాళ్ళని కలిసింది.

బళ్ళో సిరి చుక్క పెట్టించుకొని ఎవరి క్లాసుల్లో వాళ్ళు కూర్చున్నారు. పంతులు చూడకుండా ఇంటి నుంచి తెచ్చుకున్న మరమరాలు పాఠం మధ్య నములుతున్నారు.

పది గంటలయింది. పశువులు నీళ్ళకి లంకలకి మేత కెడుతున్నాయి. పెద్ద బజారు వీధి నిండా పశువులు. చిట్టి బజారు వైపే చూస్తోంది. మళ్ళీ మళ్ళీ చూస్తోంది. ఆ! వచ్చేసింది లేగదూడ! లేగదూడ సరాసరి వచ్చి బడి ముందు నుంచుంది. పాలేరు అదిలించినా ముందుకు సాగదు. లేగదూడని చూడగానే చిట్టి చేతనున్న పలకతో బయటికి పరుగెత్తు కొచ్చింది.

లేగదూడ చిట్టి చేతులూ, వొళ్ళూ నాకుతుంటే చిట్టి తన పలక మీద పిచ్చి రాతలు చూపిస్తూ లేగదూడకి చెప్తోంది. " ఇది అ... ఆ... ఇవి వొంట్లు... ఒకటి... రెండు... ఇది నీ

బొమ్మ... అది నా బొమ్మ. ఇది అమ్మ బొమ్మ... ...సాయంత్రం తొరగా రా ఏం!” అంటూ చిట్టి ఏదో చెప్తుంటే లేగదూడ చూసి సర్‌సర్ మని చిట్టిని ఇటు పక్కా అటు పక్కా నాకేసి చెంగున తల్లిని కలుసు కోటానికి పరుగు పెట్టింది.

బళ్ళో వెయ్యని పసిపాపకంటే, నోరులేని లేగదూడకంటే చాలా చదువుకొన్నాం మనం, కాని...

* * *

# అవార్డు

## టి.యమ్.సుబ్బరాయ

"బెస్ట్ టీచర్ అవార్డు కోసం ఒక టీచర్ పేరును సూచించమని డిపార్ట్‌మెంట్ అడిగింది. మీ పేరును సిఫారసు చేయాలనుకున్నాను. ఇదిగో... తీసుకోండి ఈ ఫారం... పూర్తిచేసి ఇవ్వండి' అంటూ హెడ్‌మిస్ట్రెస్ ఫారాన్ని టీచర్ రంగనాథం ముందు వుంచింది.

ఫారం తీసుకునేందుకు రంగనాథం తటపటాయించాడు. "తీసుకోండి సార్... భర్తీచేసి ఇవ్వండి."

"మా వంటి వారికి ఆ అవార్డు దొరికేనా మేడం... అది దొరకాలంటే ఎవరెవరినో సంప్రదించాలి. పెద్దవారి పరపతి సంపాదించాలి. అవన్నీ నా చేతకాని పనులు, కనపడినవారందరికీ చేతులెత్తి మొక్కి అవార్డు పొందేందుకు నా మనసు అంగీకరించదు" అన్నాడు టీచర్ రంగనాథం.

"మీరు ఎవరినీ సంప్రదించే అవసరంలేదు. ఎవరి పరపతీ సంపాదించక్కర లేదు. మన స్కూల్ తరపున ఒకరి పేరు సూచించమని డిపార్ట్‌మెంట్ అడిగింది. మీ పేరును సూచిస్తున్నాను. వాళ్ళు అడిగారు కాబట్టి, తప్పని సరిగా పంపాలి. అంతే. మీరు ఫారం పూర్తిచేసి ఇవ్వండి. తక్కిన సంగతులు నాకు వదలండి"

"ఎందుకో అవార్డు అంటే నాకు గిల్టీ" విసుక్కున్నాడు.

"అవార్డు పొందేందుకు నానాగడ్డీ తింటే సిగ్గుచేటు. కాని ఇది అలాకాదు. డిపార్ట్‌మెంట్ అడిగింది. పేరు పంపమన్నారు పంపడం మనపని"

"అయినా..." రాగం తీశాడు రంగనాథం.

"అయినా... లేదు. పోయినా లేదు. మీరై అవార్డును ఆశించటం లేదుకదా! అదే తమను వెతుక్కుంటూ వచ్చింది. ఎన్నోసార్లు తమరనేవారు కదా. కీర్తిని మనం వెంబడించరాదు. అదే మన వెంటపడితే దూరం నెట్టరాదు అని. తీసుకోండి. కీర్తి తమ దగ్గరకొచ్చే తరుణమిది. వద్దని దూరం నెట్టకండి. దీన్ని భర్తీచేసి ఇవ్వండి."

తీసుకోక తప్పలేదు రంగనాథానికి.

"అవార్డ్ అట. అవార్డు... మనబోటివారికి అది దొరికేనా? దాన్ని అందుకోవాలంటే ఎవరెవరిదో సిఫార్సు సంపాదించాలి. వేలకొద్దీ ఖర్చుచేయాలి. రాజకీయనాయకుల కాళ్ళుపట్టుకోవాలి. అదంతా మాలాంటి వారితో కాని పని. అంతచేసి అవార్డు తీసుకోకపోతే ఏం? కొంపలు మునిగిపోతాయా వేరే పనీ పాటా లేదా..."

హెడ్‌మిస్ట్రెస్ ఎందుకు పిలిచిందబ్బా అని ఎదురు చూస్తూ కూర్చొన్న ఉపాధ్యాయ బృందానికిది జవాబు అన్నట్టు గొణుక్కుంటూ స్టాఫ్‌రూం చేరాడు. రంగనాథం. తన కుర్చీలో కూలబడుతూ ఆమె ఇచ్చిన ఫారాన్ని ఎదురుగా ఉన్న టేబుల్ మీదకి విసిరాడు. స్టాఫ్ మెంబర్స్‌కు సంగతేమిటో తెల్సింది. కాని ఆ విషయం గురించి చర్చించేందుకు సిద్ధపడలేదు. ఎలా మాట్లాడి నా ఎటు మాట్లాడినా అపార్థానికి దారితీయొచ్చు. అందుకే ఎవరూ పెదవి విప్పలేదు.

రంగనాథం టేబుల్ మీద విసిరిన ఫారాన్ని టీచర్ శివరాము లాక్కొన్నాడు. మడతలు విప్పి అందులోని కాలమ్స్ చూడసాగాడు.

"అవార్డు కోసం మీ స్కూల్ తరపున ఒకరి పేరు సూచించమని జి.ఒ. వచ్చిందట. హెడ్‌మిస్ట్రెస్ నా పేరు సూచిస్తుందట. వీరు సూచిస్తే వారు నాకు అవార్డు ఇచ్చేస్తారా?" తనలో గొణుక్కొన్నాడు రంగనాథం. "ఇస్తారని కాదు పేరు సూచిస్తే అర్హులైనవారి పేరునే సూచించాలి. హెచ్.ఎం.సరియైన వ్యక్తినే ఎంచుకొన్నారు. అవార్డు వస్తే యోగ్యులైనవారికే రావాలి. తప్పేంలేదు" అన్నాడు మనోళి మాష్టారు.

"అర్హులకే అవార్డు వస్తుందనే గ్యారంటీ ఏముంది మనోళిగారు...?" వర్ణేకర్ మాష్టారు ప్రశ్నించాడు.

"ఈ మధ్యన ఈ అవార్డు కూడా తక్కిన అవార్డుల మాదిరిగా తన విలువ పోగొట్టుకుంది. నిజంగా అర్హతలున్నవారికది దొరకదు. అది దొరికినవారికి దానివల్ల ప్రత్యేకంగా ఏ విలువారాదు' మాట ముగించాడు.

"అలా చూస్తే... విలువలేనివారికే అది దక్కుతుంది. అంటారు.

"అంతేకదా... వెల ఇచ్చి కొంటారుకదా!"

"అందుకే నాకీ ఫారమ్ వద్దు. నేను ససేమిరా తీసుకోను అన్నాను. హెడ్‌మిస్ట్రెస్ ఒప్పుకోలేదు. బలవంతంగా ఇచ్చింది. భర్తీ చేసి ఇమ్మంది" అన్నాడు రంగనాథం.

"ఫారం భర్తీచేసి ఇస్తే నష్టమేముందిలెండి. భర్తీచేసివ్వండి. నాది కాదిది అనుకొని భర్తీచేయండి. ఇస్తే ఇవ్వనీ... ఇవ్వకపోతే పోనీ" సలహా ఇచ్చాడు జగదీష్.

"కొన్ని సర్టిఫికెట్లు జతచేయాలి. కొన్ని సిఫారసుపత్రాలు సైతం జత పర్చాలి" ఫారం చూస్తూ శివరాము మాష్టారు చెప్పాడు. "చూడండి సార్. ఎనిమిదవకాలంలో ఇలాగుంది., సేవ మరియు ఇతర యాక్టివిటీస్ గురించి ప్రమాణపత్రం"

"సేవకు సంబంధించి హెడ్‌మిస్ట్రెస్ సర్టిఫికెట్ ఇస్తుందికదా..."

"యాక్టివిటీస్ గురించి?"

"అయ్యా... పోండిసార్. అటువంటి సిఫారసు పత్రాలకేం కొదవ మన రంగనాథంగారికి. తమ గురించి ఇటువంటి పత్రాలు కావాలని కాకిచే కబురంపితే చాలు. మాజీ శిష్యులు పత్రాలు చేతబూని ఇంటికే తెచ్చి ఇస్తారు."

జగదీష్ మాష్టారు చెప్పినట్టే జరిగింది. దారిలో అగుపడితే చాలు, జీపు నిలబెట్టి యోగక్షేమాలు విచారించే రంగనాథంగారి మాజీ శిష్యుడు పురసభ అధ్యక్షులు నాగరాజుగౌడు ఆ రోజు మాష్టారు కంటికి కనపడిన వెంటనే జీపు ఆపాడు. సిఫారసు పత్రం కోసం ఈ మాజీశిష్యుని అడిగితే ఎలా అని మనసులో ఆలోచించి, "నీ దగ్గర కొంచెం పని ఉంది. పని అంటే అంత పెద్దపనేంకాదు. ఐదు నిముషాల పని నీ ఆఫీసుకు ఎప్పుడు రమ్మంటే అప్పుడు రాగలను. ఎన్ని గంటలకు రావాలి చెప్పు? అడిగాడు రంగనాథం మాష్టారు.

"ఏంపని?" చెప్పండి సార్"

'ఎంత వద్దన్నా మా హెచ్. ఎం. వినటంలేదు. అవార్డు కోసం నా పేరు పంపుతోంది. అందుకే'

ఆవులిస్తే ప్రేగులు లెక్కబెట్టే రకం మనిషి ఆ పురసభ అధ్యక్షుడు. "అవార్డు కోసం నా రికమండేషన్ లెటరు కావాలి. అంతేకదా. అందుకోసం తమరు నా ఆఫీసుకు రావాలా. మీరు రాకండి. సరాసరి ఇంటికి పోండి. సాయంత్రం లోగా నేనే తమ ఇంటికి తెచ్చి ఇస్తాను."

రంగనాథం ఇల్లు చేరిన అరగంటలోనే వారి మాజీశిష్యుడు ప్రస్తుత పురసభాధ్యక్షుడు నాగరాజు పంపిన లెటరు వచ్చింది.

"ఏం సార్ ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు కోసం తమ పేరు సూచిస్తున్నారట. మంచిపని చేశారు. ఆ అవార్డు తమలాంటి ఉపాధ్యాయునికి దొరకవలసిందే. ఎన్ని ఎన్ని సిఫారసు పత్రాలుంటే అంత మంచిది. నేను కూడా ఒక లెటరు పంపుతాను" అని అనేక సంఘ సంస్థల అధ్యక్షులు, పురప్రముఖులు సిఫారసు పత్రాలు రాసి పంపారు. ఎం.ఎల్.ఏ గారు స్కూలుకు ఫోన్‌చేసి.

"సార్! తమ శిష్యుణ్ణి మరచిపోయారా ఏమిటి" అని నిలదీసి అడిగి, "మీ వంటి వారికి అవార్డు వస్తే ఆ అవార్డుకు గౌరవం పెరుగుతుంది. తమకు అవార్డు రావలసిందే. చెప్పండి. నేను ఏ విధంగా తమకు సాయం చేయగలనో? మొహమాట పడకండి. మీ శిష్యుడయినందుకు మీ రుణం తీర్చుకునేందుకు అవకాశమివ్వండి" రాజకీయ ఉపన్యాసమిచ్చాడు. "నాకు తెలుసు' రికమెండేషన్ లెటర్లు ఎన్ని ఉంటే అంత మంచిది. ఇప్పుడే నా రికమెండేషన్ లెటరు పంపుతాను' చెప్పినట్టు చేశాడు. ఆ ఎం. ఎల్. ఏ

అనుకున్నదానికంటే ఎక్కువగానే లభించాయి. సిఫారసు కాగితాలు. ఫారం పూర్తిచేసి, తెచ్చిన అన్ని రికమండేషన్ లెటర్లు జతచేసి హెడ్‌మిస్ట్రెస్ చేతికిచ్చాడు రంగనాథం మాష్టారు.

తన నోట్ రాసి పై అధికారులకి పంపింది హెచ్.ఎం.

రోజులు గడిచాయి. వారాలు గడిచాయి. నెలలు కూడా గడిచాయి అవార్డు సంగతే లేదు.

రంగనాథం మాష్టారు అవార్డు గురించి అంతగా పట్టించుకోలేదు. స్టాఫ్‌రూంలో మాటల మధ్యన ఈ సంగతి ప్రస్తావనకు వచ్చింది. కాని దాని గురించి ఏ ఉపాధ్యాయుడూ చర్చకు దిగలేదు.

కొత్తగా కట్టించిన ఇంటిలో చేరబోతున్న మాష్టారి తోడల్లుడు గృహప్రవేశానికి రావాలని ఆహ్వానించాడు. బడికి నాలుగురోజులు సెలవుపెట్టి భార్యతోపాటు బెంగుళూర్‌కి బయలుదేరాడు రంగనాథం మాష్టారు.

"మీరెలాగూ ఇప్పుడు బెంగుళూరు పోతున్నారుకదా. ఇప్పటికే అవార్డుకు సంబంధించిన అన్ని కాగితాలు అక్కడికి చేరుంటాయి.

అర్జీఫారం ఎక్కడుంది? ఏమయింది? కొంచెం విచారించండి. ముందుకు పంపే ప్రయత్నం చేసిరండి" సెలవు మంజూరు చేస్తూ సలహా ఇచ్చింది. హెచ్.ఎం. తోటి ఉపాధ్యాయులు కూడా ఇదే సలహా ఇచ్చారు. తానటువంటి పనులను ఎన్నడూ చేయనని మనసులో అనుకొని, పైకి మాత్రం వారి సలహాను స్వీకరించినట్టు తల ఆడించాడు.

గృహప్రవేశం జరిగింది.

"రాకరాక వచ్చారు. నాల్గురోజులు ఉండండి" తోడల్లుడు అతని భార్య ఒత్తిడి చేశారు. రంగనాథం మాష్టారు నాలుగురోజులేమిటి. ఇంకో రెండురోజులు ఎక్కువగానే ఉండిపోయాడు.

పొద్దు పోదు. పనీపాటా ఏదీలేదు. అవార్డు సంగతి తోడల్లుడికి చెప్పాడు. "అలా అర్జీపెట్టి ఊరికే కూర్చుంటే ఏం ప్రయోజనం? అవార్డును ఫైనల్‌గా అప్రూవ్ చేసే ఆఫీసర్ నాకు తెలుసు. అతడు మీ పాత విద్యార్థే, పోదాం పదండి. ఒకసారి అతన్ని కలిసివద్దాం" అంటూ తోడల్లుడు రంగనాథంను కారు ఎక్కించాడు.

"రండి సార్ రండి మీ అవార్డుకు సంబంధించిన అన్ని కాగితాలు వచ్చాయి. మీరు మాత్రం రాకపోయారు. ఇప్పుడు వచ్చారు. ఇక అవార్డు లిస్ట్ ఫైనల్ చేద్దాం" అన్నాడు ఆ పాత విద్యార్థి.

అవార్డు లిస్ట్ విడుదలయింది.

టీచర్ రంగనాథం పేరు లిస్ట్‌లో చేరింది. ఎవరి సిఫారసు లేకుండానే పని జరిగింది. ఒక పైసా ఖర్చు చేయలేదు. రంగనాథం చాలా సంబరపడ్డాడు.

అయితే ఈ సంబరం అట్టే రోజులు మిగలలేదు. "లంచం లేకుండా లిస్ట్ ఫైనల్ చేసేవాడు కాడు వాడు. కాని నా పరిచయంవల్ల మీ శిష్యుడయినందువల్ల పైసా తీసుకోకుండా లిస్ట్‌లో మీ పేరు చేర్చాడు. చెయ్యిచాపి అడగలేదుకాని, తన ఆశను పరోక్షంగా సూచించాడు. నీ బదులుగా నేనే ఐదువేలు ఇచ్చాను. ఎలాగూ అవార్డు డబ్బు వస్తోంది. కదా, చెక్ తీసుకొన్న తర్వాత ఐదువేలు పంపండి" తోడల్లుడు లెటరులోని మొదటి అంశం అది.

"ఇల్లు కట్టి గుల్లఅయింది. చేతిలో చిల్లిగవ్వలేదు. ఇబ్బందిలో ఉన్నాను. అవార్డుతోపాటు ఇచ్చే డబ్బు రేపోమాపో మీకు అందుతోంది. అందులోనుంచి ఐదువేలు నాకు పంపండి, మీరెలాగూ ఈ డబ్బు కోసం ఆశించలేదుకదా. ఆధారపడలేదుకదా" అన్నది తోడల్లుడి లెటర్‌లోని రెండవ అంశం.

ఎం.ఎల్.ఏ స్కూల్‌కు ఫోన్‌చేసి చెప్పాడు. "మా మాష్టారుకు అవార్డు రావాలని శ్రద్ధగా ప్రయత్నించాను. ఫలితం దక్కింది. చాలా సంతోషం అవార్డుతోపాటు పాతికవేలు వస్తోంది. అందులో నుండి నా కోసం కాదుకాని, మన పార్టీ ఫండ్ కోసం ఐదువేలు ఇవ్వండి"

"అభినందనలు, అని రేపు పేపరులో ప్రకటన ఇస్తాను. దానికి అయిన రేటుకు సంబంధించిన బిల్లు మీకే వస్తుంది. ఒక్కపైసా తీసుకోకుండా మీకు సిఫారసు లెటరు ఇచ్చానుకదా. ఇప్పుడు అవార్డుతోపాటు కొంత పైకం మీ చేతికందుతోంది. ప్రకటన రేటు తమరే ఇచ్చేయండి. సార్" దారిలో జీపు ఆపి సూచన ఇచ్చాడు రంగనాథంగారి మాజీ శిష్యుడు. ప్రస్తుత పుర సభాధ్యక్షుడు.

డొనేషన్ అని, బెనిఫిట్‌షో అని, ఆ ఫండు, ఈ నిధి అని రంగనాథం మాష్టారుకు ఆ సిఫార్సు లేఖలిచ్చిన వేరు వేరు సంఘసంస్థల అధ్యక్షులు, పురప్రముఖులు చందాపుస్తకం చేతబూని సరాసరి ఇంటికి వచ్చేశారు.

"రానీ, రాకపోనీ అని దరఖాస్తు ఫారం పూర్తిచేసివచ్చారు. మనమాట తీసేయకుండా అయినా అవార్డు వచ్చింది. చాలా సంతోషం అవార్డుతోపాటు డబ్బు కూడా వస్తోంది. అందులో ఐదువేలు ఉపాధ్యాయుల సంక్షేమనిధిలో పెట్టుబడి పెట్టండి. ప్రతి ఏడు దానికి వడ్డీ వస్తుంది. కష్టంలో ఉండే మన ఉపాధ్యాయ సోదరులకు ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాటు చేయండి. ఒక ఆదర్శ పథకాన్ని ఆరంభించిన వారవుతారు. స్టాఫ్‌మెంబర్స్‌కు అనుకూలంగా ఉంటుంది" మొత్తం స్టాఫ్ ఇలా సలహా ఇచ్చింది.

"అప్పుడు ఫారం తీసుకునేందుకు వెనకాడితిరి. ఇప్పుడు చూడండి అవార్డు వచ్చేసింది. డబ్బు కూడా వస్తోంది. సేవ చేసేందుకు మా స్కూలు మీకు అవకాశమిచ్చింది. నిస్వార్థ సేవ తప్ప మీనుండి మా బడి మరేమీ ఆశించలేదు. ఇప్పుడెలాగూ పాతికవేలు వస్తోంది. అందులో స్కూలుకు పదివేలు డొనేషన్ ఇవ్వండి. స్కూలు అభివృద్ధి కోసం వాడుదాం" ఛాంబర్‌కు ఆహ్వానించి అడిగింది హెచ్.ఎం.

రండనాథం మాష్టారు అన్నీ లెక్కలు వేశాడు. దీర్ఘంగా ఆలోచించాడు. అవార్డు పత్రం తప్ప కడకు ఏమీ మిగలదని రూఢి అయింది.

తాను అవార్డు స్వీకరించబోనని మర్నాడే ప్రభుత్వానికి లెటరు రాశాడు రంగనాథం మాష్టారు.

⁂ ⁂ ⁂

# జీవితం

**- జేక్ కోప్**

ఒకసారి ఆంద్రేకు ఇంట్లో ఇస్త్రీ పెట్టెతో షాక్ తగిలింది. అప్పుడు పదేళ్లే. ఆ షాక్ తగిలాక కరెంటు ఎంత ప్రమాదకరమైందో అతనికి అర్థమైంది,

అప్పుడు అతని డాడీ చెప్పాడు. “ఇది చాలా మామూలు కరెంటు, విద్యుత్‌స్తంభాల తీగల్లో ప్రవహించే కరెంటు చాలా శక్తివంతంగా ఉంటుంది.” అని. అలాంటిదే ఒక స్థంభం వాళ్ల ఇంటి ముందు కూడా ఉంది. చాలా మందంగా అల్లిన తీగలు ఒక స్థంభం నుంచి మరో స్థంభానికి అలాగే వరసగా కట్టబడి వున్నాయి. ఆంద్రేలో మంచి కల్పనాశక్తి ఉంది. అతనికి పువ్వులు, పక్షులు అంటే చాలా ఇష్టం. ఆకాశంలో మెరిసే ఉరుములు, మెరుపులు చుస్తే అతనికి ఎంతో ఉత్సాహం కలుగుతుంది. ప్రకృతి గురించే కాదు. మానవ పరిజ్ఞానం గురించి కూడా ఆ కుర్రాడు పరిపరి విధాలుగా ఆలోచిస్తూ ఉంటాడు. ఉదాహరణకు విద్యుత్ తీగల్లోంచి ప్రసరించే విద్యుచ్ఛక్తి మానవాళికి ఎంత ఉపయోగపడుతుంది? మనం ఆ విద్యుత్తు సహాయం వల్లనే కదా టీవిలో ఇష్టమైన కార్యక్రమాలు చూడగలుగుతున్నాం... రేడియోలో ఇష్టమైన కార్యక్రమాలను వినగలుగుతున్నాం.. ఇలా ఎన్నెన్నో ఉపయోగాలు పొందుతున్నాం... ఎన్నో కర్మాగారాలు నడుపగలుగుతున్నాం.. ఇలా ఎన్నెన్నో ఉపయోగాలు పొందుతున్నాం. తనూ స్వయంగా గమనిస్తున్నాడు. రాత్రి అవుతూనే బటన్ నొక్కగానే చీకటి మటుమాయమవుతుంది. చమత్కారమంతా విద్యుత్తుదే. అతను అప్పుడప్పుడు ఆలోచిస్తాడు. బహుశా ఈ విద్యుత్తు లేకపోతే మనిషి ఎలా జీవించేవాడో? అని

విద్యుత్తు ప్రసాదించే ఈ వరాలవల్లే ఆ కుర్రాడికి విద్యుత్తు తీగలమీద ప్రత్యేకమైన గురి ఏర్పడింది. ప్రతీరోజూ ప్రొద్దున బడికిపోయేముందు ఆ తీగల్నే గమనిస్తూ ఉంటాడు. ఆ తీగలు ఆ కుర్రాడిలో కల్పనాశక్తిని పెంపొందిస్తున్నాయి.

విద్యుత్తు తీగలే కాకుండా ఆంద్రే ప్రతిరోజూ ఆ తీగలమీద వాలే పక్షులను కూడా దీక్షగా గమనిస్తాడు, అవి రెక్కలు రెపరెపలాడిస్తూ ఎగురుతూ ఉంటే ఆ కుర్రాడికి ఆనందంగా అనిపిస్తూ ఉంటుంది. వాటి ఆకర్షణ, మధురమైన కిలకిలరావాలు అతనికి చాలా ఇష్టం. అతను నిద్ర లేవగానే ప్రొద్దున కిటికీ దగ్గరికి వచ్చి నిలబడతాడు. పక్షుల ధ్వని వింటూ తన దినచర్యలు మొదలుపెడతాడు. ఆంద్రే ఆ పక్షుల్ని చూస్తూ బాగా ఆలోచిస్తాడు. ఈ అందమైన చిన్నచిన్న పక్షులు ఎక్కడ్నుంచి వస్తాయో, ఎక్కడికి వెళ్తాయో?

అతని డాడీ చెప్పాడు. “అవి ఎన్ని వేల మైళ్లైనా సులభంగా ప్రయాణించగలవు. ఒక ద్వీపం నుంచి మరో ద్వీపాన్ని కూడా చేరుకోగలవు” అని.

ఇంత చిన్న పక్షి అంత పెద్ద యాత్ర ఎలా చేయగలదో ఆ కుర్రాడి చిట్టి బుర్రకు తట్టడంలేదు.

ఒకరోజు ఉదయం అతను ఓ పెద్ద గుంపును చూశాడు. రోజూలాగే అవి విద్యుత్తు తీగలమీద కూర్చున్నాయి. కిలకిలా రావాలు చేస్తున్నాయి. రెక్కలు కొట్టుకుంటూ ఒళ్లు జలదరించు కుంటున్నాయి. చీటికి మాటికి ఎగురుతూ మళ్లీ వచ్చి అదే తీగలమీద వాలుతున్నాయి. ఆంద్రే ఎంతో ఆసక్తిగా ఆ పక్షుల్ని చూడసాగాడు. కొద్దిసేపటి తరువాత ఒకటొకటే పక్షులన్నీ ఎగిరిపోసాగాయి. కానీ ఒక పక్షి అక్కడే ఉండిపోవడం చూసి ఆంద్రేకు విస్మయం కలిగింది. అది ఎగరడానికి ప్రయత్నిస్తోంది. కానీ లేవలేకపోతోంది. ఆంద్రేకు అనుమానం వేసింది. బహుశా అ పక్షి కాలు ఆ తీగలో ఇరుక్కుపోయి ఉంటుందేమోనని, ఆ తీగ అక్కడ తెగిపోయి, ఏదైనా అతుకువేసి ఉండవచ్చు. లేక అల్లిక వదులయినా అయుండొచ్చు. ఆ సందులో పక్షికాలు ఇరుక్కుపోయి ఉంటుంది.

ఆ కుర్రాడు ఇంటికి తిరిగి పరుగెత్తుకెళ్లి, మమ్మీకి ఆ పక్షి గురించి చెప్పాలనుకున్నాడు. కానీ వెంటనే మమ్మీ మండిపడే అవకాశం ఉందని గుర్తుకు వచ్చి ఆగిపోయాడు.

“వెధవా, స్కూలుకు వెళ్లమంటే పక్షుల తమాషా చూస్తావా?” అని కోప్పడుతుంది. వెంటనే సైకిల్ ఎక్కి స్కూలుకు వెళ్లిపోయాడు అందుకే స్కూల్లో కూడా ఆ

కుర్రాడి మనసు ఆ పక్షిపైనే ఉంది. పాపం ఆ పక్షి తీగ నుంచి తప్పించుకుందోలేదో, దానికి ఆకలివేస్తూ ఉండవచ్చు. ఇలాంటి ఆలోచనలే రాసాగాయి. కుర్రాడికి స్కూలు వదిలిపెట్టాక వేగంగా సైకిల్ తొక్కుతూ ఆ తీగను చేరుకున్నాడు.

ఆ పక్షి ఇంకా ఆ తీగనే అతుక్కుపోయి ఉంది. దాని రెక్కలు కదలడంలేదు. అది చూసి ఆంద్రేకు చాలా బాధ కలిగింది. అది చచ్చిపోయిందే! అనుకున్నాడు. కానీ కొద్ది సేపటి తరువాత ఆ వివశపక్షి భుజాలు కదిలాయి. అది చూసి ఆంద్రే మనసు కుదుటపడింది. ఆ పక్షి బతికే ఉంది, దినమంతా పక్షి ఆ తీగకు బందీ అయిపోయి ఉంది.

అదే విచారంతో ఆంద్రే ఇల్లు చేరుకున్నాడు. సైకిల్ ఓ పక్కనబెట్టి, బలవంతంగా తల్లిని ఆ తీగ దగ్గరికి తీసుకు వచ్చాడు.

"అటు చూడు మమ్మీ" అని వేలితో చూపిస్తూ చెప్పాడు. "పాపం అది ప్రొద్దుట్నుంచీ ఆ తీగలోనే ఇరుక్కుపోయి ఉంది" కుర్రాడి తల్లి ముఖానికి ఎండ తగలకుండా తన కళ్లపై రెండు చేతుల్ని చూరులా పెట్టుకుని పైకి చూడసాగింది. కాసేపటి తరువాత కొడుకుతో అంది.

'అవును కరెక్టే, అది ఇరుక్కుపోయింది. ఫర్వాలేదు. కొద్దిసేపటి తరువాత అదే ఎగిరిపోతుంది.'

"అది ఎగిరిపోలేదు, మమ్మీ" ఆంద్రే బిగ్గరగా అన్నాడు. "నేను దీన్ని ప్రొద్దుట్నుంచి చూస్తున్నాను. ఎగరలేకపోతోంది"

"సరే సరే…ఇంక ఇంటికి పద" అప్పుడప్పుడు పక్షులు ఇలా తీగల్లో ఇరుక్కుపోతూనే ఉంటాయి' అని తల్లి కసురుకుంది.

ఆంద్రే ముఖం చిన్నబుచ్చుకుని తల్లి వెంట ఇంటికి వచ్చేశాడు. ఇక తండ్రి కోసం ఎదురు చూడసాగాడు. ఆ విషయం డాడీక్కూడా చెప్పాలి. తండ్రి సాయంత్రం ఇంటికి వచ్చాడు. టీ తాగాక ఎప్పట్లాగే చెట్లకు నీళ్లు పట్టడానికి పెరల్లోకి వెళ్లిపోయాడు. ఆంద్రే కూడా నీడలా ఆయన వెనుకే నడిచాడు.

"ఏమిట్రా అబ్బాయి. ఇవాళ నావెనకాల తిరుగుతున్నావు? ఆడుకోడానికి వెళ్లలేదా? అడిగాడు తండ్రి.

"డాడీ...అక్కడ ఒక పక్షి తీగలో ఇరుక్కుపోయింది." అని చెప్పాడు బిక్కమొహం వేసి.

"అవునవును...మీ మమ్మీ చెప్పింది"

"అది ఇప్పటికీ అక్కడే వుంది. డాడీ".

"అయితే ఏమిటి?" తండ్రి కోపంగా వాడి కేసి చూశాడు. "దానికి మనం ఏం చేయగలం?"

అని జవాబు వచ్చేసరికి కుర్రాడు కాళ్లు నేలకు కొడుతూ తిరిగి వచ్చేశాడు.

తండ్రి కూడా ఆ పక్షి పట్ల అంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తాడనుకోలేదు. ఆ కుర్రాడు తన మాట ఏమీ వినిపించుకునేలా లేదు. అయినా ఆంద్రే ఆ విషయం మరిచిపోలేకపోతున్నాడు. ఆ ఇరుక్కుపోయిన పక్షి ఆ కుర్రాడి కళ్లల్లో మెదులుతూనే ఉంది.

రాత్రికి భోజనాలు చేసేటప్పుడు ఆ పక్షి ప్రస్తావన ఎవరూ ఎత్తలేదు కానీ మమ్మీ పడుకునేముందు కొడుక్కి "గుడ్‌నైట్" చెప్పడానికి వచ్చి వాణ్ణి సంతృప్తి పరచడానికి చెప్పింది. "బాబూ!" 'నువ్వు ఆ పక్షి గురించి అందోళన పడాల్సిన అవసరంలేదు. దేవుడు దాన్ని రక్షిస్తాడు'

"దేవుడు కూడా మనకే చెబుతాడు. మమ్మీ" అన్నాడు ఆంద్రే సందేహంగా, "నువ్వు కాస్త ఆలోచించు మమ్మీ పాపం అది రాత్రంతా అలాగే ఆ తీగలో ఇరుక్కుపోయి ఉంటే..."

తల్లి దీర్ఘంగా నిట్టూర్పు వదిలి గదిలోంచి వెళ్లిపోయింది.

మనుసటి రోజు శనివారం, ఆంద్రే స్కూలుకు వెళ్లలేదు. ప్రొద్దున లేస్తూనే మొట్టమొదట ఆ పక్షిని చూడ్డానికి వెళ్లాడు. అది అప్పటికీ అలానే ఉంది. అతనికి బాధ అనిపించింది. ఈ రోజు స్కూలులేదు. స్కూలుకు వెళ్లినా పాఠాల్లో పడిపోయి బహుశా ఆ పక్షి విషయం మరిచిపోయేవాడు. ఇంటి దగ్గర ఉండడంవల్ల రోజంతా దాని బాధ చూస్తూ గడపాల్సిందే.

ఆ విషయం మర్చిపోడానికి ఆ కుర్రాడు ఆటల్లో పడిపోయాడు. క్యారమ్స్ అడడం అంటే అంద్రేకు చాలా ఇష్టం, ఆ ఆటలో చాలసేపు నిమగ్నమయిపోయాడు.

సమయం ఎలా గడిచిందో అతనికే తెలియదు. మళ్లీ మధ్యాహ్నం అతని చూపు ఆ తీగపైపడింది. అక్కడి దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు. ఆ పక్షి తన నోరు తెరచి ఉంచింది. ఇతర పక్షులు దాని చుట్టూరా తిరుగుతూ ఉన్నాయి. వాటిల్లో కొన్ని దానికి సహకరించడానికి ప్రయత్నిస్తున్నాయి. మరికొన్ని దాని నోట్లో నోరుపెట్టి ఏదో అందిస్తున్నాయి.

ఆంద్రే పరిగెత్తుకెళ్లి ఇంట్లో నుంచి తన తల్లిని చెయ్యిపట్టుకుని లాక్కువచ్చాడు బయటికి.

"ఆవును ఇతర పక్షులు దానికి తిండి తినిపిస్తున్నాయి" వాడి తల్లి తీగవైపు చూస్తూ చెప్పింది.

"ఆంద్రేకు అప్పుడు వింతగా అనిపించింది. నిజమే, ఇతర పక్షులు దానికి సహకరించడానికి ప్రయత్నిస్తున్నాయి. కానీ మనిషి ఏమత్రం పట్టించుకోవడంలేదు. చూసి కూడా మిన్నకుండిపోతున్నారు. తన తల్లిదండ్రులు ఆ విషయం చర్చించడానికి కూడా సిద్ధంగా లేరు.

ఆ కుర్రాడు ఎత్తైన స్థంభంకేసి తదేకంగా చూడసాగాడు. దానిపైకి ఎక్కడం చాలా కష్టం. ఒకవేళ ఎక్కినా ఏం ప్రయోజనం? ఆ పక్షిని విడిపించడం చాలా కష్టం. ఆ తీగల్లోంచి వేలకొద్ది వోల్టు విద్యుత్తు ప్రసరిస్తూ ఉంటుంది.

కాకపోతే ఆ పక్షిని కాపాడే మార్గం ఒకటి ఉంది. ఎవరైనా విద్యుత్తు కంట్రోలు రూంకు వెళ్లి కొద్దిసేపు విద్యుత్‌ను నిలుపు చేయించితే ఆ స్థంభంపైకి ఎక్కి ఆ తీగ అల్లికలోంచి ఆ పక్షికి విముక్తి కలిగించొచ్చు. అతను మధ్యాహ్నం భోంచేసేటప్పుడు తండ్రితో అదే విషయం సూచిస్తే ఆయన ఒక్కసారిగా విసుక్కున్నాడు.

"ఏమిట్రా పక్షీపక్షీ అంటూ ఒకటే నస, మరో ధ్యాసేం లేదా నీకు?"

ఆ రాత్రికి మమ్మీ గుడ్‌నైట్ చెప్పడానికి వస్తే ఆమెవంక సరిగ్గా చూడనుకూడా చూడలేదు. ఆ కుర్రాడికి ఆ ఇద్దరిమీద కోపంగా ఉంది.

ఆదివారం రాత్రికి ఆ కుర్రాడు మమ్మీతో అన్నాడు. "చూశావామమ్మీ. ఆ పక్షి ఇంకా ఎందుకు బతికి ఉందో? దానికి కారణం ఇతర పక్షులన్నీ దానికి సహకరిస్తున్నాయి."

"ఆవును నాకు తెలుసు"

"కానీ అది ఎక్కువ రోజులు బతకదు... డాడీ కరెంటు ఆఫీసుకెళ్లి కాసేపు కరెంట్ ఆఫ్ చెయ్యమని ఎందుకు చెప్పడంలేదు. స్థంభంమీదికి ఎక్కి ఆ పక్షిని తీసేవాళ్లుగా"

"వాళ్లు ఓ పక్షికోసం కరెంటు కట్టేయరు బాబు. నువ్వు అదంతా మర్చిపోయి నిద్రపో"

మరుసటి రోజు సోమవారం రోజూలాగే స్కూలుకి వెళ్లాడు. కానీ స్కూల్లో అతనికి పాఠాలేం మనసుకు పట్టడంలేదు, ఆ పక్షి అతని కళ్లల్లోనే తిరుగుతోంది. స్కూలు వదిలి పెట్టగానే నేరుగా కరెంటు కంట్రోల్‌రూంకు వెళ్లడానికి ఆ రూట్ బస్సు పట్టాడు. తనే స్వయంగా వెళ్లి ఆ పని చూడాలనుకున్నాడు. ఆ ఏరియా కంట్రోల్‌రూం అతనికి తెలుసు.

ఆ విద్యుత్ కంట్రోల్‌రూం చాలా పెద్దగా ఉంది. ఎదురుగానే ఒక నీగ్రో బెంచీమీద కూర్చుని ఉన్నాడు.

ఆంద్రే గబగబా ఆ వ్యక్తికి తను వచ్చిన విషయం వివరించాడు. "మీరు కొద్దిసేపు కరెంటు ఆఫ్ చేస్తే నేను స్థంభం ఎక్కి ఆ పక్షిని విడిపిస్తాను" అని చెప్పాడు.

ఆ వ్యక్తి కుర్రాడి మాటలు విని నవ్వాడు. అతను తన పేరు మెక్బర్ అని చెప్పాడు. తనకు కరెంట్ కట్టేసే అధికారం లేదు. ఇంజనీర్‌కు చెప్పమని చెప్పాడు.

ఆ హాలు చాలా విశాలంగా ఉంది. అసంఖ్యాకమైన యంత్రాలు ఉన్నాయి. వాటికి డయల్స్ అమర్చబడి ఉన్నాయి. వాటిల్లో ముళ్లు కదులుతూ ఉన్నాయి.

తెల్లడ్రెస్సు యూనిఫాం వేసుకున్న సిబ్బంది ఎవరి పనిలో వారు నిమగ్నమై ఉన్నారు. ఎదురుగా గోడవారగా ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అతని ఎదురుగా బల్లమీద కొన్ని ఫైల్స్ ఉన్నాయి. ఆంద్రే ఆ వ్యక్తి ముందుకు వెళ్లి నిల్చున్నాడు. అతను తన మొర అలకిస్తాడో లేదోనని దిగులుతో బిక్కమొహం వేసుకొని నిలబడ్డాడు. కొద్దిసేపటి వరకు ఆ కుర్రాడి నోట్లోంచి మాట పెగల్లేదు.

"కూర్చోబాబూ, కూర్చో" ఆ వ్యక్తి ఒక కుర్చీవైపు సంజ్ఞ చేస్తూ చెప్పాడు.

"భయపడాల్సిన అవసరం ఏమీలేదు" ఆంద్రే అతనికి ధన్యవాదాలు తెలుపుతూ కుర్చీలో కూర్చున్నాడు.

"ఆ! ఇప్పుడుచెప్పు, ఏమిటి విషయం?" అతను అడిగాడు

ఆంద్రే అతనిక్కూడా ఆ పక్షి గురించి పూర్తిగా వివరించి చెప్పాడు. ఆ వ్యక్తి ఆంద్రే మాటలు శ్రద్ధగా వినసాగాడు. ఆంద్రే చెప్పడం పూర్తయ్యాక అతను చెప్పాడు.

"కానీ బాబూ1 కాసేపు కరెంటు నిలిపివేస్తే ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో నీకు తెలియదు. నడిచే రైళ్లు ఆగిపోతాయి, యంత్రాలన్నీ నిలిచిపోతాయి, ఏదైనా హాస్పిటల్లో ఆపరేషన్ జరుగుతూ ఉంటే అక్కడ ఆంతరాయం ఏర్పడుతుంది...ఇలా ఎన్నెన్నో విపత్తులు జరిగిపోతాయి. ఇక పక్షుల విషయానికి వస్తే తరుచూ అవి ఇలా ఇరుక్కుపోతూనే ఉంటాయి. వాటిని వారించలేం. ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. జీవితం అంటేనే అది"

ఆ వ్యక్తి నవ్వుతూ, ఆంద్రే పేరు, చిరునామా రాసుకుంటూ అన్నాడు, "బాబూ! నువ్వు నీ కర్తవ్యాన్ని పూర్తి చేశావు. నీ భావనపట్ల నాకు చాలా ఆనందం కలిగింది. కానీ, నేను నీకు ఖచ్చితంగా మాట ఇవ్వలేను. కరెంటును ఆపు చేయడం మామూలు విషయం కాదు. అయినా ప్రయత్నిస్తాను' ఆంద్రే ఇంటికి తిరిగొచ్చేశాడు. అతను ఇంటికి రావడం ఆలస్యం ఆయినందుకు మమ్మీ చాలా కంగారుపడుతూ ఉంది. ఏదో వంక చెప్పి దాటవేశాడు. ఇపుడా కుర్రాడిలో ఆ పక్షి వంక చూసే ధైర్యం కూడా సన్నగిల్లిపోయింది. అందరూ దాని మానాన దాన్ని వదిలేశారు. పైగా ఆ 'ఇంజనీర్ జీవితం అంటే అదే' అంటూ ప్రగల్భాలు పలికాడు.

అర్ధరాత్రి మమ్మీ వచ్చి నిద్రలేపింది, ఆంద్రేను. "ఎవరో వ్యక్తి నిన్ను కలవడానికి వచ్చాడు" అని చెప్పింది మమ్మీ. ఆ కుర్రాడు వరండాలోకి వచ్చాడు. డాడీ కూడా అక్కడే ఉన్నాడు. ఆయనతోపాటు ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉన్నారు. అందులోంచి ఒక వ్యక్తిని అతను గుర్తుపట్టాడు.

అతను మెక్బర్. పూర్తిగా రెడీ అయివచ్చాడు. బయట ఒక వాహనం నిలబడి ఉంది. దాంట్లో ఒక మడతనిచ్చెన కనబడుతోంది.

"మెక్బర్!" ఆంద్రే ఆనందంతో అరిచాడు. "మీరు వచ్చేశారా?"

"ఆ! మేం వచ్చేశాం" మెక్బర్ చెప్పాడు. "ఇక నీ పక్షి బతుకుతుంది."

మెక్బర్ ఆ కుర్రాడి తండ్రికి తమ ఇంజనీర్లు ఆ లైనులో ప్రసరించే విద్యుత్తు ఓల్టును ఎలా తగ్గించేశారో, ఎలాంటి ప్రమాదం జరగకుండా ఆ తీగవరకు ఎలా

చేరుకుంటారో అంతా వివరించి చెప్పాడు. ఆంద్రేను తమ వెంట వచ్చి ఆ పక్షి ఇరుక్కుపోయిన స్థలం చూపించమని కోరాడు.

"వీళ్లవెంట వెళ్లు" డాడీ చెప్పాడు.

ఆంద్రే వెంటనే వెళ్లి ట్రక్కులోకూర్చున్నాడు. రెండు నిమిషాల్లోనే ట్రక్కు ఆ తీగ కిందకు చేరుకుంది. మడత నిచ్చెన విప్పి నిలబెట్టారు.

ఆంద్రే ట్రక్కులోంచి కిందకు దిగి ఎంతో ఆసక్తిగా మెక్బర్ చేస్తున్న పనిని చూడసాగాడు. మెక్బర్ తన తలకి ఒక ఫ్లష్ లైట్ బిగించుకొని, కొన్ని పరికరాలు తీసుకొని నిచ్చెన ఎక్కసాగాడు. ఆ పక్షి అతన్ని చూసి రెపరెప కొట్టుకున్నా, ఎగరలేకపోయింది. మెక్బర్ తన పని మొదలుపెట్టాడు. కొద్దిక్షణాల్లోనే అతను పక్షి కాలును జాగ్రత్తగా తీగలోంచి తీశాడు. తిన్నగా ఆ పక్షిని తన కోటు జేబులోకి దించాడు. మెల్లిగా నిచ్చెన దిగి వచ్చేశాడు.

కిందికి వచ్చాక అతను పక్షిని ఆంద్రేకు అందించాడు,

ఆంద్రే తొందరగా ఆ పక్షిని పట్టుకున్నాడు. అప్పటికి అతని నాలుక తడారిపోయింది. ఏం మాట్లాడలేకపోతున్నాడు. గొంతు పెగలడంలేదు. వెంటనే తన నాలుకను పెదవుల మీద ఆడిస్తూ అన్నాడు. "థాంక్యూ సార్, చాలా చాలా థాంక్స్!"

ఆంద్రే తొందరగా ఆ పక్షిని నేలమీద కూర్చోబెట్టాడు. పక్షి ఎగరడానికి ప్రయత్నించింది. కానీ కొద్దిగా పైకి ఎగిరి కిందపడిపోయింది. దాని కాళ్లు ఇంకా పనిచేయడం లేదు. కొద్దిసేపటి తరువాత అది మళ్లీ ప్రయత్నించింది. ఈసారి అది ఎగరడంలో సఫలీకృతం అయ్యింది. అంధకారంలోకి మాయమవుతూ, దాని ధ్వని వినిపించింది. ఆ ధ్వని ఆంద్రేకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టుగా ఉంది. అది విని ఆంద్రే తృప్తిగా ఆలోచించసాగాడు, జీవితం అంటే ఇది. ఆ వ్యక్తి తప్పు చెప్పాడు. ఒకరికొకరు తోడుగా, పరస్పరం సహకరిస్తూ జీవించడమే జీవితం.

⁂ ⁂ ⁂

# ద్వంద్వ సమాసం

## మధురాంతకం రాజారాం

**ఒ**క శాశ్వతమైన విలువను ఎద్దేవా చేయడం కోసం నే నీ కథ చెబుతున్నానని ఎవరైనా అనుకుంటే, 'మన్నించంటి, బాబూ' అంటూ లెంపలేసుకోవడం మినహాగా నాకు గత్యంతరంలేదు. నేను పది పదిహేనేళ్ళుగా పిల్లలతో వేగుతున్న దాన్ని, భగవంతుని సృష్టిలో ఏ వస్తువూ ఇంకొక వస్తువుకు అసలు సిసలు డిటోగా ఉండదంటారు. పిల్లలున్నూ అంతే. ఆకారంలో మాత్రమేగాదు, ప్రవర్తననుబట్టి చూచినా, తెలివితేటల్ని బట్టి చూచినా ఎవరికివారే ప్రత్యేకం! రెక్కలొచ్చిన పక్షులు గాలిలో ఎగిరిపోయినంత సహజంగా, సులభంగా, కొందరు పిల్లలు చదువుల్లోకి చొచ్చుక పోతారు. అదొక సాంప్రదాయం గనుక బడి కొస్తున్నారేగానీ, వీళ్ళింటి దగ్గరే ఉండి టీచర్‌తో అవసరం లేకుండానే చదువుకోగలరనిపిస్తుంది. మరికొందరికి చదువుపైన శ్రద్ధ వున్నట్లే తోచదు. ఎప్పుడూ పరధ్యానంగా ఉన్నట్టే కనిపిస్తారు. కానీ, ఎప్పుడే ప్రశ్న అడిగినా టకీమని సమాధానం చెప్పేస్తూ వీళ్ళు టీచరుకాశ్చర్యం కలిగిస్తారు. కొందరికి పాపం, బాగా చదువుకోవాలనే ఉంటుంది. రాత్రంతా కంఠో పాఠం చేసి ఉదయం ఒప్పగిస్తారుగూడా! కానీ మరునాటికల్లా అంతా మరిచిపోతారు. కొందరెట్లాగో తంటాలుపడి అత్తెసరు మార్కులతో పాసవుతారు. మరికొందరికి చదివే వోపరికం బొత్తిగా ఉండదు. కానీ మార్కులతోబాటు, పాసవుతారు. మరికొందరికి చదివే వోపరికం బొత్తిగా ఉండదు. కానీ మార్కులతోబాటు, మిగిలిన కితాబులన్నీ గూడా తమకే కావాలని ఉంటుంది. విద్యాబోధకులైనవారు పిల్లల మనస్తత్వాన్ని బట్టి, విషయగ్రహణ శక్తిని బట్టి ఒక్కొక్క విద్యార్థితో ఒక్కొక్క రకంగా వ్యవహరించవలసి ఉంటుందని నేను అనుభవం వల్ల తెలుసుకున్నాను. అంతకుమించి విద్యార్థి కుటుంబం సమాజంలో దానికున్న పలుకుబడి,

కులం, మతం, వర్గం మొదలైన మీమాంసలు టీచరుకు బొత్తిగా అక్కరలేవని నా నమ్మకం. నా ఉద్యోగ నిర్వహణ కంతా ప్రాణభూతమైన ఈ నమ్మకాన్ని వమ్ముచేస్తూ ఒకానొక నాటి ఉదయం ఒక తుపాను మా స్కూల్లో ప్రవేశించింది.

ఆడపిల్లల పాఠశాలగదా! ఆ వచ్చిన తుపాను గూడా ఒక స్త్రీ రూపంలోనే వచ్చింది. వాలకాన్ని బట్టిచూస్తే ఒక పెళ్ళికి వెళ్తూ వెళ్తూ మార్గమధ్యంలో ఆవిడ ఈ బడిలో దిగేసినట్లుంది. కట్టుకున్న పట్టుచీర సంపన్నతకు గుర్తు. అది ముదురు ఆకుపచ్చ రంగులో ఉండడం అభిరుచుల తీవ్రతకు వైముఖ్యానికి సూచన. ఇంక నగల సింగారింపు సంగతి చెప్పనే అక్కర్లేదు. మొత్తం పైన తనను గురించి ఒంకొకరు పరిచయం చేయవలసిన అవసరం లేకుండా, తన వేషమే ఆ పనిని చేయగలిగేటట్టు ఆమె జాగ్రత్త తీసుకున్నదని మాత్రం ఒప్పుకోవాలి. ఆ ఉద్దేశం నిరాఘాటంగా నెరవేరినట్టే ఉంది. అందుకు నిదర్శనం ఇంటర్వెల్ సమయంలో స్టాఫ్ రూంలో అడుగుపెట్టేసరికి నాకు కానవచ్చిన సంచలనం.

"కంట్రాక్టరు చంద్రారావుగారంటే తెలియదా? మునిసిపాలిటీ పనులన్నీ చేయిస్తుంటారు. ఈ మధ్య పార్కు దగ్గర వాటరు టాంకు కట్టించింది గూడా ఆయనే?"

"తెలుసులేవే, హేమా! ఆ టాంకు అడుగుభాగం నీళ్ళు జల్లిస్తూందట. చంద్రారావుగారు టాంకులు నిర్మించడం కన్నా, జల్లెడలు తయారుచేసి అమ్ముకోడం మంచిదని మన ఊరి పత్రికలో వ్యాసం వచ్చింది గూడా?"

"ఆ చంద్రారావుగారి భార్యే ఆవిడ! లేడీస్‌క్లబ్బులో యాక్టివ్‌మెంబరు..."

"మరైతే ఈమె దారి తప్పి ఇలా ఎందుకొచ్చి ఉంటుందబ్బా?"

"దారితప్పి కాదులే! వాళ్ళమ్మాయి నాలుగో క్లాసులో ఉందిగా!"

"అలాగా, అలాగా" అన్న బృందగానంతో బాటుగా అందరి కళ్ళూ నావైపు తిరిగాయి.

"ఏమమ్మా జానకీ! చంద్రారావుగారి అమ్మాయిపైన గోరుగానీ, చెయ్యిగానీ చేసుకున్నావా ఏమిటి! మిసెస్ చంద్రారావు ఆకారణంగా ఎందుకొస్తుంది! ఏదో పని మీదనే వచ్చి ఉంటుంది. ఎవరి పనో పట్టడానికే వచ్చి ఉంటుంది...'

అబ్బే, నే నెవరినీ కొట్టలేదే! కనీసం తిట్టనుగూడా లేదే! అన్న జవాబు కోసం మా పంతులమ్మలందరూ వేచి ఉన్నట్టే తోచింది. పెదవి కదలకుండా నేను మౌనం వహించడంవల్ల వాళ్ళ అనుమానం మరింతగా బలపడి ఉండవచ్చు గూడా! నిజానికి నా క్లాసులో ఉన్న నలభై మంది పిల్లల్లో కంట్రాక్టరు చంద్రారావుగారి కూతురెవరో నాకు తెలియదు. కొట్టడం, తిట్టడంలాంటి తీవ్రచర్యలు గాకపోయినా, అవసరమైనప్పుడు ఏ అమ్మాయినైనా కాస్త మందలించి ఉండడం సంభవమే! కానీ, ఆ మాత్రానికి ఒక తల్లి పనిగట్టుకుని బడిపై కొస్తుందా?

ఏమిటో మరి! నా ఆలోచనలలో నేనుండగానే – “జానకమ్మగారూ! మిమ్మల్నొకసారి హెచ్.ఎం.గారు ఆఫీసు రూముదాకా రమ్మంటున్నారండీ!” ఆయా సుబ్బులమ్మ బిరబిరా గదిలోపలికి వచ్చేసింది.

“చూచావా! మేమనుకున్నంతా అయింది. ఇక నువ్వు తొక్కిన అడుసును నువ్వెలా కడుక్కుంటావో కడుక్కో” అన్నట్టుగా తోడి ఉపాధ్యాయినుల చూపులన్నీ ఒక్కుమ్మడిగా నాపైన మూగి, సానుభూతి పలుకసాగాయి.

అయితే, ఈ పరిస్థితిలో బేలముఖం పెట్టి బెంబేలు పడవలసిన అవసరం నాకేమీ కనిపించలేదు. మిసెస్ చంద్రారావు సమాజంలో గొప్ప స్టాటస్ గలిగిన ఇల్లాలే కావచ్చు. కాని, ఆవిడ సింహం కాదు గదా! పులిలా పైనబడి తినేయలేదుగదా! సహేతుకమైన ఏ ఆరోపణకైనా స్వాగతమే! నిర్హేతుకంగా మాటలు మీరితే వూరుకోవడం నాచేత గాదు. అయినా జరగని పెళ్ళికి ఇప్పటినుంచే మేళాలెందుకు! వీలయినంత నింపాదిగా ఆఫీస్ రూంలో ప్రవేశించాను. తీరా అక్కడ అడుగుపెట్టేసరికి అనవసరంగా లేనిపోని అపోహలు కలిగించుకున్నానేమోనని నేను కొంచెం కించపాటుకు లోనుగాక తప్పిందిగాదు. నా అంచనాకు విరుద్ధంగా అక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉండడమే అందుకు కారణం!

“రావమ్మా, జానకీ! కూచో... హెడ్‌మిస్ట్రెస్ దేవసేనగారు సాదరంగా పిలిచి కుర్చీ చూపెట్టింది. “వీరిని తెలీదటమ్మా, శ్రీమతి రమాబాయిచంద్రారావుగారు, సోషల్ యాక్టివిటీస్‌లో ఎప్పుడూ ముందుంటారు...”

“నమస్కారమండీ!” అన్నాను.

అప్పు చెల్లించడానికి తొందర పడుతున్నట్టుగా అసలుతో వడ్డీగూడా కలిపి – ‘నమస్తే, నమస్తే’ అంది రమాబాయి.

మళ్ళీ నన్నే ఉద్దేశించి కొనసాగించింది. హెడ్‌మిస్ట్రెస్ – “సముద్రం పొంగుతుంది. భూకంపాలొస్తున్నాయి. అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. అలాంటి అవాంతరాలొచ్చినప్పుడల్లా రంగంలోకి దూకి దీనుల్ని ఆదుకోవడంలో రమాబాయి గారు ఫస్టు!…అన్నట్టు, రమాబాయిగారు! ప్రస్తుతం మీ యాక్టివిటీ ఏమిటండీ!”

“మురికివాడల్లో పాపలకు దుస్తులు, పాలపొడి డబ్బాలు పంచి పెడుతున్నాం” అదైనా మంచి ఎక్స్‌పీరియన్సే! ఇటీవలి కాలంలో టౌనుకన్నా దీని చూట్టూ మురికి వాడలే బాగా బలిసిపోయినట్లున్నాయి. మూరెడెత్తు మట్టి గోడలపైన పెద్ద బుట్ట ఒకటి బోర్లించినట్టుగా అవేం ఇళ్ళో మనకర్థం గావు. అంతకన్నా చెట్ల తొర్రలు, కొండ గుహలే నయం! ఆ గుడిసెల్లో జీవిస్తున్నది మనుషులేనంటే నమ్మడం కష్టం. రొంపీ, రొచ్చూ, చెత్తా, చెదారం, ఈగలూ, దోమలూ, కుక్కలూ, పందులూ… అబ్బబ్బా, ఆ దుర్గంధాన్ని భరించలేము. వీలైనంత తొందరగా బయట పడాలనే ఉంటుంది. వాళ్ళు తెమలనివ్వరే! ఉదయం పదిగంటల కొస్తున్నట్టుగా చెప్పి పంపుతామనుకోండి! వాళ్ళు ఉదయం ఎనిమిది గంటలకల్లా మన కోసం హాజరైపోతారు. తమ బిడ్డలకు బొత్తిగా బట్టల్లేవని మనకు తెలియాలి గదా! అందుకని వాళ్ళని చింకి పేలికల్లో చుట్టి తీసుకొస్తారు. ‘బిడ్డలందరికీ దుస్తులు ఇస్తున్నాం, క్యూలో నిల్చోండి’ అంటే వినరే! ఒకరిపైన ఒకరు పడుతూ లేస్తూ, మోదుకుంటూ, ‘అమ్మా, తల్లీ! దయజూడమ్మా! నా బిడ్డకయితే పుట్టింది మొదలు చొక్కా తొడగలేదమ్మా’ అంటూ గింజుకుంటారు. ఇంతకన్నా కనాకష్టం పనులున్నాయండీ వాళ్ళల్లో, మనం పాలపొడి డబ్బాలిస్తున్నాంగదా! వాళ్ళు వాటిని తీసుకెళ్ళి బజార్లో అమ్ముకుంటారట! వ్యవహారం ఎంత నేస్టీగా ఉందో చూశారా! ఏమిటోలెండి! ఈ దేశాన్ని బాగు చెయ్యడం సాధ్యమే నా అనిపిస్తూ ఉంటుంది. ఒక్కొక్కప్పుడు…’

“అయినా, ఎంత వోపికండీ మీకు! ఎప్పుడూ ఒక పని పెట్టుకుంటూ ఉంటారు. మాబోటి వాళ్ళకు మిమ్మల్ని చూస్తే ఎంత అసూయగా ఉంటుందో చెప్పలేను…”

దేవసేనగారి మంత్రం రమాబాయిపైన బాగా పనిచేసింది.

“మా ఇంటి కంతా ఈ తెగులు పట్టింది నా కొక్క దానికేనండీ! మా పెద్దన్నయ్య సింగరేణిలో పెద్ద ఆఫీసరు. మా పెద్దక్కయ్య ఆర్మీ డాక్టర్‌ను పెళ్ళాడి ఆగ్రా దగ్గర సెటిలైపోయింది. మా చిన్నక్క నిచ్చింది బెంగుళూరు. అక్కడ మా చిన్న బావ…”

రమాబాయి వాగ్ధార అంతకంతకూ ఉప్పొంగి ఒక ప్రవాహంలా మారబోయే ప్రమాదాన్ని నేను శంకించాను ఆ ప్రవాహంలో మునుగుతూ, తేలుతూ దూరతీరాలకు కొట్టుకుపోయే పూచీనంతా మా హెడ్‌మిస్ట్రెక్ గారికే అప్పగించి. "మన్నించండి, మేడం! నాకు క్లాసుంది. వెళ్ళివస్తాను" అంటూ పైకి లేచి చరచరా గుమ్మం దాకా వచ్చేశాను.

'ఉండండి, మేడం! మాట..." అంటూ రమాబాయిగారు లేచి నా వెనువెంట వసారాలోకి వచ్చేసింది.

ఇంటర్వెల్ పూర్తిగావడంతో పిల్లలందరూ వాళ్ళ గదులకేసి వెళ్ళి పోతున్నారు. రమాబాయి నాచేయి పట్టుకుని ఒక స్తంభం చాటుకు తీసుకెళ్ళింది.

"మేడం! నాకోసం మీరొక పని చేయాలి.."

ఏమిటో చెప్పండి?" అన్నాను విస్మయాన్ని తొక్కి పెట్టుకుంటూ.

"మరేం లేదు. పెద్ద ఆబ్లిగేషనేమీ గాదు. మా అమ్మాయి అనిత మీ క్లాసులో ఉందిగదండీ! దాని పక్కన అమ్మణ్ణి అంటూ ఒక పిల్ల కూచుంటుందట! ఆ పిల్లను వెనక డస్కుల్లోకి పంపించి ఆ తావులో శ్యామలారాణిని కూర్చోబెట్టాలి. శ్యామలారాణంటే తెలుసుగదా! అడ్వొకేటు జగన్నాధరావుగారి కూతురు. ఏమిటో మరి! అమ్మణ్ణి అనే పిల్ల నంగనాచిలా ఉంటుందట. గుడ్లు మిటకరించి చూస్తుందట, మంచి బట్టలయినా తొడుక్కోదట. మా అమ్మాయికా పిల్ల పొలకునే నచ్చడం లేదు. అందుకని చెబుతున్నా. నేను చెప్పినట్టు చేస్తారు గదూ? చేస్తారులెండి! థాంక్స్...'

నోరు తెరిచి ఒక మాట చెప్పే అవకాశమైనా నాకివ్వకుండా రమాబాయి వెళ్ళిపోయింది. నేను మాత్రం నిర్విణ్ణురాలినై నిల్చుండిపోయాను. ఆమె నన్నొక పని చేయమని కోరింది. అందులోని సాధ్యాసాధ్యాలను గురించి గానీ, ఉచితానుచితాలను గురించి గానీ ఆలోచించుకోడానికి నా కెడమివ్వకుండా 'ఆఫ్టరాల్ టీచరువి! చెప్పినట్టు చేయకపోతే నువ్వు మెదిలేదెక్కడ?" అని సవాలు విసిరినట్టుగా ఆమె వెళ్ళిపోవడం తలచుకుంటే నాకు మతిపోతూంది. చదరంగంలో పావుల్ని మార్చవచ్చు. పేకాటలో చీటీలను గూడా ఎక్కడ ఇష్టమైతే అక్కడ పెట్టుకోవచ్చు. పాల డబ్బాలకోసం వచ్చే బీదజనం పైన దాష్టీకం చలాయించవచ్చు. కానీ తరగతి గదిలో గూడా అట్లాగే తన పెత్తనం కొనసాగాలనుకోడం ఏం సబబు? అక్షర క్రమాన్ని బట్టి మేము హాజరు పట్టీలో పిల్లల పేర్లు నమోదు చేస్తాం. ఆ మేరకు గదిలో వరుసగా కూచోపెడతాం. అమ్మణ్ణితో అనితకు గొడవేర్పడినట్టు ఇప్పుడు రమాబాయి చెబుతూంది. వడ్ల గింజలో బియ్యపు

గింజలాంటి ఈ వ్యవహారాన్ని ఇప్పటి వరకూ పసిగట్టకపోవడం తరగతి పంతులమ్మగా నేను సిగ్గుపడవలసిన విషయం!

ఆలోచిస్తూ గదిలో కెళ్ళి నా కుర్చీలో కూచున్నాను. క్లాసులంతా ఒకసారి కలయజూచాను. ప్రత్యేకించి అమ్మణ్ణి వైపు చూశాను. ఆ పిల్ల ముఖంలో నాకు నంగనాచి లక్షణాలేవీ కానరావడం లేదు. లోకాన్నంతా వేలం పాటలో కొనగలిగేటట్టు డాబులు చెప్పుకునే ఆరిందాల దృష్టికి ఆ పిల్ల నంగనాచిలా కనిపిస్తుందేమో! అలా మాట్లాడే వాళ్ళకేసి గుడ్లు మిటకరించి చూస్తుందేమో! పోతే మంచి దుస్తులేసుకోదన్న నేరం ఒకటుంది. లోకులందరూ మంచి ఇళ్ళల్లోనే ఉంటూ, మంచి తిండే తింటూ, మంచి దుస్తులే తొడుక్కునే మంచి రోజుకు మనమెంత దూరంలో ఉన్నామో తెలియదు. ఇందులో అమ్మణ్ణిని తప్పుబట్టవలసిన పనేముంది! ఆ పిల్ల వాళ్ళకు కలిగినంతలో ఉన్న దుస్తుల్ని శుభ్రంగా ఉతుక్కునే తొడుక్కుంటుంది. రిజిష్టరులో అమ్మణ్ణిదే తొలి పేరుగావడం ముఖ్యంగాదు. చదువులోగూడా ఆ పిల్లదే ప్రథమ స్థానం గావడం విశేషం. అడిగిన ప్రశ్నకు చక్కగా జవాబు చెబుతుంది. కుదురుగా ముత్యంలా కూర్చుంటుంది. నీటుగా నోట్సు రాసుకుంటుంది. సజావుగా హోంవర్కు చేసి చూపిస్తుంది. పాడమంటే ఇంపుగా పాడుతుంది. అనవసరంగా ఎవరితోనూ జోక్యం పెట్టుకోదు. వెకిలిచేష్టలు చెయ్యదు. అందరితోనూ స్నేహంగా ఉండడానికే ప్రయత్నిస్తుంది. ఇందులో నంగనాచితనంగా చెప్పుకోవలసిందేమీ లేదు. లేదంటే రమాబాయి అలా భావించడానికి మరొక బలీయమైన కారణం ఏదో ఉండి ఉండాలి. అదేమిటో వూహించడం కష్టసాధ్యమైన పనేమీగాదు. అమ్మణ్ణి నరసయ్య కూతురు. నరసయ్య పగటి వేళల్లో తోటమాలి. రాత్రుల్లో వాచ్‌మాన్. మునిసిపాలిటి ఆధ్వర్యం క్రింద ఉన్న హైస్కూలు, ఎలిమెంటరీ స్కూలు సంయుక్తంగా నడుపబడుతున్న కాంపౌండులో ఒక చిన్న అవుట్ హౌస్‌లో అతడి కాపురం. వాచ్‌మెన్ నరసయ్య కూతురు చదువుకుంటే చదువుకోనీగాక! క్లాసుకంతా ఫస్టొస్తుందా? మీదుమిక్కిలి తన తలదొక్కినట్టుగా తన కూతురు ప్రక్కనే కూర్చుంటుందా? పాపం, రమాబాయి ఈ దురాగతాన్ని ఎలా సహిస్తుంది?

వారం పది రోజులు గడిచిపోయాయి. తరగతి గదిలో పిల్లలందరూ మామూలు ప్రకారం ఎవరి తావుల్లో వాళ్ళు కూర్చుంటున్నారు. మార్పు జరగలేదన్న వర్తమానం రమాబాయి పాలిటికి ఘోర పరాజయంలా తోచి ఉంటే అందుకు నేను చేయగలిగిందేమీలేదు. ఆమె ఉండి ఉండి తన హోదాలన్నీ అచ్చేసిన కాగితంపైన – “నేను చెప్పిన విషయాన్ని గురించి ఏంచేశారు?' అంటూ ఒక ఉత్తరాన్ని అల్టిమేటంలా జారీ చేసింది. ఎంతగా నిగ్రహించినా, ఆమె నన్ను రంగంలోకి రానీయడం ఖాయమని

నా కనిపించింది. ముభావం వహించినకొద్దీ ఆమె విజృంభిస్తుంది. అందుకని అదే కాగితం పైన ముక్తసరిగా 'సాధ్యంకాదు' అని రాసి పంపించేశాను.

ఇదంతా జరిగింది అక్టోబరు నెల ప్రారంభంలో, వివిధ పోటీలు, డ్రామా రిహార్సల్స్ నిర్వహిస్తూ నవంబరులో వచ్చే పిల్లల పండుగకోసం ఆయత్తం కావడంలో రమాబాయితో వచ్చిన గొడవను గురించి మరిచిపోయాను. మిగిలిన విద్యా సంస్థలలో కన్నా మా స్కూల్లో బాలల దినోత్సవం బాగా జరిగినట్టు పరిగణన రావాలన్నది మా హెడ్‌మిస్ట్రెస్‌గారి ఉబలాటం. అందుకోసమని ఆమె చాలా శ్రద్ధ తీసుకున్న మాటకూడా వాస్తవం. సబ్‌జడ్జిగారు సభాధ్యక్షులుగా విచ్చేశారు. ఆయన సతీమణి బహుమతి ప్రధానం గావించింది. ఆ తర్వాత పిల్లలు చిన్న నాటికలు కొన్ని, డాన్సులు కొన్ని ప్రదర్శించారు. వినోద ప్రదర్శనాల్లో విశిష్టత నిరూపించుకున్న పిల్లలకు సైతం చిట్టచివర బహుమానాలు పంచి పెట్టబడ్డాయి. కార్యక్రమం జాతీయ గీతంతో శుభప్రదంగా ముగిసింది అంటూ చెప్పుకోడమే ఇంక తరువాయి, ఈ ఆఖరు ఘట్టంలో పదిమంది భద్ర మహిళల్ని వెంటబెట్టుకుని మన తెలుగు సినిమాల్లో ఇంటికోడల్ని ఆరడిపెట్టే ఆడపడుచులా రమాబాయి స్టేజీపైకి వచ్చేసింది. "హెడ్‌మిస్ట్రెస్ ఎక్కడ! పి.ఇ.టి ఎక్కడ? నాలుగో తరగతి టీచర్ ఎక్కడ! దమ్ములుంటే ఇక్కడికొచ్చి నాకు జవాబు చెప్పండి. మిమ్మల్ని అడిగేవాళ్లెవరూ లేకపోయారా? స్కూలనేది అప్పటికి మీ సొంత రాజ్యమైపోయిందా? మీ స్కూలు వాచ్‌మాన్‌పై మీ కభిమానముంటే ఉండొచ్చు. అతడు మీరు చెప్పిన పనులన్నీ చేసి పెడుతున్నాడంటే, అందుకు వేరే బక్షీసులు ఇచ్చుకోవచ్చుగా! ఆయిన ప్రయిజులన్నీ అతని కూతురుకే దోచి పెడతారా? మా అమ్మాయిలు మీకు కొరగాకుండా పోయారా? ఏదో ఉత్సవమని పేరుబెట్టి, ఇంతమందిని ఇక్కడికి పిలిపించి ఇదేనా మీరు చేసే సన్మానం? ఇదంతా మీకు నవ్వులాటగా ఉందేమో! నే నూరుకునే దాన్నిగాను. ఉండండి, మీ పని చెబుతాను."

"అబ్బే కాదండీ, రమాబాయిగారు! నామాట వినిపించుకోండి. దయచేసి అపార్థం చేసుకోకండి...' అని హెడ్‌మిస్ట్రెస్ గారు బ్రతిమాలుకుంటూ వెంట బడుతున్నా వినిపించుకోకుండా రమాబాయి పరివార పరివేష్టితురాలై తారాచువ్వలా కాంపౌండు దాటి వెళ్ళిపోయింది.

మ్యునిసిపల్ ఆఫీసులో రమాబాయి మాటకుగల జరుగుబాటు మాకందరికీ విదితమే. పేరంట్స్ అసోసియేషన్ తరపున ఆమె కంప్లయింటు రాసిపడేస్తుంది. పై అధికారులు సంజాయిషీ చెప్పుకోవలసిందిగా మాకు నోటీసు లిచ్చేస్తారు. మా వాదాన్ని

గూడా వినిపించుకోవాలన్న పట్టింపు వాళ్ళకుండక పోవచ్చు. అప్పుడిక మా గోడంతా అరణ్యరోదనమే. వార్నింగులు రావచ్చు. ఇంక్రిమెంట్లు కట్ గావచ్చు. సర్వీసు రిజిష్టరులో బ్లాక్ మార్కులు పడొచ్చు. ఆ వచ్చే శ్రీముఖం ఎలా ఉంటుంటందో ఏమిటోనని మా స్టాఫ్ మెంబర్లందరూ వూపిరి బిగపట్టుకుని బడికొస్తున్నారు.

ఆఖరుకొక రోజున ఆ కాగితం కాస్తా రానే వచ్చింది.

సంజాయిషీని డిమాండ్ చేస్తూ వచ్చిన నోటీసూ గాదు, ఎంక్వయిరీకి సిద్ధంగా ఉండమని చెప్పే హుకూమూ గాదు. అది ట్రాన్స్‌ఫరు ఆర్డరు.

ఆ బదిలీగూడా టీచర్లకెవరికీ గాదు హెడ్‌మిస్ట్రెస్ కసలేగాదు. వాచ్‌మెన్ నరసయ్యకు!

రమాబాయి అక్కసు ప్రధానంగా నాపైన కేంద్రీకరించి ఉండవలసింది. ఆమెకేదైనా అపచారం జరిగిందంటే అది నరసయ్య మూలంగా మాత్రం గాదు. లేదంటే మునుపటికొక తోడేలు మేకపిల్లను తినేయడానికి చెప్పినట్టుగా, నరసయ్యను మార్పించడానికి రమాబాయికి గల కారణాలు రమాబాయికి ఉండొచ్చు.

టవును కటు చివర ఉన్న మ్యునిసిపల్ గెస్ట్‌హౌసుకి నరసయ్య బదిలీ చేయబడ్డాడు.

తాంబూలంలో అరటిపండ్లు పెట్టి తీసికొచ్చి అమ్మణ్ణి టీచర్లదగ్గర సెలవు తీసుకుంది. నరసయ్య కాపురం గెస్ట్‌హౌవుస్‌కు చేరువగా ఉన్న ఔట్ హవుసుకు మారింది. అతడు టి.సి. తీసుకెళ్ళి కుమార్తెను అక్కడికి దగ్గరగా ఉన్న బడిలో చేర్పించుకున్నాడు.

సంవత్సరాలు గడిచిపోతున్నాయి. పిల్లలు ఒక క్లాసునించీ ఇంకొక క్లాసుకు మారిపోతున్నారు. స్కూల్లో ఎప్పుడైనా అనిత కనిపిస్తే నాకు వెంటనే అమ్మణ్ణి జ్ఞప్తికొస్తుండేది. సురుల్ని తలచుకోగానే అసురులు, నేలను చూడగానే నింగీ, రాగం ప్రసక్తి రాగనే ద్వేషం తలుపుకు రావడం ఎంత విచిత్రం! అనిత, అమ్మణ్ణి ఇప్పుడు ఒక డెస్కులో లేరు. ఒక గదిలో లేరు. ఒక స్కూల్లో లేరు. అయినా, మానసిక ప్రపంచంలో మటుకు వాళ్ళిద్దరూ ఎప్పుడూ జంటగా కలిసే ఉంటారు. ఎంత మిస్టరీ అనిపించేది.

ఇటీవల మా బంధువు ఒకాయన హైదరాబాదునుంచి సకుటుంబంగా ఒక పెళ్ళికోసమని వచ్చి మ్యునిసిపల్ గెస్ట్‌హౌస్‌లో బసచేశాడు. వాళ్ళని సాగనంపడంకోసం నాకక్కడికి వెళ్ళిరావలసిన పనిబడింది. వాళ్ళు కారులో బయల్దేరి వెళ్ళిపోయిన తర్వాత నేను తిరిగి రావడానికి సిద్దపడుతుండగా ఎవరో పరుగెత్తి వస్తున్నట్టు తోచింది.

పావడాచెంగులు పైకెత్తి పట్టుకుని పరుగెడుతూ పన్నెండేళ్ళ అమ్మాయి గసపోసుకుంటూ నా ఎదుట నిలబడిపోయింది.

“నమస్తే మేడం! మేమిప్పుడుండడం ఇక్కడే. మా అమ్మ మిమ్మల్ని పిల్చుకు రమ్మంది. అదే మా ఇల్లు...”

పిల్లలపైన వయసెంత బాగా పనిచేస్తుందో! పలకరించేదాకా అమ్మణ్ణిని పోల్చుకోలేక పోయాను.

“రండీ, టీచరమ్మగారూ! బాగున్నారా? కూచోండి” అంటూ నులకమంచం పైన సిరి చాప పరిచింది రత్నమ్మ. పిల్లల త్రాగడం కోసం కడవలు కడవలు నీళ్ళు తెచ్చి పోస్తుండేది. ముఖ పరిచయమేగానీ, మాట్లాడుకున్నట్టు గుర్తు లేదు.

“అందరూ బాగున్నారు గదండీ! పెద్ద మేడంగారు, హేమావతి మేడంగారు, సునందా మేడం...’ అంటూ పేరు పేరునా క్షేమాలడిగి తెలుసుకుంది రత్నమ్మ. “కొంచెం కాఫీ పుచ్చుకుని వెళ్దురుగానీ...” అంటూ నన్ను కదలకుండా కూచో పెట్టింది “అమ్మణ్ణి బాగా చదువుకుంటుందా?” అడిగాను.

“అంతా మీ దయ, ఏడోతరగతి పరీక్షలో గూడా స్కూలుకు ఫస్టొచ్చింది. అందుకని ఏదో డబ్బుకూడా ఇస్తామన్నారట. అయినా, మన స్కూలు వదిలిపెట్టి రావడమొక్కటేనండి దానికి బెంగ... వచ్చిన కొత్తలో పిలిస్తే పలికేదిగాదు. అన్నం సరిగ్గా తినేదిగాదు. రాత్రుల్లు ఉండుండి కలవరించేది. ఇప్పటికీ మిమ్మల్ని తలచుకోని రోజు లేదంటే నమ్మండి...”

నేను కాఫీ తీసుకుంటున్నాను. గుమ్మానికి ఆనుకుని నిల్చున్న రత్నమ్మ అడగడమా, మానడమా అని కొద్దిసేపు తటపటాయించిన తర్వాత ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా తలపైకెత్తింది. “టీచరమ్మగారూ! అనితమ్మ ఎలా ఉందండీ? బాగా పొడుగైందా? ఎనిమిదో క్లాసు కొచ్చేసింది గదూ?” నాకేమీ అర్థంగాక అయోమయంగా రత్నమ్మ ముఖంలోకి చూస్తున్నాను.

“నాకు మా అమ్మణ్ణి ఎలాగో అనితమ్మ గూడా అంతేనండీ! మా ఇంటాయన మునిసిపాల్టీ నౌకరీలో చేరకముందు మేము పాత కచ్చేరి వీధిలో ఉండేవాళ్లం. అప్పట్లో నేను చంద్రారావుగారింటో పని చేస్తుండేదాన్ని..”

“అలాగా? అయితే నీకు అనిత చిన్నప్పటినుంచీ తెలుసునన్నమాట!” అన్నాను.

"తెలీకేమండి! మూడో నెల జరుగుతుండగా తల్లి దగ్గర పాల్లేకపోయాయి. డబ్బా పాలు పాప ఆరోగ్యానికి సరిపడకపోయింది. అప్పుడు అమ్మణ్ణికి ఆరో నెల. ఏడాది నిండేదాకా అనితకుగూడా నేను పాలిచ్చాను. చెరొకవైపు తాగేవాళ్ళు. పక్క పక్కన పడుకోబెడితే అక్క చెల్లెళ్ళలా ఎంత ముద్దొచ్చేవారో! మన స్కూలు దగ్గరున్నప్పుడు రోజూ చూస్తుండేదాన్ని. ఇక్కడ కొచ్చాక ఆ ప్రాప్తం లేకపోయింది. టీచరమ్మగారూ! ఎప్పుడైనా, ఈ వైపొస్తే మా ఇంటికొచ్చి వెళ్లమని అనితమ్మతో చెప్పరూ? మూడేళ్లయింది. చూచి బిడ్డ కళ్లలో మెదిలినట్టుంది..." చెమ్మగిల్లిన కళ్లను చీర కొంగుతో తుడుచుకుంటూ అంది రత్నమ్మ.

గుండె గుడిలో గంటలు మ్రోగినట్లయినా నా ఒళ్ళు పులకించిపోయింది. మాతృప్రేమ గూడా ఒక రకమైన స్వార్థం కాబోలు ననుకున్నాను. అది పాక్షిక సత్యం మాత్రమే. పూర్తి నిజంగాదు. అల్పజ్ఞురాల్ని. లెంప లేసుకుంటున్నాను.

* * *

# విషాతం

**- కె.ఆదర్శ సామ్రాట్**

**మా** వేసవి బడి ఇంకో మూడురోజులలో ముగుస్తుందనగా ఒక అనూహ్యమైన ఘటన జరిగింది.

ఆరోజు సాయంత్రం... అరుణగీత ఆడుకోడానికి రాలేదని కొంచెం ఆలస్యంగా గుర్తించిన నేను, సంగతేమిటో తెలుసుకుందామని తన గదికి వెళ్ళాను.

అక్కడ నాకు కనుపించిన హృదయ విదారకమైన దృశ్యాలను జీవితంలో నేనెప్పుడు చూడలేదు హార్రర్ సినిమాలోని అతి భయంకరమైన దృశ్యాన్ని చూస్తున్నట్లుగా కొన్ని క్షణాలవరకు స్థాణువులా ఉండిపోయాను.

మూడు వారాలుగా అరుణగీత రాసిన కథలు, కవితలు, వ్యాసాలు, గీసిన చిత్రాలు, మట్టితోను, గాజులతోను తను ఎంతో అందంగా చేసిన బొమ్మలూ, వస్తువులూ అన్నీ ముక్కలు ముక్కలై గదంతా చెల్లాచెదురుగా పడివున్నాయి. ఈ భీభత్స దృశ్యం మధ్య తన పక్కమీద బోర్లాపడుకుని ఆ చిన్నారి వెక్కివెక్కి ఏడుస్తోంది.....

"ఈనాడు దేశంలో రెండు భయంకరమైన ఆర్తనాదాలు విన్పిస్తున్నాయి. ఒకటి అన్నమోరామచంద్రా అయితే రెండోది ఇంగ్లీషో రామ చంద్రా! ఒకవిధంగా చూస్తే అన్నంకోసం చేసే ఆర్తనాదాల కంటే ఇంగ్లీష్ కోసం పెట్టే వెర్రికేకలు అతి భయంకరంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరుతాము నేర్చుకున్నా నేర్చుకోకపోయినా సరే తమ పిల్లలు మాత్రం ఇంగ్లీష్ నేర్చుకోవాలని తాపత్రయపడుతున్నారు. తమ పిల్లలు ఇంగ్లీష్ నేర్చుకోవాలి. బాగా నేర్చుకోవాలి, బ్రహ్మాండంగా నేర్చుకోవాలి, గడగడా మాట్లాడాలి, గబగబా రాసేయాలి అని అనుకుంటున్నారే కాని అసలు తమ పిల్లలు ఎంత ఇంగ్లీష్ నేర్చుకోవాలి, ఆ ఇంగ్లీషు ఎందుకు నేర్చుకోవాలి, ఈ గడగడా ఇంగ్లీషు, గబగబా ఇంగ్లీషు దేని కోసం

అని మాత్రం ఆలోచించడంలేదు. తల్లిదండ్రుల్లోని విచక్షణారహితమైన ఈ వ్యామోహం ఈనాడు ఎన్నో అనర్థాలకు దారితీస్తోంది"

సుందరయ్య కళాభవనంలో "సృజనాత్మక శక్తి" మీద జరుగుతున్న సెమినార్‌లో రావుగారి ప్రసంగం ఒక ప్రవాహంలా సాగిపోతోంది. ' ఎంత విస్పష్టమైన, నిర్భయమైన అభిప్రాయాలు' అనుకుంటూ నేను ఊపిరితీయడం కూడా మర్చిపోయి ఆలకిస్తున్నాను.

"ఈనాటి పిల్లలు అటు ఇంగ్లీష్‌లో కాని ఇటు తెలుగులో కాని తమ ఆలోచనలు వ్యక్తపరచలేని దయానీయమైన స్థితిలో ఎందుకున్నారు? పిల్లలలోని సృజనాత్మక శక్తి రానురాను ఎందుకు చచ్చిపోతుంది? ఎందుకని ఈనాటి పిల్లలు రెంటికీ చెడ్డ రేవళ్ళలా తయారవుతున్నారు? ఒక మనిషి సృజనాత్మక శక్తి నూటికి నూరుపాళ్ళూ వికసించే అవకాశం కేవలం మాతృభాషలోనే ఉంటుందనీ, పరాయిభాషలో దాని పరిధి చాలా తక్కువని ఎంతమంది తల్లిదండ్రులు గుర్తిస్తున్నారు? ఎందుకని తమ పిల్లల్ని దారుణంగా ఈ ఇంగ్లీష్ భూతానికి బలిచేసి, వాళ్ళను ఎందుకూ పనికిరాకుండా చేస్తున్నారు?"

ఆవేశభరితంగా సాగిన రావుగారి ప్రసంగం ఎన్నెన్నో ఆలోచనలు రేకెత్తిస్తూ మరో అరగంటసేపు నిర్విరామంగా కొనసాగింది.

వ్యాపార దృక్పథంతోనూ లేదా పరిశ్రమల్లో వస్తువుల్ని ఉత్పత్తి చేసేంత యాంత్రికంగాను నడుస్తున్న ఇప్పటి స్కూళ్ళల్లో పిల్లల్లోని శక్తియుక్తులు అణగారిపోతున్నాయనీ, వాళ్ళలోని సృజనాత్మక శక్తి చచ్చిపోతోందనీ, అలా చచ్చిపోతున్న శక్తిని తట్టిలేపడం కోసమే తను వేసవిబడిని నిర్వహిస్తున్నాననీ, ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచుకున్న తల్లిదండ్రులు తమ పిల్లల్ని అందులో చేర్పించవచ్చునీ తెలియచేస్తూ రావుగారు తమ ఉపన్యాసాన్ని ముగించారు.

హాలంతా కరతాళ ధ్వనులతో మార్మోగింది.

తన ఉపన్యాసానికి నేను ఎంతగా ప్రభావితుణ్ణయ్యానంటే! పదేళ్ళు ఉపాధ్యాయవృత్తిలో ఉండి, యజమానుల వ్యాపార ధోరణులను సహించనూ లేక, అరికట్టనూ లేక " ఇక చచ్చినా టీచర్‌గా చేయకూడదు" అని ఐదేళ్ళ క్రితం నాకు నేనే ప్రతిజ్ఞ చేసుకుని గుమస్తా ఉద్యోగంలో స్థిరపడిన నేను మళ్ళీ టీచింగ్‌లోకి రావాలి అనుకున్నంతగా ఆయన ఉపన్యాసం నన్ను కదిలించింది.

అందుకే సెమినార్ ముగియగానే నన్ను నేను రావుగారికి పరిచయం చేసుకుని నా ఉద్దేశాన్ని తెలియచేశాను. ఒక అరగంటసేపు టీచింగ్‌కి సంబంధించిన అనేక ప్రశ్నలు నన్ను అడిగి, చివరకు "మీలాంటి వ్యక్తులు టీచింగ్ నుంచి తప్పుకోవడం ఈ వ్యవస్థ

దౌర్భాగ్యం, నాకు సరిగ్గా మీలాంటి వ్యక్తులే కావాలి. రండి. రేపట్నించి మొదలయ్యే వేసవిబడిలో మీరు కూడా భాగం పంచుకోండి" అంటూ సంతోషంగా నన్ను ఆహ్వానించారు.

నేను చేస్తున్న గుమస్తా ఉద్యోగానికి నెలరోజులు సెలవు పెట్టాలనీ, రావుగారు నిర్వహించే వేసవిబడిలో త్రికరణశుద్ధిగా పాలుపంచుకోవాలనీ అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నాను.

అదే ఈ కథకు ప్రారంభం.

రావుగారు వేసవిబడి పేరుమీద చేపట్టిన ఈ ఒక్క నెల కార్యక్రమానికి 'వికాసం' అని పేరు పెట్టారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఏమిటంటే, పిల్లల్లోని సృజనాత్మక శక్తి అది ఏ రూపంలో ఉన్నప్పటికీ దాన్ని వెలికితీయడం, తీసి సానబెట్టడం. దానితోపాటు రవ్వంత ఫంక్షనల్ ఇంగ్లీషు అబ్బేలా చేయడం. ఈ ఫంక్షనల్ ఇంగ్లీషు ఏమిటంటే మన నిత్యజీవితంలో పలు ప్రదేశాలకు వెళ్ళినప్పుడు మనం వాడే లేక వాడవలసి వచ్చే ఇంగ్లీష్ పదాలు, మాటలు వగైరా, అయినా దీనికంత ప్రాధాన్యత లేదనీ, ఇది సెకండరీ విషయం మాత్రమేనని రావుగారు తను అచ్చేసిన కరపత్రాలలోను, ఇచ్చిన పేపర్ ప్రకటనలోను స్పష్టంగా తెలియచేశారు. కాని దురదృష్టం ఏమిటంటే ఈ వేసవిబడిలో చేరిన యాభైమంది పిల్లలలోను సగం మంది తమ పిల్లలు 'బోలెడంత ఇంగ్లీష్' నేర్చుకోవాలని జాయిన్ చేశారు. అయితే అల్లరి తప్పించుకోవడం కోసం, లేకపోతే ఇంగ్లీష్ నేర్పించేయడం కోసం అంతేకాని సృజనాత్మక శక్తుల గురించి మాత్రం ఎవ్వరూ చేర్పించలేదు.

"విషాదం! ఈ కాలపు ఘోరమైన విషాదం!" రావుగారు వ్యధగా అన్నారు. "నా ప్రకటనలో ఈ ఫంక్షనల్ అన్నమాట చేర్చి పొరపాటు చేశానేమో" అని కూడా బాధపడ్డారు.

"అదే లేకపోతే కనీసం ఒక్కరు కూడా చేరేవారు కాదనుకుంటానండీ" నా అనుమానం వెలిబుచ్చాను.

ఆయన విషాదంగా నవ్వి "కావొచ్చు. మీరన్నది నిజమే కావచ్చు" అన్నారు. అంతలోనే తేరుకుని "సరే తల్లిదండ్రులు ఏ ఉద్దేశంతో చేర్పించినప్పటికీ మనం ఏం చేస్తామని ప్రామిస్ చేశామో అదే చేద్దాం. ఈ విషయంలో ఇక ఎలాంటి రాజీవద్దు" అని దృఢంగా అన్నారు.

అంతే. ఆ క్షణం నుంచి ఇక వెనక్కి తిరక్కుండా రావుగారు, నేను, నాతోపాటు ఎన్నికైన మరో ముగ్గురు టీచర్లు అందరం కలిసి మా లక్ష్యాన్ని ఛేదించడానికి నడుం బిగించాం.

నగర శివారు ప్రాంతంలో ప్రశాంతంగా ఉన్న రావుగారి ఇంట్లో వేసవిబడి కొనసాగుతోంది. చుట్టూ ఎన్నెన్నోచెట్లు, ఎంతో బయటిప్రదేశం, ఒక పదిహేనుమంది పిల్లలు పూర్తిగా నెలరోజులూ ఇక్కడే ఉండిపోయేలా వస్తే, మిగతా పిల్లలందరూ ప్రతిరోజూ వచ్చి పోతున్నారు.

పిల్లలతో కవితలల్లించడం, కథలు చెప్పించడం, పద్యాలు, పాటలు వగైరా సాధన చేయించడం, కథలు వ్యాసాలు మొదలైనవి రాయించడం, నాటికలు వేయించడం, చిత్రాలు గీయించడం, తమ ఆలోచనలని, అభిప్రాయాలను నిర్భయంగా స్పష్టంగా చెప్పేలా చేయడం, రకరకాల ఆటలు ఆడించడం, వాళ్ళతో కలిసి ఆడుకోవడం వీటితో మా ఐదుగురికి సమయం ఎంతో హాయిగా గడుస్తోంది. వీటితోపాటు వాడుకకు తగినంత ఇంగ్లీష్ నేర్పించడం కూడా మా అందరి బాధ్యతగానూ గుర్తించి మెలుగుతున్నాం.

డ్రాయింగ్ అంటే ఏమిటో పొరపాటున కూడా చెప్పని బడి నుంచి వచ్చిన పిల్లలు ఒక దృశ్యాన్ని చిత్రీకరించడంలో కనబరచిన నేర్పు చూసి మేం ఆశ్చర్యపోయాం.

వక్తృత్వం అంటే ఏమిటో కనీసం కలలో కూడా స్పృశించని బడి నుంచి వచ్చిన పిల్లలు వక్తృత్వంలో కనబరచిన ధైర్యాన్నీ, స్పష్టతనీ చూసి మేం నివ్వెరపోయాం.

వ్యాసమనేది ఒకటుందని, దాన్ని పిల్లలతో ఎంతో చక్కగా రాయించవచ్చని అసలే మాత్రం ఆలోచించని బడినుంచి వచ్చిన పిల్లలు వ్యాసరచనలో కనబరిచిన ప్రతిభ చూసి మేం ముక్కు మీద వేలేసుకున్నాం.

ఎన్నెన్ని కళలున్నాయ్ పిల్లల్లో! ఎంతెంత అపారమైన నిధులున్నాయ్ చిన్నారుల్లో! కానీ ఈ కళల్ని, ఈ విద్యని ఏమాత్రం ఎదగనివ్వని, ఎదగనివ్వడంమాట అటుంచి నిర్దాక్షిణ్యంగా నలిపిపారేసే ఈ బళ్ళూ ఈ తల్లి దండ్రులూ... ఈ అవిద్య ఏ సంస్కృతికి ప్రతిఫలం?

"అమ్మా నన్ను ఎదగనివ్వు... నాన్నా నన్ను ఎదగనివ్వు... టీచర్లూ నన్ను ఎదగనివ్వండి" అని ప్రతి చిన్నారి హృదయం ఘోషిస్తున్నట్లుగా అన్పించింది మాకు.

ఆ ఘోష మరీ తీవ్రంగా విన్పించిన పిల్లలు కనీసం సగానికి సగం మంది కన్పించారు మాకు. ఆ సగంమందిలో ఒకరే ఈ కథలోని కథానాయకి అరుణగీత.

అరుణగీత తల్లి ఓ బ్యాంకు ఉద్యోగిని. తండ్రి ఓ జూనియర్ కాలేజీలో లెక్చరరు. ఎనిమిదవ తరగతి పరీక్షలు రాసిన ఆ అమ్మాయిని తల్లిదండ్రులిద్దరూ బలవంతంగా ఈ వేసవిబడిలో చేర్పించారు. వాళ్ళుండేది అరవైమైళ్ళ దూరంలో కాబట్టి, అమ్మాయి ఇష్టా ఇష్టాలతో ప్రమేయం లేకుండా ఆమెని ఇక్కడే వదిలేసి వెళ్ళిపోయారు. పోతూ పోతూ మా టీచర్లతో,

"మా అమ్మాయి అల్లరి చేస్తుందని మీ సమ్మర్ స్కూల్లో జాయిన్ చెయ్యలేదు. చదువు నేర్చుకోవాలనే జాయిన్‌చేశాం. మీరు చెప్పినట్లు వినకపోయినా, నేర్చుకోకపోయినా మీ ఇష్టం వచ్చినట్లు కొట్టండి" అంటూ ఓ ఉచిత సలహా కూడా పారేశారు.

అలా తల్లిదండ్రుల బలవంతం మీద చేరిన అరుణగీత మొదట్లో ఎంతో ముభావంగా ఉండేది. ఎవ్వరితోనూ మాట్లాడేది కాదు. అంతేకాదు, ప్రతిరోజు ఏదో ఒక సమయంలో ఒంటరిగా కూర్చుని ఏడుస్తుండేది.

అలాంటి అరుణగీత పదిరోజులు తిరగకుండా పూర్తిగా మారిపోయి అందరితో కలిసిపోయింది. దానికి కారణం రావుగారు మా అందరిచేతా సృష్టించిన సంతోషకరమైన వాతావరణం.

మా కార్యక్రమం మొదలైన వారంరోజులకు మొదటి ఫీల్డ్ ట్రిప్ వేసుకున్నాం. పిల్లందరినీ ముందుగా ప్రభుత్వంవారు పెంచే ఓ నీలగిరి వనానికి తీసుకెళ్ళాం. ఆ తర్వాత అందరం కలిసి అక్కడికి దగ్గరలోనే ఉన్న ఓ చిన్న కొండమీదకి బయలుదేరాం.

ఆ కొండంతా నల్లరాతి శిలలతో ఏర్పడి ఉంది. పిల్లలు ఆ శిలలమీదకు ఎక్కుతూ, జారుతూ ఎంతో సంతోషాన్ని అనుభవించారు. శిలల మీదకు ఎక్కి, తమ జేబురుమాళ్ళని జెండాలా ఎగరేసి కేరింతలు కొట్టారు. కొందరు రకరకాల రాళ్ళనీ, ఆకుల్నీ సేకరించారు. కొందరు ప్రకృతి పరిశీలనలోను, సౌందర్య రసాస్వాదనలోను మునిగిపోయారు. మొత్తానికి పిల్లలందరూ ఈ ఇక్కడ ఏదో మిస్ అయింది. కదలించింది. ఆమె తన మాతృభాష తెలుగులో రాసిన ఆ మూడు పేజీల వ్యాసాన్ని చదివిన మాకు మళ్ళీ ఆ ట్రిప్ చేస్తున్నామా అన్న అనుభూతి కలిగింది. అంతేకాదు మా పెద్దవాళ్ళలో ఏ ఒక్కరమైనా ఇలా రాయగలమా అన్న అనుమానమూ కలిగింది. ఆ ప్రకృతిని, ఆ ప్రయాణాన్ని అంత అద్భుతంగా వర్ణించింది ఆ చిన్నారి.

"బండరాళ్ళ మీదకు ఎక్కుతున్న పిల్లలు యుద్ధానికి వెళ్ళే సైనికుల్లా కన్పించారు. దూరంగా పొలంలో కూర్చున్న కొంగలు భూమి నుంచి పుట్టిన చుక్కల్లా అన్పించాయి.

ఒక బండరాయి మీద కదలకుండా ఉండిపోయిన ఎరుపు, నలుపు రంగు తొండ ఆ రాయికి పూచిన పువ్వులా కన్పించింది...”

ఇలాంటి మాటలతో సాగిన ఆమె వ్యాసానికి అందరమూ అబ్బురపడ్డాం. ఎంత చక్కని భావుకత ఉంది ఎంత కమ్మని కవిత్వం ఉంది ఆమె రాతలో!

పొలంలో కూర్చున్న కొంగలు భూమి నుంచి పుట్టిన నక్షత్రాల్లా ఉన్నాయట! బండ మీద కూర్చున్న తొండ ఆ బండకు పూచిన పువ్వులా ఉందట! ఇంతకుమించిన సౌందర్యదృష్టి ఏం కావాలని!?

అదే వ్యాసంలో “భూమి మీద మేం పరిగెత్తుతున్నట్లే ఆకాశంలో మబ్బుపిల్లలు పరిగెత్తుతున్నాయి” అంటూ మబ్బుల్ని మబ్బుపిల్లలుగా వర్ణించడం మాకు ఎంతో మనోరంజకంగా అన్పించింది.

వ్యాసానికి సంబంధించిన రివ్యూ సెషన్‌లో పిల్లలందరికీ అరుణగీత వ్యాసం విన్పించి, మనస్ఫూర్తిగా ఆమెని అభినందించాం.

సరిగ్గా అప్పుడే అరుణగీతలో కదలిక మొదలయ్యింది. ఆ కదలిక ఆమెలో నిద్రిస్తున్న ప్రతి కళనీ తట్టిలేపడం మొదలు పెట్టింది. మొదట్లో పాడడానికి ససేమిరా అన్న అరుణగీత ఇప్పుడు ఎన్నెన్నో పాటలు పాడుతోంది. కొత్తకొత్తవి నేర్చుకుని మరీ పాడుతోంది.

‘నల్లనివాడు, పద్మనయనమ్ముల వాడు’ అన్న పద్యం నేర్పిస్తే “నల్లనివాడు నల్గొండలో ఉండువాడు, నాల్గడుగుల పొడుగువాడు, నాలుగు లక్షల ఆస్తివాడు” అంటూ వాళ్ళ తాతమీద పేరడీ చేసింది.

“వేసవిబడులు ఉండాలా, వద్దా?” అన్న టాపిక్‌మీద పిల్లలందరినీ మాట్లాడమని చెప్పినప్పుడు, అరుణగీత ఏ మాత్రం జంకకుండా ఇలా చెప్పింది.

“సంవత్సరమంతా బడిలో చదువుకుని మళ్ళీ వేసవిబడిలో చేరాలంటే ఎంతో బాధగా ఉంటుంది. నాకైతే మా అమ్మానాన్న వేసవి బడిలో చేర్పిస్తామనగానే చచ్చిపోవాలన్పించింది. ఈ సెలవుల్లోనేను మా బాబాయిగారి ఇంటికి వెళ్ళాలనుకున్నాను. మా బాబాయిగారు ఒక పల్లెటూర్లో ఉంటారు. ఆ ఊరు ఎంతో బాగుంటుంది. ఈ నెలరోజులు అక్కడే ఉండాలని అనుకున్నాను. కాని మా అమ్మా నాన్న బలవంతంగా ఇక్కడ చేర్పించారు. నాకు చాలా బాధగా అన్పించింది... కాని ఇక్కడ ప్రిన్సిపాల్‌గారు, టీచర్లు, వాళ్ళు చేయిస్తున్న పనులు నాకు ఎంతో నచ్చాయి. నేను బాగా రాయగలననీ, చక్కగా కవితలు కూడా రాయగలననీ, మంచిగా

మాట్లాడగలననీ వాళ్ళు చెబితేనే తెలుసుకున్నాను. మా బడిలో ఎప్పుడూ ఇలాంటివి చేయించలేదు. మా అమ్మా నాన్నలు కూడా ఇలాంటివి చేయమని ఎప్పుడూ అడగలేదు. ఇప్పుడు నాకు చాలా సంతోషంగా ఉంది. ఒకవేళ వేసవిబడులు ఉంటే అవి ఇలాగే ఉండాలనీ, ఇలాంటి బడులలో చేరడం ఎంతో మంచిదనీ నేను అనుకుంటున్నాను."

అది కేవలం ఒక్క అరుణగీత గొంతు మాత్రమే కాదనీ, ఈ దేశంలోని కొన్ని కోట్ల మంది చిన్నారుల గొంతనీ మాకు అన్పించింది.

అవును... ప్రశ్నలు, జవాబులు, ఖాళీలు, మార్కులు, ర్యాంకులు, పాసులు, క్లాసులు ఇవి తప్పించి ఏం పట్టించుకుంటోంది. ఇప్పటి వ్యవస్థ!?

ఎల్.కే.జీ. నుంచి ఇది చెయ్యి అది చెయ్యి ఇది నేర్చుకో అది నేర్చుకో అని బలవంతంగా తమ అభిప్రాయాలను రుద్దడం తప్పించి పిల్లల మనస్సుని, మనోభావాల్ని, వాళ్ళ లోని సృజనాత్మక శక్తిని ఎక్కడ ఎదగనిస్తున్నారు పెద్దలు? ఎక్కడెక్కడ అలా ఎదిగే అవకాశం వస్తుందో అక్కడ పిల్లలు నిజంగా పిల్లలవుతారు. నిజమైన పిల్లలవుతారు. అదే నిరూపించింది మా వికాసం కార్యక్రమం.

పిల్లలందరు ఎన్నెన్నో అంశాల్లో తమ శక్తిని, ప్రతిభను చూపించారు. అరుణగీత లాంటి పిల్లలయితే ఓ అరడజను కంటే ఎక్కువ అంశాల్లో తమ నైపుణ్యాన్ని, శక్తిని ప్రదర్శించారు.

కవితలల్లడం, కథలు చెప్పడం, వ్యక్తిత్వం, వ్యాసరచన, పాటలు పాడడం, చిత్రలేఖనం, నాటికల్లో వేయడం ఎందులో శక్తిని చూపించలేదని? ఇన్నిన్ని అంశాల్లో తన ఇష్టాన్ని, ప్రతిభను చూపించే అరుణగీతను ఎంత ఎడంగా ఉంచారు ఆమె అమ్మానాన్న! అసలు తమ పిల్లల విలువను తామే ఎందుకు గుర్తించలేదు ఈ తల్లిదండ్రులు?

రాను రాను అరుణగీత ఎంత చలాకీగా మారిందంటే తను ఏమాత్రం ఇష్టపడని క్రికెట్, వాలీబాల్‌లాంటి ఆటల్ని కూడా మిగతా పిల్లలతో సమానంగా ఆడడం మొదలుపెట్టింది.

మా కళ్ళముందు, మా చేతుల్లో విచ్చుకున్న ఆ మొగ్గని చూసి మా అందరికీ సంతోషంగా అన్పించింది. ఎంతో గర్వంగా కూడా.

మా వేసవి బడి ఇంకో మూడు రోజుల్లో ముగుస్తుందనగా ఒక అనూహ్యమైన సంఘటన జరిగింది.

ఆ రోజు సాయంత్రం... అరుణగీత ఆడుకోడానికి రాలేదని కొంచెం ఆలస్యంగా గుర్తించిన నేను, సంగతేమిటో తెలుసుకుందామని తన గదికి వెళ్ళాను.

అక్కడ నాకు కన్పించిన హృదయవిదారకమైన దృశ్యం నా జీవితంలో నేనెప్పుడూ చూడలేదు. హారర్ సినిమాలోని అతిభయంకరమైన దృశ్యాన్ని చూస్తున్నట్లుగా కొన్ని క్షణాలవరకు స్థాణువులా ఉండిపోయాను.

మూడు వారాలుగా అరుణగీత రాసిన కథలు, కవితలు, వ్యాసాలు గీసిన చిత్రాలు, మట్టితోను, గాజులతోను తను ఎంతో అందంగా చేసిన బొమ్మలూ వస్తువులూ అన్నీ ముక్కలు ముక్కలై గదంతా చెల్లాచెదురుగ పడివున్నాయి. ఈ భీభత్స దృశ్యం మధ్య తన పక్క మీద బోర్లాపడుకుని ఆ చిన్నారి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"అరుణా ఏం జరిగిందమ్మా?" గద్గదమైన గొంతుతో లాలనగా అడిగాను.

మరో రెండుసార్లు అడిగాక కాని తను జవాబు చెప్పలేదు. అప్పటి వరకు తన గుండెలకింద నలుగుతున్న ఉత్తరాన్ని మౌనంగా నాకు అందించి మళ్ళీ బావురుమని ఏడ్వసాగింది.

వణుకుతున్న చేతులతోను, దడదడలాడే గుండెతోను ఆ ఉత్తరాన్ని విప్పాను. అది వాళ్ళ నాన్న తనకు రాసిన ఉత్తరం! పదిరోజుల క్రితం రాసిన ఆ ఉత్తరం ఏ కారణం వల్లో ఈ నాటికి చేరింది.

**"చిరంజీవి అరుణకు–**

మీ నాన్న ఆశీర్వదించి వ్రాయునది. ఇక్కడ మేము క్షేమం. రెండు రోజుల క్రితం నీవు రాసిన ఉత్తరం ద్వారా నీ క్షేమసమాచారములు తెలిసినవి. నీ ఉత్తరం చదివాక మీ అమ్మకు, నాకు సంతోషించాలో, ఏడ్వాలో అర్థం కాలేదు. నువ్వు చేరిన వారం రోజులకల్లా మాకు ఇంగ్లీష్‌లో ఉత్తరం రాస్తావని అనుకున్నాం. కాని నువ్వు తెలుగులోనే రాశావు. పోనీ తెలుగులో రాస్తే రాశావు ఇంగ్లీష్ బాగా నేర్చుకుంటున్నానని రాస్తావేమో అని అనుకున్నాం. కాని నీ ఉత్తరంలో ఎక్కడా ఆ మాటలేదు. అసలు నీ ఉత్తరంలో నువ్వు నేర్చుకుంటున్న ఇంగ్లీష్ గురించిన ప్రస్తావనే లేదు. ఇది మా ఇద్దరినీ బాగా బాధపెట్టింది.

చూడమ్మా, ఇంత డబ్బు ఖర్చుపెట్టి నిన్ను అంత దూరం చేర్పించింది నువ్వు బాగా ఇంగ్లీష్ నేర్చుకోవాలనే కాని చిల్లర విషయాలలో పైకి రావాలని కాదు. కవితలు,

కథలు, వ్యాసాలు వీటిదేముంది? వీటిని ఏ తెలివి తక్కువవాడైనా రాయగలడు. ఇలాంటి వాటిలో నువ్వు బాగా ఉన్నావని చెప్పి ఇంగ్లీష్ నేర్చుకోవడం పక్కకు పెట్టకు. అన్నట్లు కథలు, వ్యాసాలు మొదలైనవి ఇంగ్లీష్‌లో రాస్తే గొప్పగాని తెలుగులో అయితే మూడోతరగతి పిల్లలు కూడా రాయగలరు. కాబట్టి ఇలాంటి చిల్లర విషయాలు పక్కకు పెట్టి నీ మనసంతా ఇంగ్లీష్ మీద పెట్టు. ఇంగ్లీష్ ఎంత గొప్పగా వస్తే ఈ రోజుల్లో అంత గౌరవం ఉంటుంది. కాబట్టి నువ్వు బాగా ఇంగ్లీష్ నేర్చుకుని, ఇక్కడికి వచ్చేసరికి గడగడా ఇంగ్లీష్ మాట్లాడాలి కోరుకుంటున్నాం. ఈ సారి నువ్వు వ్రాసే ఉత్తరం కూడా ఇంగ్లీష్‌లోనే ఉంటుందని మీ అమ్మ, నేను ఆశపడుతున్నాం.

వెంటనే జవాబు వ్రాయి.

ఇట్లు

మీ నాన్న"

"పి.ఎస్: నువ్వు రాసే కవితలు, వ్యాసాలు మొదలైనవి ఎంత గొప్పగా ఉన్నప్పటికీ అవి ఇంగ్లీష్‌లో ఉంటేనే మేం చూస్తాం. తెలుగులో ఉంటే చూడం"

ఇదీ అరుణగీత తండ్రి రాసిన ఉత్తరం! ఆ ఉత్తరం చదవగానే అతణ్ణి సాచి లెంపకాయ కొట్టాలని అన్పించింది.

ఒక మొగ్గ, ఒక లేలేత మొగ్గ. తనేమిటో తనలో ఏముందో తన తల్లిదండ్రులు, స్కూలు టీచర్లు ఎవ్వరూ గుర్తించనివేళ" రా! వికసించు. వికసించడమే నీ ధర్మం. నీలో ఉన్నదంతా బయటకు తీయి. రా, వికసించు" అన్న హామీ వినిపించి సహస్రదళాలుగా విచ్చుకుంటున్నవేళ వజ్రఘాతంలా ఓ దెబ్బ తగిలితే ఎలా ఉంటుందో సరిగ్గా అలాగే ఉంది ఇప్పటి అరుణగీత పరిస్థితి.

ముక్కలు ముక్కలై చెల్లాచెదురైన సృష్టిని చూసి నా కళ్లనుంచి జలజలా కన్నీళ్లు రాలాయి.

అప్పుడే అక్కడకు వచ్చిన రావుగారికి నా చేతిలోని ఉత్తరాన్ని అందించి కిందికి వంగాను. నీళ్లు నిండిన కళ్లకు అన్నీ అలుక్కుపోయినట్లు కన్పిస్తున్నప్పటికీ ఓపికగా ఓక్కో ముక్క నీ ఏరడం మొదలు పెట్టాను. మరికొన్ని క్షణాలలోనే నా సహచరులు కూడా ఈ పనిలో చేతులు కలిపారు. మా అందరిలోనూ ఒకే ప్రశ్న.

తెగిపడిన ఈ ముక్కల్ని ఎలాగో ఒకలా అతికించవచ్చు. కాని అరుణగీత హృదయాన్ని ఎలా అతికించాలి??

రావుగారు, నేను ఒక రాత్రంతా కూర్చుని అరుణగీత కవితల్ని, వ్యాసాల్ని, చిత్రపటాలనీ జాగ్రత్తగా అతికించాం. అతికించిన వాటిని ఫైలు చేశాం. ఈ విషయం గురించి ఏమన్నా చర్చించడానికి కూడా వీల్లేనంత బరువుగా మా హృదయాలు మారిపోయాయి.

ముగింపురోజున జరిగే సమావేశానికి తల్లిదండ్రులు కూడా రావాలని ముందుగానే కబురు చేశాం. అయినాసరే ఒక పది పన్నెండుమంది పిల్లల అమ్మా నాన్నలు తప్పించి ఇంకెవ్వరు రాలేదు. వచ్చిన వాళ్లలో అరుణగీత తల్లిదండ్రులు కూడా ఉన్నారు. వాళ్లను చూస్తుంటే ప్రయాణించిన అరవై మైళ్లూ, 'ఇంగ్లీషో ఇంగ్లీషో' అని గుండెలు బాదుకుంటూ వచ్చారనిపించింది. అతికష్టం మీద నా కోపాన్ని నిగ్రహించుకున్నాను.

ముందుగా రావుగారు మాట్లాడుతూ ఈ వేసవిబడిని ఎందుకు నడిపించాం? దీని ఉద్దేశం ఏమిటి, దీని లక్ష్యాన్ని సాధించడానికి ఎంతవరకు ప్రయత్నించాం అన్న విషయాన్ని పూసగుచ్చినట్లు చెప్పారు.

ఆ తర్వాత మా టీచింగ్ బృందలోని మిగతా ముగ్గురు ఈ నెలరోజులు తాము ఏం నేర్పించాం. ఏం నేర్చుకున్నాం. అన్న విషయాన్ని క్లుప్తంగా వివరించారు.

చివరగా నా వంతు వచ్చింది.

అప్పుడు నా ముఖం ఎలా ఉందో ఏమో నాకు తెలీదు. బహుశా తుఫాను ముందరి ప్రశాంతతలా ఉండి ఉంటుందనుకుంటాను.

"డియర్ పేరెంట్స్" అంటూ మొదలుపెట్టి, నా చేతిలో ఉన్న ఫైలుని ఎత్తిపట్టి ఆవేదనగా ఇలా అన్నాను.

"ఈ ఫైల్లో ఒక రచయిత్రి ఉంది. ఒక కవయిత్రి ఉంది. ఒక వ్యాసకర్త, ఒక చిత్రకారిణి, ఒక ఉపన్యాసకురాలు, ఒక పరిశీలకురాలు ఈ ఫైల్లో ఉంది. ఒక భావుకురాలు, ఒక సున్నిత మనస్కురాలు, ఒక క్రీడాకారిణి ఈ ఫైల్లో ఉంది. రేపు పొద్దున్న ఈ సమాజంలో ఒక చిచ్చరపిడుగులా విరుచుకుపడబోయే, ఒక సృజనాత్మక శక్తిలా వ్యాపించబోయే ఒక మంచి అమ్మాయి ఈ ఫైల్లో ఉంది. ఓ ఐయామ్‌సారీ జెంటిల్‌మెన్. ఐయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ", ఇంతసేపు ఉంది ఉంది అంటున్నాను. కాని

ఆ మాట తప్పు. ఉంది కాదు ఉండేది. హఠాత్తుగా నా గొంతు గద్గదమయ్యింది. "అవును ఉండేది. వన్సపానెటైమ్ అంటే మొన్న సాయంత్రంవరకు"

ఉబికివస్తున్న దుఃఖం నా గొంతుని పూడ్చేయకుండా ఎంతో కష్టపడవలసి వచ్చింది.

"మొన్న సాయంత్రం ఈ అమ్మాయి తండ్రి నుంచి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో ఒకే ఒక్కమాట ద్వారా ఆ అమ్మాయి తండ్రి ఆమెలోని కళల్ని, శక్తిని, ఉత్సాహాన్ని నిలువెల్లా నరికేశాడు. ఆ మాట ఏమిటో తెలుసా మిత్రులారా, ఇంగ్లీషు! అవును అక్షరాలా ఇంగ్లీషే. మనం కవులు కావడం కంటే, కళాకారులు కావడంకంటే మనలోని శక్తియుక్తుల్ని, ప్రయోజకత్వాన్ని బయటకు తెచ్చుకోవడం కంటే నాలుగు ఇంగ్లీష్ ముక్కలు నేర్చుకోవడం గొప్ప విషయం అని మనం భావించేంతకాలం ఇప్పుడే నేను చెప్పిన ఈ హత్యల్లాంటివి తప్పవు. ఈ ఇంగ్లీష్ భూతం ఎంత గొప్పదంటే, మేమందరం రాత్రింబవళ్లు కష్టపడి నెలరోజులుగా నిర్మించిన శిల్పాన్ని వాళ్ల నాన్న ఒకేఒక్క మాటతో ముక్కలు చేశారు. సోగ్రేట్ ఇండీడ్. ఆయన్ని అభినందించకుండా ఉండలేకపోతున్నాను"

మూడు రోజులుగా నిగ్రహిచుకున్న దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. నా కుర్చీలో కూలిపోయి పిల్లలకంటే అన్యాయంగా ఏడ్వసాగాను.

అంతా నిశ్శబ్దం

నా ఏడ్పు తప్పించి ఇంకేదీ విన్పించనంత నిశ్శబ్దం.

హఠాత్తుగా ఆ నిశ్శబ్దం నుంచే ఒక మధురమైన గొంతు విన్పించింది.

"మాస్టారూ"

చివ్వున తలెత్తి చూశాను.

"మీరు ఏడిస్తే మాకూ ఏడుపొస్తుంది. ఇన్ని రోజులూ మీరు మమ్మల్ని ఎంతగానో నవ్వించారు. మేం వెళ్లిపోయేరోజున మీరిలా బాధపడడం మాకు కష్టంగా ఉంటుంది"

అరుణగీత! ఆ మాటలు అంటున్నది అరుణగీత!

కొన్న క్షణాలవరకు నా కళ్లను నేను నమ్మలేకపోయాను. మూడు రోజుల్నుంచి ఎవ్వరితోను ఒక్కమాటైన మాట్లాడని అరుణగీత ఈరోజు అందరిముందు తన టీచర్ని

ఓదారుస్తోంది ఏడ్వొద్దని మందలింపుగా చెబుతోంది. అదే సమయంలో నా కర్తవ్యాన్ని గుర్తు చేస్తోంది.

ఇది నిజమేనా?!

సూటిగా అరుణగీత కళ్లలోకి చూశాను.

ఆ కళ్లనుంచి ఓ నిశ్శబ్దమైన భావం వచ్చి నా హృదయాన్ని తాకింది.

"మాస్టారూ, మీరు వర్ణించిన ఆ కవయిత్రీ, ఆ రచయిత్రీ, ఆ చిత్రకారిణి ఎక్కడికీ వెళ్లిపోలేదు. ఈనాటి మీ కన్నీళ్లతో ఆ అమ్మాయికి ఎనలేని శక్తి సామర్థ్యాలొచ్చాయి. ఆమెలోని సృజనాత్మక శక్తి బతికివుంది. బ్రతికే ఉంటుంది. మీ కన్నీళ్లపై"

అరుణగీత ఏడుస్తూ కంటపడిన క్షణం నుంచి నవ్వంటే ఏమిటో మర్చిపోయిన నేను క్షణం మనసారా నవ్వాను.

కళ్ల నుంచి జారే దుఃఖాశ్రువులు ఆనందాశ్రువులుగా మారే క్షణాలు జీవితంలో ఎంతో మహత్తరమైనవి.

అలా నవ్వుతూనే అరుణగీతను అభినందించిన నేను, అదే చూపును ఆమె తండ్రి మీదకు ప్రసరించేసరికి అతను చప్పున తలదించుకున్నాడు. అతనితోపాటు అతని భార్య కూడా.

ఈ కథలన్నీ మన చదువుల చుట్టూ తిరిగేవి. మన పిల్లల చుట్టూ అల్లుకొన్నవి. మనం ప్రాణానికి ప్రాణంగా పెంచుతున్న పిల్లల గురించీ, మనం అనునిత్యం తహతహలాడిపోతున్న వాళ్ళ చదువుల్ని గురించీ చేయి తిరిగిన రచయితలు చెప్పుకొచ్చినవి.

మన చదువులు ఎంత డొల్లచదువులో, ఎంత వికృత విన్యాసాలో అరటిపండు వొలిచి పెట్టినట్టు చెప్పడమే గాదు. మన పిల్లలెంత ప్రేమమూర్తులో వీళ్ళ రంగురంగుల మనోభావాల్ని విశ్లేషించడం ఎంతకష్టమో కూడా వాళ్ళ హృదయాల్లోకి తొంగి తొంగి మరీ చూడమంటాయీ కథలు.

ప్రజాశక్తి బుక్‌హౌస్